




ESTD: 1999

www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 30-09-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 305 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal

Follow us on









## ప్రాజెక్టులకు అనుమతులివ్వాలి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (ఎఎంఎస్) :** తుమ్మిడిహట్టి వద్ద ప్రతిపాదిత ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, త్వరితగతిన అవసరమైన అన్ని అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వేడుకున్నారు. దేశ రాజధానిలో కేంద్రమంత్రితో భేటీ అయిన ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో తెలంగాణ నిర్మిస్తున్న పలు సాగునీటి ప్రాజెక్టుల అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర అడిగిన సమగ్ర సమాచారాన్ని ఇప్పటికే అందించినట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఎల్లంపల్లికి నీటి తరలింపునకు ఒప్పందం అత్యవసరం:తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్టను సముద్ర మట్టానికి నూట యాభై రెండు మీటర్ల గరిష్ఠ నీటిమట్టం స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్రల మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఆ నిర్దిష్ట నీటిమట్టం స్థాయిలో నిర్మాణం చేపడితేనే సహజ గురుత్వాకర్షణ పద్ధతి ద్వారా ఎల్లంపల్లి జలాశయానికి నీటిని తరలించేందుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు.

## మా భూములు మాకిప్పించండి

### సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసిన బాధితులు
### శివారు వెంకటాపూర్ రైతులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ
### ధరణి అక్రమాలపై విచారణకు మంత్రి పొంగులేటి ఆదేశం

**హైదరాబాద్,సెప్టెంబర్ 29 (వుదయం) :** సిద్దిపేట జిల్లా, గజ్వేలు నియోజకవర్గ పరిధిలోని మార్కూక్ మండలానికి చెందిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్ నిర్వహణలో చోటుచేసుకున్న రికార్డుల మార్పుల వల్ల తమ తాతముత్తాతల కాలం నాటి సాగుభూములపై హక్కులు కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

సోమవారం సచివాలయంలో శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితర రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నేరుగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హక్కుల గుర్తింపు లోపం: శివారు వెంకటాపూర్ గ్రామంలోని సర్వే సంఖ్యలు 38, 41, 47, 85, 88, 100లలో ఉన్న దాదాపు 134 ఎకరాల సాగుభూమిలో తమ కుటుంబాలు తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాయని బాధితులు తెలిపారు. అయితే, ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం వల్ల తమ సొంత పొలాలపై హక్కులు లేకుండా పోయాయని వాపోయారు.



పాత పుస్తకాల సేకరణ మోసం: గత ప్రభుత్వ హయాంలో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తామని చెప్పి అధికారులు తమ వద్ద ఉన్న పాత పాస్‌పుస్తకాలను తీసుకున్నారని, కానీ ఆ తర్వాత కొత్తవి ఇవ్వకుండా తమను తీవ్రంగా వంచించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ధరణికి ముందున్న తమ పాత పుస్తకాలు, గ్రామ పటాలను మంత్రికి చూపించారు.

భూముల విలీనం అక్రమం: అప్పట్లో సరిహద్దుల లెక్కింపు పేరుతో తమ గ్రామ వ్యవసాయ భూములను పక్కనే ఉన్న ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే సంఖ్య 325లో కలిపేసి కొత్త పటం రూపొందించారని, దీనివల్ల తాము సర్వస్వం కోల్పోయామని ఆరోపించారు.

సమగ్ర సర్వే, పరిహారం అభ్యర్థన: ప్రస్తుతం ఎర్రవెల్లిలోని సర్వే సంఖ్య 325లో ప్రభుత్వం చేపడుతున్న తరహాలోనే, తమ శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ పూర్తిస్థాయి సర్వే నిర్వహించాలని కోరారు. పాత రికార్డులు, పాత పాస్‌పుస్తకాలు, గ్రామ పటం మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చి చూసి సరిహద్దులు స్పష్టంగా గుర్తించి ఎవరి భూములను వారికి అప్పగించాలని వేడుకున్నారు.

జలాశయ బాధితులకు అన్యాయం: జలాశయ నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన తమ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని విన్నవించారు. అలాగే దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగా జలాశయంలో కలిపేశారని, దీనివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులకు మంత్రి హామీ:రైతుల విన్నపాన్ని ఓపికగా విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను బయటకు తీస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగనివ్వమని, ఎవరి భూమిని వారికే దక్కించేలా చట్టప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, సర్వే మరియు భూ సెటిల్మెంట్స్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


## ఐదు లక్షల కోట్లు ఆదా చేసిన కొత్త విధానం

### జనసేవే దేశసేవగా పాతికేళ్ల ప్రజాపాలన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (ఎఎంఎస్) :** జనసేవే దేశసేవ అనే పవిత్ర ఆశయంతో, నిరంతర శ్రమయే శ్వాసగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రతినిధిగా పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్నారు. సేవ మరియు సుపరిపాలన ప్రాతిపదికగా, రెండు వేల నలభై ఏడేళ్ల నాటికి వికసిత భారత్ రూపుదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోంది. ఆల్ రౌండర్ అభివృద్ధితో పాటు సామాజిక సాధికారత ద్వారా సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ మార్పుకు ప్రధాన ఉదాహరణే ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకే జమచేసే నూతన విధానం. దళారీ వ్యవస్థకు చరమగీతం:రెండు వేల పద్నాలుగులో ప్రారంభమైన ఈ నేరుగా నగదు జమచేసే విధానం వల్ల దేశంలో సంక్షేమ పథకాల నిర్వహణ స్వరూపమే మారిపోయింది. మధ్యవర్తుల జోక్యాన్ని పూర్తిగా నిర్మూలించి, అవినీతి మరియు లీకేజీలకు అడ్డుకట్ట వేయడం ద్వారా పరిపాలనలో పారదర్శకత, సామర్థ్యం, బాధ్యతాయుత వాతావరణం నెలకొన్నాయి. గతంలో ఒక వెయ్యి తొమ్మిది వందల ఎనభై ఐదో సంవత్సరంలో నాటి ప్రధాని ఒక ప్రకటన చేస్తూ.. ప్రభుత్వం పేదల కోసం ఇచ్చే రూపాయిలో కేవలం పదిహేను పైసలు మాత్రమే అసలైన లబ్ధిదారుడికి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వేల పద్నాలుగు వరకు పరిస్థితులు అలాగే కొనసాగాయి. అయితే, కొత్తగా వచ్చిన ఈ విప్లవాత్మక విధానం ఆ పరిస్థితిని పూర్తిగా మార్చివేసి, సంక్షేమ ఫలాలను నూటికి నూరు శాతం లబ్ధిదారుల ఖాతాల్లోనే జమచేస్తోంది.లక్షల కోట్ల ఆదా - నకిలీలకు చెక్:ఈ ఏడాది ఆగస్టు నాటికి ముప్పై రెండు వందల పథకాల ద్వారా దాదాపు ఏభై మూడు లక్షల కోట్ల రూపాయల నగదును లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారు. నకిలీ లబ్ధిదారుల ఏరివేత, నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడం ద్వారా ప్రభుత్వం ఐదు లక్షల కోట్ల రూపాయలకు పైగా ప్రజాధనాన్ని ఆదా చేయగలిగింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ.. ఈ నూతన నగదు బదిలీ విధానం వ్యవస్థలోని లోపాలను, అవినీతిని పూర్తిగా తుడిచిపెట్టేసిందని స్పష్టం చేశారు.లబ్ధిదారుల ఆనందం:ఆకాశవాణి వార్తా విభాగానికి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చిన్న రైతు దినేష్ కుమార్ రాథోడ్ తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తూ.. ఈ విధానం వల్ల తమలాంటి చిన్న రైతులకు ఎంతో మేలు జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ప్రతిష్ఠాత్మకంగా ఏడాదికి ఆరు వేల రూపాయల ఆర్థిక సాయం నేరుగా తన ఖాతాలోనే జమ అవుతోందని తెలిపారు.మొత్తానికి ఈ డిజిటల్ సంక్షేమ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనపై ప్రజల్లో నమ్మకం పెరగడమే కాకుండా, ఆపదలో ఉన్న వారికి త్వరితగతిన సహాయం అందించడంలో భారతదేశ సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది.



## తెలంగాణ విద్యుత్ సంస్థలపై అదనపు భారం



**హైదరాబాద్,సెప్టెంబర్ 29 (వుదయం) :** రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు తక్కువ ధరకు లభించే స్వదేశీ బొగ్గును పక్కనబెట్టి, అధిక ధరలకు విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడానికి అంగీకరించడం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మరొక తీవ్ర తప్పుడు నిర్ణయమని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విమర్శించారు. టన్ను ముప్పై ఎనిమిది వందల రూపాయలకే లభించే సింగరేణి బొగ్గును వద్దనుకుని, టన్నుకు తొమ్మిది వేల రూపాయలు వెచ్చించి విదేశీ బొగ్గును కొనుగోలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.ప్రజాధనం ఎవరి కోసం?ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ వేదికగా స్పందిస్తూ.. ఈ తరహా నిర్ణయాలు ఎవరి స్వార్థ ప్రయోజనాల కోసం తీసుకుంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాలకుల తప్పుడు విధానాల వల్ల పడే ఆర్థిక భారాన్ని తెలంగాణ ప్రజలు ఎందుకు మోయాలని నిలదీశారు. సింగరేణి ప్రాధాన్యం:దక్షిణ భారతదేశంలోనే అత్యంత భారీ బొగ్గు నిల్వలు కలిగి ఉన్న ఘనత తెలంగాణ ప్రాంతానికి ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రలకు సహజ వనరుగా ఉన్న బొగ్గును సరఫరా చేస్తున్నది మన సింగరేణి సంస్థేనని చెప్పారు.కేసీఆర్ పాలనా తీరు:గతంలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో సింగరేణి బొగ్గును సమర్థవంతంగా వినియోగించుకుంటూ, తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇరవై నాలుగు గంటల నిరంతర విద్యుత్ సరఫరాను విజయవంతంగా అందించామని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పదోవంతే ఉత్పత్తి వ్యయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (ఎఎంఎస్) :** క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల మందులను విచ్చలవిడిగా అధిక ధరలకు విక్రయిస్తుండటంపై దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఔషధాల విక్రయ ధరల నియంత్రణపై దాఖలైన వ్యాజ్యంపై న్యాయమూర్తి సందీప్ మెహతా, న్యాయమూర్తి విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. చిల్లర వర్తకులకు కేవలం రెండు వేల ఏడు వందల రూపాయలకే అందుబాటులోకి వస్తున్న ఒక క్యాన్సర్ మందుపై ఏకంగా ఇరవై ఏడు వేల రూపాయల గరిష్ఠ అమ్మకం ధరను ముద్రించి విక్రయించడం అత్యంత దిగ్భ్రాంతికరమని ధర్మాసనం పేర్కొంది.

## యుద్ధ క్షేత్రంలో విదేశీ బలగాలు

**రష్యా :** గడిచిన నాలుగేళ్లకు పైగా రష్యా మరియు ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం శమించకుండా కొనసాగుతోంది. ఇటీవల కాలంలో ఇరు పక్షాలూ పరస్పరం భీకర దాడులకు దిగుతున్నాయి. కాగా, స్వదేశీ సైనికులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల పౌరులను తమ తరపున పోరాడేందుకు రష్యా చాలాకాలంగా రిక్రూట్ చేసుకుంటోంది. ఈ క్రమంలోనే మరో సంచలన విషయం బయటపడింది. రష్యా దళాల్లో అమెరికా పౌరులు కూడా భాగమయ్యారని, సామాజిక అనుసంధాన మాధ్యమాల ద్వారా వారికి రష్యా వల విసురుతోందని అంతర్జాతీయ విలేకరుల కథనాలు స్పష్టం చేస్తున్నాయి. సుమారు ఇరవై ఆరు వేల డాలర్ల వరకు భారీ నగదు చెల్లిస్తామనే హామీతో కనీసం పద్దెనిమిది మంది అమెరికా పౌరులను రష్యా తన సైన్యంలోకి తీసుకుందని, వారిలో కొందరు మాజీ సైనిక అధికారులు కూడా ఉన్నారని సదరు వార్తా కథనం పేర్కొంది.సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం:యుద్ధ భూమిలో తమ వైపు నుంచి పోరాడేందుకు ముందుకు వచ్చే అమెరికన్లకు ఆరంభ ప్రోత్సాహకంగా ఇరవై ఆరు వేల డాలర్లు, ఆ తర్వాత ప్రతి నెలా రెండు వేల డాలర్ల వేతనం చెల్లిస్తామని రష్యా తరపున కొందరు మధ్యవర్తులు ఎర వేస్తున్నారు.

## ఇంతే కదా...!




### రాహుల్ కాదు.. ఆయన జేజమ్మ దిగొచ్చినా

## మోదీని ఢీకొట్టలేరు: ఈటల రాజేందర్

### రాజ్యాంగ వ్యవస్థలను కించపరిస్తే సహించేది లేదని కమలం నేతల హెచ్చరిక
### ఎన్నికల సంఘాన్ని భ్రష్టుపట్టించిందే హస్తం పార్టీ
### రాహుల్‌కు జరిగింది ఓటు చోరీ కాదు.. 'అఖల్ చోరీ': ఎంపీ ధర్మపురి అర్వింద్
### రాజ్యాంగ వ్యవస్థలను దిగజార్చడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు: ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీ విపరీత చేష్టలను చూసి దేశ ప్రజలు 'తూ' అని అసహ్యించుకుంటున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ కాదు కదా.. ఆయన జేజమ్మ దిగివచ్చినా ప్రధాని నరేంద్ర మోదీని రాజకీయంగా ఢీకొట్టే సత్తా ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, రితేశ్ రాథోడ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడాల్సిన విపక్ష పాత్రను విస్మరించి, కాంగ్రెస్ అర్థరహిత ఆరోపణలతో కాలం వెళ్లదీస్తోందని ఈటల దుయ్యబట్టారు. రాహుల్ విదేశాలకు వెళ్లి భారత ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేలా, ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ ప్రక్రియను రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. "రెండేళ్ల క్రితం ఓటర్ల జాబితాను సరిచేయాలని డిమాండ్ చేసిందే రాహుల్. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా పదిసార్లు ఈ రివ్యూ జరిగింది. చనిపోయినవారి పేర్లు తొలగించడం, డూప్లికేట్ ఓట్లను ఏరివేయడం నేరమా?" అని నిలదీశారు.

**ఎన్నికల సంఘాన్ని భ్రష్టుపట్టించిందే హస్తం పార్టీ**

ఈవీఎంలపై కాంగ్రెస్ వైఖరి దొంగే దొంగ అన్నట్లుందని ఈటల ధ్వజమెత్తారు. "ఈవీఎంలు తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ అని డబ్బా కొట్టుకుంటారు.. తీరా ఓడిపోతే ఈవీఎంల ట్యాంపరింగ్ అంటూ గగ్గోలు పెడతారు. వీవీప్యాట్లను తీసుకొచ్చింది మోదీ ప్రభుత్వం. నిజంగానే ట్యాంపరింగ్ చేసే అవకాశముంటే 2024 ఎన్నికల్లో మేం 400 సీట్లు ఎందుకు దాటలేకపోయాం?" అని ప్రశ్నించారు. తమిళనాడులో విజయ్ గెలిచినా, కేరళలో కాంగ్రెస్ గెలిచినా ఈవీఎంలు సక్రమమేనా అని నిలదీశారు.

ఎన్నికల సంఘాన్ని చరిత్రలో అత్యంత దుర్వినియోగం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆయన ధ్వజమెత్తారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య గొంతు నొక్కిన చరిత్ర ఆ పార్టీదని, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీని రక్షించినందుకు ఎం.ఎస్. గిల్‌కు కేంద్ర మంత్రి పదవి కట్టబెట్టి వ్యవస్థలనే అపహాస్యం చేశారని దుయ్యబట్టారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా మోదీ సర్కార్ ముందడుగు వేస్తుంటే, అక్కసుతో బురదజల్లుతున్నారని ఆక్షేపించారు.

కాంగ్రెస్ తీరు మారకపోతే ప్రజలే కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. బీహార్‌లో ఓటు చోరీ నినాదంతో వెళ్లి ఎలా తుడిచిపెట్టుకుపోయారో, దేశవ్యాప్తంగా కూడా కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని తేల్చిచెప్పారు.

**రాహుల్‌కు జరిగింది ఓటు చోరీ కాదు.. 'అఖల్ చోరీ': ఎంపీ ధర్మపురి అర్వింద్**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వైఖరిపై తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేశంలో ఎక్కడా ఓటు చోరీ జరగలేదని, వాస్తవానికి రాహుల్ గాంధీకే 'అఖల్ చోరీ' (మెదడు చోరీ) అయిందని విమర్శించారు. ప్రపంచ దేశాల్లో తిరుగుతూ భారతదేశ పరువును, భారత ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడటం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. గతంలో ఎన్నికల కమిషనర్లను కాంగ్రెస్ పార్టీ ఎలా దుర్వినియోగం చేసిందో, పదవీ విరమణ అనంతరం వారికి రాజ్యసభ సీట్లు, కేంద్ర మంత్రి పదవులు, గవర్నర్ పదవులు ఎలా కట్టబెట్టిందో చరిత్ర ఆధారాలతో సహా నిరూపిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశించిన 'కాంగ్రెస్ ముక్త భారత్' కలను రాహుల్ గాంధీ తన అపరిపక్వ నిర్ణయాలు, స్వయంకృత విపరీత చేష్టలతో స్వయంగా నెరవేరుస్తున్నారని అర్వింద్ ఎద్దేవా చేశారు.

**రాజ్యాంగ వ్యవస్థలను దిగజార్చడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు: ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా ఖండించారు. భారత ఎన్నికల సంఘం వంటి అత్యున్నత, రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ఎలాంటి ఆధారాలు లేకుండా బాధ్యతారాహిత్యంగా ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపనమ్మకాన్ని కలిగించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని, ఇందుకోసం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం స్పష్టమైన నిబంధనలకు లోబడి పనిచేస్తుంటే, కేవలం సంకుచిత రాజకీయ లబ్ధి కోసమే రాజ్యాంగ సంస్థల ప్రతిష్టను దిగజార్చడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా చౌకబారు ఆరోపణలు మానుకొని బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు.






# ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు నోటిఫికేషన్ విడుదల

**వనపర్తి సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి)**

మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు జాబితా నోటిఫికేషన్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మీడియా సమావేశం నిర్వహించి ఓటరు జాబితా నోటిఫికెషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నోటిఫికేషన్ పై వివరాలు వివరిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు కొత్తగా ఓటర్ జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. ఇంతకు ముందు ఓటరుగా నమోదు అయి ఉన్నప్పటికిని దానితో సంబంధం లేకుండా రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే కచ్చితంగా ఇప్పుడు కొత్తగా ఫారం 18లో ఆఫ్లైన్లో గాని ఆన్లైన్లో గాని దరఖాస్తు చేసుకోవాలని వనపర్తి పట్టణ పట్టబదులను సూచించారు. నవంబర్ 1, 2026కంటే మూడు సంవత్సరాల ముందు ఎవరైతే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారో వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హత ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 6 చివరి తేదీ ఉంటుందని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఇంటికి అధికారులు వచ్చి ఫిజికల్ గా పరిశీలిస్తారని, పరిశీలన సందర్భంగా అడ్రస్ ప్రూఫ్, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ చూపించాలిసి ఉంటుందన్నారు. అర్హులైన ఓటర్లతో కూడిన ముసాయిదా ఓటర్ జాబితా నవంబర్ 25న విడుదల చేయడం జరుగుతుంది. ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాలు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 25న అభ్యంతరాలను అన్ని పరిష్కరించి డిసెంబర్ 31 తేదీన తుది ఓటర్ జాబితా విడుదల చేయడం జరుగుతుందని తెలియజేశారు.అందువల్ల వనపర్తి జిల్లాలోని గ్రాడ్యుయేట్లు అందరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి ఫారం 18 ద్వారా ఆన్లైన్లో గాని ఆఫ్లైన్లో గాని దరఖాస్తు చేసుకోవాలనిసూచించారు. ఆఫ్లైన్లో చేసుకుంటే పోస్టు ద్వారా గాని స్వయంగా గాని సంబంధిత తహసిల్దార్ కార్యాలయంలో గడువులోపల అప్పగించాలని తెలియజేశారు.

# ఆర్డీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 29(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాల యంలోని పరిపాలనా కార్యకలాపాలు, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహ ణ, వివిధ అభివృద్ధి కార్య క్రమాలకు సంబంధించిన ఫైళ్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ముందుగా కార్యా లయంలోని అధికారులు, ఉద్యోగుల హాజరు రిజిస్టర్ను తనిఖీ చేసి, సిబ్బంది సమయపాలనతో విధు లకు హాజరవుతున్న తీరును పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో వివిధ అంశాలకు సంబం ధించి నిర్వహిస్తున్న ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగ తిపై అధికారులను వివరా లు అడిగి తెలుసుకు న్నారు. పెండింగ్లో ఉన్న ఫైళ్లను గుర్తించి, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలనిసూచించారు.

కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటలైజ్డ్ రికార్డు గదిని కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాత రెవెన్యూ రికార్డుల డిజిటలై జేషన్, భద్రపరిచే విధానం, రికార్డుల అందుబాటు తదితర అంశాలపై వివ రాలను అడిగి తెలుసుకు న్నారు. రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ, అవ సరమైన సమయంలో సులభంగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకా నికి సంబంధించిన పెండింగ్ భూ సేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షిం చారు. భూ సేకరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న అంశాలను గుర్తించి, సంబంధిత అధికారులు, భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో రమేష్ ను ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇప్పటి వరకు విధులు నిర్వహిం చిన ఆర్డీవోల వివరాలతో కూడిన జాబితా బోర్డును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కార్యాలయానికి సంబం ధించిన చారిత్రక, పరిపా లనా వివరాలను ఆమె ఆసక్తిగా పరిశీలించారు.ప్రజలకు అందించే రెవెన్యూ సేవల్లో జాప్యం లేకుండా చూడాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫిర్యా దులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యాలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, సమ యపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పేర్కొన్నా రు.కార్యాలయంలో రికా ర్డుల నిర్వహణ, ఫైళ్ల పరిష్కారం, భూ సంబం ధిత అంశాలు, ప్రజా సమ స్యల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ కొనసా గించాలని జిల్లా కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు.

# సమన్వయంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి



- **అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**
- **గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం.. అభివృద్ధి పనులపై విస్తృత సమీక్ష**

**తాండూరు, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):**

గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. మంగళవారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై గ్రామాల సర్పంచులు , మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే బీఎంఆర్ విస్తృతంగా చర్చించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ సత్తర్, ఏఎంసీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యలో అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలి

- **ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి**
- **ఎఫ్ఆర్సీ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి**
- **మెడికో పేరెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజుల సత్యనారాయణచారి**
- **తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగొద్దు**
- **స్థానికత నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి: ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**




**హైదరాబాద్:** ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ఎఫ్ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం, ఎఫ్ఆర్సీ, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని మెడికో పేరెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజుల సత్యనారాయణచారి డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన ఫీజులను తిరిగి చెల్లించేలా చూడాలని కోరారు.నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఆదివారం మెడికో పేరెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికో ఫ్యామిలీ మీట్లో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్ల ఎంబీబీఎస్ కోర్సుకు నిర్ణయించిన ఫీజుకు అదనంగా మరో ఆరు నెలల ఫీజును కొన్ని ప్రైవేట్ కళాశాలలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఏ కేటగిరీ, బీ కేటగిరీ తదితర పేర్లతో ప్రతి ఏటా భారీగా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**పేద విద్యార్థులకు అండ**

ఆర్థిక ఇబ్బందులతో ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు అసోసియేషన్ అండగా నిలుస్తోందని సత్యనారాయణచారి తెలిపారు. గత ఏడాది దాతల సహకారంతో 20 మంది వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి కళాశాలల్లో చేర్పించినట్లు చెప్పారు. ఈ ఏడాది మానస, ఇవాంజలి అనే ఇద్దరు విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించి అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు, అవసరమైన ట్యూటర్లను ఏర్పాటు చేయాలని కోరారు.**తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలి**

వైద్య విద్యలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోరారు. తెలంగాణలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివిన విద్యార్థులకే స్థానికత ఆధారంగా వైద్య సీట్లు కేటాయించేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు.జీవో నంబర్ 150 కారణంగా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు నాలుగేళ్లు తెలంగాణలో చదివి స్థానిక కోటా కింద వైద్య సీట్లు పొందుతున్నారని, దీనివల్ల తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతోందని అన్నారు. నియోజకవర్గంలోని వెయ్యి మంది పేద వైద్య విద్యార్థుల ఫీజులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే ప్రకటించారు.

**కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలి**

రాష్ట్రంలో మెడికల్ కాలేజీల సంఖ్య పెరిగినా అనేక కళాశాలల్లో మౌలిక వసతుల కొరత ఉందని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పొడిశెట్టి రమేష్ అన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కళాశాలలపై, ఎన్ఎంసీ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తల్లిదండ్రులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పల్లవి ఎడ్యుకేషన్ డైరెక్టర్ మల్కా నవీన్కుమార్ అసోసియేషన్ సేవలను అభినందించారు.కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పొడిశెట్టి రమేష్, బొడ్డుపల్లి అంజయ్య, పి.సుజాత, కోశాధికారి రవికుమార్ కొప్పుల, ఆర్గనైజర్ సెక్రటరీ కట్ట వెంకటరావు (కేవీఆర్), రాష్ట్ర నాయకులు గడ్డం స్వప్న, శ్రీనివాస్ గౌడ్, దుర్గాప్రసాద్, పత్రి యాదగిరి, దయానంద్, ఎం.శ్రీనివాస్, డి.సంధ్య, ఎస్.భాస్కర్రావు, పి.శ్యామ్శర్మ, జి.ప్రసాద్, ఆర్.రవీందర్రెడ్డి, పి.శ్రీనివాసరావు, జైపాల్ లాండే తదితరులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# గుండెను కాపాడుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం!

- **ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం**
- **ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జయప్రసాద్**

**తాండూర్ సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి)**




గుండె ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, హృదయ సంబంధ వ్యాధుల (కార్డియోవాస్క్యులర్ డిసీజెస్) నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడం లక్ష్యంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం తాండూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. IMA అధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా వైద్యులు జయప్రసాద్ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆరోగ్య సమస్యల్లో ఒకటిగా ఉన్నాయని తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, పొగతాగడం, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వంటి అంశాలు గుండె జబ్బుల ముప్పును పెంచుతాయని వివరించారు.గుండెను ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, ఉప్పు-చక్కెర-కొవ్వు అధికంగా ఉండే ఆహారాన్ని తగ్గించడం, పండ్లు-కూరగాయలు-పౌష్టికాహారం తీసుకోవడం, పొగతాగడం మరియు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం, శరీర బరువును నియంత్రించుకోవడం అవసరమని సూచించారు.అలాగే రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయులను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని, ఛాతీలో నొప్పి లేదా బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, విపరీతమైన చెమటలు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు."గుండెను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటే భవిష్యత్తులో హృదయ సంబంధ వ్యాధుల ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చు" అని వైద్యులు పేర్కొన్నారు.ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రజలు తమ గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, కుటుంబ సభ్యులు మరియు సమాజంలోనూ ఆరోగ్యకరమైన జీవనశైలిపై చైతన్యం కల్పించాలని వైద్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అనిల్ కుమార్ ట్రెజర్ జైదీప్ రెడ్డి వైద్యులు రాంబాబు, శివ మోహన్ రెడ్డి,డాక్టర్ వివేక్ డాక్టర్ శ్రీధర్ డాక్టర్ సంతోష్. డా. ఆనంద్ కుమార్, డాక్టర్ సమేయుల్లా డాక్టర్ శిల్పిక,డాక్టర్ అను సిరికర్, డా. శుభ శ్రీ,డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ అభిషేక్,డా. ఓంకార్దా. గౌతమ్ కృష్ణా రెడ్డి, డా. సాయి రాఘవ రెడ్డి,(ఖాళీ) రెడ్డి,పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యం 2047

- **ప్రధాని మోదీ జన్మదిన వేడుకల ప్రత్యేక కార్యక్రమం**
- **వివేకానంద హైస్కూల్లో ఘనంగా నిర్వహణ..**
- **ముఖ్య అతిథిగా జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్రెడ్డి**

**చిన్నంబావి మండలం 29 వుదయం రిపోర్టర్**





భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17వ తేదీ నుంచి, అక్టోబర్ 17వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా చిన్నంబావి మండల కేంద్రంలోని బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో వివేకానంద హైస్కూల్లో 'వికసిత్ భారత్ అభియాన్-2047' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ పార్టీ జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గారి శ్రీధర్రెడ్డి మాట్లాడుతూ..దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో వికసిత్ భారత్ - 2047 కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి భారత్ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సాంకేతిక రంగం, ఉపాధి తదితర రంగాల్లో దేశం మరింత పురోగతి సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు దేశ భవిష్యత్ పౌరులని, విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. యువతలో నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందితే దేశ అభివృద్ధి మరింత వేగవంతము అవుతుందని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, ప్రజా అవగాహన కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పంలో విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే సమగ్ర భారత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాగర్ కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య, మండల జనరల్ సెక్రెటరీ సంపత్ కుమార్, డి వెంకటయ్య, కోళ్ల ఆంజనేయులు నాయకులు, కార్యకర్తలు, వివేకానంద హైస్కూల్ ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వయోవృద్ధుల దినం సందర్భంగా అవగాహన

**నారాయణపేట సెప్టెంబర్ 29(వుదయం ప్రతినిధి)**



అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం-2026 వారోత్సవాల్లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,జిల్లా సంక్షేమ శాఖ, నారాయణపేట సంయుక్త ఆధ్వర్యంలోతల్లిదండ్రులు ,వయోవృద్ధుల పోషణ, నిర్వహణ సంక్షేమ చట్టం- 2007పై అవగాహన కార్య క్రమాన్ని నారాయణ పేటలోని ప్రణామ్ డే కేర్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృ ద్ధులకు చట్టం ద్వారా కల్పించబడిన హక్కులు, రక్షణ, సంక్షేమం, న్యాయ సహాయం వృద్ధుల సంరక్షణకు సంబంధించిన చట్టప రమైన అంశాలపై అవగా హన కల్పించారు. వయో వృద్ధులు తమకు ఎదుర య్యే సమస్యలను సంబం ధిత అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు సమాజం గౌరవం, బాధ్యత, ఆప్యాయత సంరక్షణతో వ్యవహరించా ల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వివరించారు. వయోవృద్ధులకు సురక్షిత మైన, గౌరవప్రదమైన ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించేందుకు ప్రభుత్వ శాఖలు సంబంధిత సంస్థ లు సమన్వయంతో పనిచే స్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్,ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి ఉలిగిందం, డాక్టర్ తిరుపతయ్య, జూనియర్ అడ్వకేట్ క్రాంతి కుమార్, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది వయోవృద్ధులు పాల్గొన్నారు.



# బల్మూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- **సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్ నాయక్**

**అచ్చంపేట, సెప్టెంబరు 29 (వుదయం ప్రతినిధి):**

అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.మంగళవారం బల్మూరు మండలంలో సీపీఎం బృందం పర్యటించి పంట నష్టపోయిన రైతులను కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వర్షాభావ పరిస్థితులతో వరి పంటలు పొలాల్లోనే ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బల్మూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.70 వేల పరిహారం అందించాలని, ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ లాల్ మహమ్మద్, ఆంజనేయులు, శ్రావణ్ కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు

- **స్పెషల్ డ్రైవ్లో విద్యా సంస్థలపై ప్రత్యేక దృష్టి.. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన**
- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**
- **భోజనం నాణ్యత, మౌలిక వసతులు, బోధనపై ఆరా.. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచన**

**తాండూరు, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):**

తాండూరు మున్సిపల్ పరిధిలోని 1 నుంచి 6వ వార్డుల్లో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్లో భాగంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే.. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా బోధన, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే.. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత, బోధన తీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

అలాగే విద్యార్థుల హాజరు శాతం, విద్యా ప్రమాణాలు, తరగతుల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన సౌకర్యాలు అందేలా చూడాలని సూచించారు.

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా విద్యా సంస్థల పరిస్థితిని కూడా పరిశీలిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మున్సిపల్ చైర్పర్సన్ నీరజా బాల్రెడ్డి వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, పట్టణ అధ్యక్షులు నాగు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

# డ్రగ్స్ దందాపై డేగకన్ను!

- **యువతను టార్గెట్ చేస్తే ఊరుకునేది లేదు**
- **నషా ముఠాలపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం**
- **1908కు సమాచారం.. సరఫరా గొలుసు ఛేదనకు పకడ్బందీ వ్యూహం**
- **కళాశాలలపై ప్రత్యేక నిఘా.. కేసుల దర్యాప్తుపైనా ఉన్నతస్థాయి సమీక్ష**

**గద్వాల, సెప్టెంబర్ 29 (వుదయం బ్యూరో)**





యువత భవిష్యత్తుతో చెలగాటమాడే డ్రగ్స్ దందాపై పోలీస్ శాఖ డేగకన్ను సారించింది. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు.. యువతను నషా ఉచ్చులోకి లాగే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ఈగల్ ఫోర్స్ కార్యాచరణను మరింత కట్టుదిట్టం చేయనుంది. సరఫరా మూలాలను గుర్తించడం.. అనుమానాస్పద కదలికలపై నిఘా పెట్టడం.. కేసుల దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేయడం.. యువతలో అవగాహన పెంచడం వంటి చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ, నివారణ చర్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో డ్రగ్స్ కేసుల దర్యాప్తు, యాంటీ డ్రగ్ స్క్వాడ్ల పనితీరు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. నషా ముఠాలకు అడ్డుకట్ట డ్రగ్స్ సమస్యను కేవలం కేసులు నమోదు చేసి వదిలే అంశంగా చూడకుండా.. డిమాండ్ను తగ్గించడం, సరఫరా మార్గాలను గుర్తించడం, యువతను ముందుగానే అప్రమత్తం చేయడం వంటి చర్యలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు స్పష్టం చేశారు. యువత, విద్యార్థులను మాదకద్రవ్యాల వైపు ఆకర్షించే పరిస్థితులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటం పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని.. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా భాగస్వాములు కావాలని సూచించారు. 1908కు సమాచారం ఇవ్వండి డ్రగ్స్ వినియోగం, విక్రయం, అక్రమ రవాణా లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే యాంటీ డ్రగ్ హెల్ప్లైన్ 1908కు తెలియజేయాలని అధికారులు కోరారు.ఒక్క సమాచారం కూడా డ్రగ్స్ అక్రమ కార్యకలాపాలను గుర్తించడంలో కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కదలికలను గమనిస్తే పోలీసుల దృష్టికి తీసుకురా వాలని, యువతను మాదకద్రవ్యాల బారినుంచి కాపాడేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు.కేసుల్లో లోపాలకు తావులేకుండా.. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో కేసు నమోదు నుంచి ఆధారాల సేకరణ వరకు.. నిందితుల గుర్తింపు నుంచి న్యాయపరమైన చర్యల వరకు ప్రతి దశ కీలకమేనని అధికారులు పేర్కొన్నారు. దర్యాప్తులో ఎదురయ్యే సమస్యలను గుర్తించి అధిగమించడం, అందుబాటులో ఉన్న ఆధారాలను సమర్థవంతంగా సేకరించడం, కేసులను చట్టపరంగా పటిష్టంగా ముందుకు తీసుకెళ్లడంపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. కళాశాలలపై ప్రత్యేక ఫోకస్ విద్యార్థులను డ్రగ్స్కు దూరంగా ఉంచేందుకు జిల్లాలోని కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ స్క్వాడ్లను మరింత అప్రమత్తం చేయాలని నిర్ణయించారు. స్క్వాడ్ల పనితీరు, అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల భాగస్వామ్యం, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరణ తదితర అంశాలను ఈగల్ ఫోర్స్ అధికారులు సమీక్షించారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. నాలుగు దిశల్లో దూకుడు డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో "నివారణ - అవగాహన - నిఘా - చట్టపరమైన చర్యలు" అనే నాలుగు అంశాలను ప్రధానంగా తీసుకుని ముందుకు సాగాలని అధికారులు నిర్ణయించారు. కేవలం నిందితులను పట్టుకోవడమే కాకుండా.. డ్రగ్స్కు డిమాండ్ ఎక్కడుంది? సరఫరా ఎలా జరుగుతోంది? యువతను ఎవరు లక్ష్యంగా చేసుకుంటున్నారు? వంటి అంశాలపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారికి అవసరమైన సహాయం అందించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

**యువత భవిష్యత్తుతో చెలగాటం వద్దు**

డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల ప్రభావం నుంచి రక్షించేందుకు విద్యాసంస్థల స్థాయిలో అవగాహన, పర్యవేక్షణ, ముందస్తు నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా మరింత విస్తృతం చేయడంతో పాటు.. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిఘాను మరింత పటిష్టం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీస్ శాఖతో ప్రజలు చేతులు కలపాలని.. డ్రగ్స్కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908కు చేరవేసి సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో అధికారులు తెలంగాణ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య, గద్వాల్ డీఎస్పీ వై. మొగిలయ్య, ఈగల్ ఫోర్స్ బృందం, గద్వాల్, అలంపూర్, శాంతినగర్ సర్కిల్ అధికారులు, ఎస్సైలు, డి.సి.ఆర్.బి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్





ఖైరతాబాద్ నియోజకవర్గం ఖైరతాబాద్ డివిజన్లో లక్ష్మీ నగర్ గుమ్మాస్ లైన్ లోఈరోజు 25 లక్షల రూపాయలతో రోడ్ల పనులను ప్రారంభించిన.

మాజీ మంత్రివర్యులు దానం నాగేందర్ గారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శరీఫ్ గారు , మహేందర్ బాబు గారు మరియు రాజుగారు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు

## ఈడీ కార్యాలయం ముట్టడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 29,(వుదయం ప్రతినిధి ),**

తెలంగాణ ఎస్సీ సమాజానికి న్యాయంగా దక్కాల్సిన నిధులను ఖర్చు చేయకుండా దారి మళ్లిస్తున్నారని ఆరోపిస్తూ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ ప్రజలకు రావాల్సిన సుమారు రూ.55 వేల కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రధాన డిమాండ్‌తో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయ ముట్టడించారు.ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమానికి కేటాయించిన నిధులు, ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధులు, ఎస్సీ డీఎఫ్ నిధుల వినియోగంపై సమగ్రంగా పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు.నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ నాయకులు 10 స్కూటీలను పంపిణీ చేసి ఎస్సీ సమాజాన్ని ఉద్ధరిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికీ కొనసాగుతున్న ఆర్థిక అసమానతలను తొలగించేందుకు ఎస్సీ సమాజానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎస్సీ ప్రజలకు కేటాయించిన నిధులను వారి అభివృద్ధికే ఖర్చు చేయాలని,ఎస్సీ యువతకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా నిధులను వినియోగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పోలీసులు నాయకులందరినీ అరెస్టు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎస్సీ ప్రజల హక్కులు,సంక్షేమం కోసం బీజేపీ ఎస్సీ మోర్చా నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఇదే డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి

- విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు..
- నీటి సమస్య తలెత్తకుండా నూతన బోర్లు..
- వీధి దీపాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక..
- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ..

**పటాన్చెరు/అమీనాపూర్ సెప్టెంబర్ 29 వుదయం.**



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ.. ఇందుకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో.. వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అమీన్పూర్ సర్కిల్, పటాన్చెరు సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా.. అవసరమైన చోట్ల నూతన బోర్స్ వేయాలని ఆదేశించారు. సి ఎస్ ఆర్ నిధుల ద్వారా పారిశుద్ధ్య విభాగానికి స్వీపింగ్ మెషీన్లు, టిప్పర్లు కొనుగోలు చేయడం జరిగిందని..త్వరలోనే అందజేయడం జరుగుతుందని తెలిపారు. వారానికి ఒకసారి ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని.. తాను సైతం పాల్గొంటానని తెలిపారు. ప్రజల నుండి వీధి దీపాల అంశంపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని ఎమ్మెల్యే జీఎంఆర్ అధికారులకు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వెంటనే సరిపడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిఈలు కృష్ణవేణి, వెంకటరమణ, చరణ్ సింగ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

**రామచంద్రపురం సెప్టెంబర్ 29 (వుదయం)**



రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.

బండ్లగూడకు చెందిన తలారి జగదీశ్ (46)పై 2021లో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో IPC 366, 354 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్లు 9(ఎం), 10, 12 కింద కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. సుర్ రెడ్డి వాదనలు వినిపించారు. కోర్టు ప్రక్రియలో ఎస్ఐ కె. వెంకటేష్, కోర్టు కానిస్టేబుల్ పి. తుకారం, సమన్స్ కానిస్టేబుల్ పి. అశోక్ తదితరులు సహకరించారు.

## గుండె ఆరోగ్యంపై ఫ్రెండ్స్ చైతన్యం






**శేర్లింగంపల్లి సెప్టెంబర్ 29,(వుదయం ప్రతినిధి ),**

శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మాదాపూర్ డివిజన్లో గల గోకుల్ ప్లాట్స్ నందు డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ కార్యాలయ ఆవరణలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడి బోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ (గుండె) దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఒమేగా మరియు పిఆర్కే హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ భాను కిరణ్ రెడ్డి (కార్డియాలజిస్ట్) హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో వచ్చే పెన్ను మార్పులతో మారిన జీవన శైలితో మానవుడు ప్రతి ఒక్కరూ గుండె రక్షణకై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆహార నియమాలు పాటించి ప్రతిరోజు కనీసం ఒక గంట సేపు వ్యాయామం చెయ్యటం ఎంతో మంచిదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడి బోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ ఈనాటి కాలంలో ప్రతి ఒక్కరికి చెక్కర వ్యాధితో బాధపడుతున్నారని తద్వారా బ్లడ్ ప్రెషర్ వల్ల గుండె పనితనం క్షీణిస్తోందని ఆయన తెలిపారు. కొంతవరకు అధిక బరువు వివిధ రకాలైన జంగ్ ఫుడ్లు ఈనాటి యువతీ యువకులు అధికంగా తీసుకోవడం వల్ల ఈ గుండె జబ్బుల బారిన పడుతున్నారని ఆహార నియమాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే గుండె జబ్బుల నుంచి దూరంగా ఉండవచ్చునని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం మూడు నెలలకు ఒకసారి వైద్యులను సంప్రదించి వివిధ పరీక్షలు చేయించుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ నిర్వాహకురాలు చావా అరుణ మరియు శివరామిరెడ్డి ,బాలాజీ, జాకీర్ హుస్సేన్ ,సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పర్యవేక్షణలో రాజీ లేదు

**రంగారెడ్డి జిల్లా**





విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టిFRS హాజరు తప్పనిసరి.. నిర్లక్ష్యంపై చర్యలు UDISE+ డ్రాప్‌బాక్స్‌లో నమోదు పెండింగ్ ఉండకూడదు2, 5, 8 తరగతుల విద్యార్థులకు PARAKHపై ప్రత్యేక శిక్షణరంగారెడ్డి జిల్లాలో పాఠశాలల నిర్వహణ, విద్యా ప్రమాణాల మెరుగుదల, ఉపాధ్యాయులు-విద్యార్థుల హాజరు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు పాఠశాలల్లో బోధనా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో డీఈవో వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారులు (MEOs), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు (CHMs), CRPs, అకడమిక్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ బృందాలు (APIT) పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదు, FLN, పాఠశాలల సందర్శనలు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ కిరణ్మయి సమీక్షించారు.FRS హాజరుపై కఠిన చర్యలు:ప్రతి ఉపాధ్యాయుడు ప్రతిరోజూ తప్పనిసరిగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా లేదా సరైన కారణం లేకుండా FRS హాజరు నమోదు చేయని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని,సముచిత వివరణ లేని సందర్భాల్లో నిబంధనల ప్రకారం వేతన కోత వంటి చర్యలు చేపట్టాలని డీఈవోను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. UDISE+ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి:UDISE+ పోర్టల్‌లోని డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలను సంబంధిత పాఠశాలల్లోకి తక్షణమే ఇంపోర్ట్ చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. డ్రాప్‌బాక్స్‌లో ఏ ఒక్క విద్యార్థి వివరాలు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. మండలాలు, కాంప్లెక్స్‌ల వారీగా విద్యార్థుల నమోదు, హాజరు ప్రగతిని నిరంతరం సమీక్షించి, వెనుకబడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.పాఠశాలల పర్యవేక్షణలో నాణ్యతకు ప్రాధాన్యత: కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అకడమిక్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ బృందాలు నిర్దేశిత లక్ష్యాల మేరకు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. పాఠశాల సందర్శనల్లో లోపాలను గుర్తించడం మాత్రమే కాకుండా, ఉపాధ్యాయులకు అకడమిక్ మార్గదర్శకత్వం అందిస్తూ బోధనా సామర్థ్యాలను మెరుగుపరచాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా రెమిడియల్ టీచింగ్ అందించాలని ఆదేశించారు.2, 5, 8 తరగతులపై ప్రత్యేక దృష్టి: రాబోయే PARAKH, ఇతర ప్రామాణిక అసెస్‌మెంట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 2, 5, 8 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. ప్రతి విద్యార్థి తరగతి వారీగా నిర్దేశించిన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.అసెస్‌మెంట్ ఫలితాల ఆధారంగా బోధన మెరుగుపరచాలి:జిల్లాలో నిర్వహించిన FLN కాంపిటెన్సీ అసెస్‌మెంట్ ఫలితాలను విశ్లేషించిన సందర్భంగా విద్యార్థులు గణిత సామర్థ్యాల్లో మెరుగైన ప్రగతి కనబరుస్తున్నట్లు అధికారులు వివరించారు. భాషా సామర్థ్యాల్లోనూ సమగ్ర అభివృద్ధి సాధించేలా ప్రత్యేక బోధనా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శిస్తూ ఉపాధ్యాయులకు నిరంతరం అకడమిక్ సహకారం అందిస్తున్న అకడమిక్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ బృందాల పనితీరును ఆమె అభినందించారు.పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అకడమిక్ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు. సమష్టి బాధ్యతతో పనిచేసి రంగారెడ్డి జిల్లాను విద్యా రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## ఆరోగ్యమే బలం – ఆర్థికమే తీరం

- సిద్దిపేట జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో అడిషనల్ డి ఆర్ డి ఓ సుధీర్ కుమార్
- జిల్లా మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలుగా 'అల్లం దీప' ఎన్నిక

**సిద్దిపేట, సెప్టెంబర్ 29 (వుదయం బ్యూరో)**



ప్రతి ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం బాగుంటుందని, మహిళలు ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా బలోపేతం కావాలని అడిషనల్ డీఆర్డీఓ సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా మహిళా సమాఖ్య సమావేశం ఘనంగా నిర్వహించడమైనది. ఈ సమావేశానికి డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మహిళల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెల్త్ చెకప్ చేయించుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. అనంతరం అడిషనల్ డీఆర్డీఓ సుధీర్ కుమార్ మాట్లాడుతూ, భవనాలు లేని గ్రామ సంఘాలు త్వరగా స్థలం సేకరించి భవనాల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అక్టోబర్ 1న నిర్వహించే అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన 60 ఏళ్లు పైబడిన మహిళా వృద్ధుల సంఘాల అధ్యక్షులను సిద్దిపేటలో జరిగే జిల్లా స్థాయి కార్యక్రమానికి పంపించాలని తెలిపారు.ఈ సమావేశంలో వివిధ శాఖల డిపిఎంలు, అధికారులు పాల్గొని సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. డిపిఎం (ఐబి) ప్రకాష్ మాట్లాడుతూ, సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ పుస్తక నిర్వహణ సక్రమంగా చేపట్టినప్పుడే ఇతర సంస్థల నుండి సహకారం లభిస్తుందన్నారు. డిపిఎం (ఫుడ్ ప్రాసెసింగ్) వాసుదేవ్ మాట్లాడుతూ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిపిఎం (మార్కెటింగ్) విద్యాసాగర్ మాట్లాడుతూ, ఐకెపి ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభమయ్యే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని, బ్యాంకు రుణాలతో నూతన వ్యాపారాలు ప్రారంభించి, తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. ఏపీవో (ఇంచార్జ్ పెన్షన్) సరిత మాట్లాడుతూ, ప్రతి గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే 'సదరం' క్యాంప్ ద్వారా అర్హులైన దివ్యాంగులు మీసేవలో నమోదు చేసుకుని UDID సర్టిఫికెట్లు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా 'టీజీ మాస్' ప్రతినిధి మురళి సమావేశాన్ని సందర్శించి పలు సలహాలు, సూచనలు అందించారు. జిల్లా మహిళా సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నిక:పరస్పర సహకార సంఘాల చట్టం ప్రకారం జిల్లా మహిళా సమాఖ్య పాలకవర్గానికి రులను ఎన్నుకున్నారు. జిల్లా మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలుగా అల్లం దీప (సిద్దిపేట రూరల్ మండలం), ప్రధాన కార్యదర్శిగా శ్రీలత (హుస్నాబాద్ మండలం), కోశాధికారిగా మద్దూరు మండలానికి చెందిన సభ్యురాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశం అనంతరం నూతన పదాధికారులను, మాజీ అధ్యక్షురాలు రేణుకను అధికారులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దోకయ్య, సీబీఓ ఆడిటర్లు వేణు, ప్రసాద్, బాలకిషన్, బ్రహ్మచారి, జిల్లా సమాఖ్య మేనేజర్ హేమలత, సిబ్బంది సుమలత, శ్రీకాంత్ మరియు మండలాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

## పెద్ద గొట్టిముక్క లో చెత్తబుట్టల పంపిణీ




**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 29....**

- తడి, పొడి చెత్త వేరుచేయడంపై అవగాహన
- పరిశుభ్రతే ఆరోగ్యం – సర్పంచ్ సందేశం

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని పెద్దగొట్టిముక్క గ్రామంలో నేడు సర్పంచ్ నవీన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చెత్తబుట్టల పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా సర్పంచ్ నవీన్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ తమ ఇండ్లలో ఉన్నటువంటి పొడి చెత్త తడి చెత్త లను వేరువేరుగా చేసి ఉదయాన్నే మన ఇంటి ముందు కొచ్చే చెత్త బండిలో వేయాల్సిందిగా ఆయన తెలిపారు. మన ఇల్లు మన ఇంటి పరిసరాలు మన వాడ మన ఊరు పారిశుద్ధ్యంగా ఉన్నప్పుడే ప్రజలందరూ ఆరోగ్యవంతులై ఉంటారని అందుచేత ప్రజలందరూ పారిశుద్ధ్యంలో భాగస్వాములై మన గ్రామాన్ని పారిశుద్ధ్యంలో ముందు ఉంచాలని గ్రామస్తులను ఉద్దేశించి ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లాడి ఆంజనేయులు. వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి

**మేడ్చల్ సెప్టెంబర్ 29 (వుదయం బ్యూరో)**



మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు సన్నాహాలు, రైతుల సంక్షేమంపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడానికి మరియు సన్నాహాలను సమీక్షించడానికి జిల్లా అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు (AOs), వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOs) మరియు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులతో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించడమైనది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, స్థల సేకరణ, రవాణా ఆలస్యం కాకుండా నివారించేందుకు జిల్లాల్లో ప్రత్యామ్నాయ గోదాములు అదనపు నిల్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్ షీట్లు, సుత్తిలి, మాయిశ్చర్ మీటర్లు (తడి కొలిచే పరికరాలు) మరియు ఆటోమేటిక్ క్లీనింగ్ మిషన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు తగినన్ని వాహనాలను సిద్ధం చేయాలని రవాణా కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. అన్‌లోడింగ్ వద్ద ఎలాంటి ట్రాఫిక్ నిరీక్షణ, కూలీల కొరత వంటి ఇబ్బందులు లేకుండా గోదాముల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్లతో సమన్వయం చేసుకొని ధాన్యం ఆరబోసుకోవడానికి అదనపు స్థలం కోసం కేంద్రాల సమీపంలో ఉన్న ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఖాళీ స్థలాలను పరిశీలించాలన్నారు. అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించడానికి వాతావరణ హెచ్చరికలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ ధాన్యం తడవకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు లో ఏవైనా సమస్యలు తలెత్తితే శాంతియుతంగా పరిష్కరించేందుకు అధికారులు మరియు ఇన్‌చార్జులు రైతులతో ఓపికతో, సానుకూలంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని వ్యవసాయ అధికారులు,సిబ్బంది, కాంట్రాక్టర్లను అడుగగా, వారు తెలిపిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని, అదేవిధంగా అవసరమైన మేరకు వ్యవసాయ మిషినరీని అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డిఎం సుగుణ బాయి, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, HYDERABAD DISTRCIT AT:: HYDERABAD**
**O.S. No. 2271 of 2026**

**Between :**
**1. Mrs. Palaram Lakshmi** W/o. Palaram Srinivasa Rao Aged about 69 years, Occ: Household,
**2. Mr. Palaram Bikshapathi,** S/o. Palaram Srinivasa Rao Aged about 42 years, Occ: Pvt. Employee,
**3. Mr. Palaram Vijay Kumar,** S/o. Palaram Srinivasa RaoAged about 40 years, Occ: Pvt. Employee,
**4. Mr. Palaram Sai Kumar,** S/o. Palaram Srinivasa Rao Aged about 40 years, Occ: Pvt. Employee,
All 1 to 4 are R/o. H-No. 8-3-228/945/1, Rahamath Nagar, Yousufguda, Khairatabad Mandal, Hyderabad District, Telangana State. Pin Code: 500045.
**5. Mrs. P. Sravanthi,** W/o. Puli Shety Aged about 43 years, Occ: Housewife, R/o. H-No. 18-7-455/284, Patel Nagar, Gowlipura, Charminara, Falaknuma,Hyderabad, Telangana State. Pin Code: 500053
**......PLAINTIFFS**

AND

1. The Tahasildar, Khairatabad Mandal, Hyderabad District.
2. All concerned

**......DEFENDANTS**

**NOTICE**

To,
All Concerned
Whereas you are hereby informed that the above-named Plaintiffs filed the above O.S. No. 2271 of 2026 against you for SUIT FOR DECLARATION OF STATUS OF PLAINTIFFS AS LEGAL HEIRS OF LATE. PALARAM SRINIVASA RAO, S/O. LATE. P. ANJAIAH In the above suit, the matter is coming for your appearance. The matter stands posted to 27/10/2026 for your appearance and if you have any objections. You have to appear in person or through an Advocate on that day in the above court at 10.30 A.M. otherwise the matter will be decided in your absence, as per law

**(By order of the court)**

**Sd/-**
**SHAIK ZAKIR HUSSAIN**
**BANDARI RAMESH YADAV**
**Advocate,**
**Moosapet, Hyderabad-18**
**PH: 09246536715**

**IN THE COURT OF HONORABLE 1st JUNIOR CIVIL JUDGE COURT AT SECUNDERABAD**
**OS NO. 584 OF 2026**

**Between :**
Ajay Kumar Arora and 2 others
**.....PLAINTIFFS**

AND

1. MRO, Seunderabad
2. All Concerned

**......DEFENDANTS**

**NOTICE**

TO
ALL CONCERNED
That our clients Mr. Ajay Kumar @ Ajay Kumar Arora s/o Sri Yograj, R/o : P.G ROAD, Secunderabad and his 2 children filed suit for declaration of legal heirs in respect of deceased wife of the said Ajay kumar @ Ajay kumar Arora, namely Smt. Anupama @ Anupama Arora D/o S.L Arora and W/O Ajay kumar Arora. That the said suit stands posted on 21.10.2026 for hearing. That all concerned are here by informed that in the above suit proceedings in intended to appear and participate in the suit proceedings should attend above said hon'ble court on 21.10.2026 by 10.30 am ,in person or through Advocate and submit their contentions if any.

**(By the order of this Honorable court)**

**Sd/-**
**G B RAJ**
**CH ANITHA**
**ADVOCATES**
**COUNSEL FOR PLAINTIFF**
**SECUNDERABAD**

**IN THE COURT OF THE HONBLE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD**
**O.S.NO: 2945 OF 2026**

**Between :**
**1. Suresh Singh Karanja,**
S/o Prabhu Singh Karanja, Age:53 yrs Occ: Business, R/o 4-9-87/9,Plot No 61,Huda Colony, Bahadurpura,Hyderabad-54
**2. Lisa Sing,**
D/o Suresh Singh Karanja, Age:23 yrs Occ: Student, R/o 4-9-87/9,Plot No 61,Huda Colony, Bahadurpura,Hyderabad-54
**3. Kriti Sing,**
D/o Suresh Singh Karanja, Age:19 yrs Occ: Student, R/o 4-9-87/9,Plot No 61,Huda Colony, Bahadurpura,Hyderabad-54
**4. Khushi Singh,**
D/o Suresh Singh Karanja, Age:19 yrs Occ: Student, R/o 4-9-87/9,Plot No 61,Huda Colony, Bahadurpura,Hyderabad-5
**5. Geetraj Singh,**
S/o Suresh Singh Karanja, Age:12 yrs Occ: Student, R/o 4-9-87/9,Plot No 61,Huda Colony, Bahadurpura,Hyderabad-54. Plaintiff No.5 being minor rep by her Father. All are presently Residing at H.No.11-1-1204/1/153, First Floor, Habeeb Nagar, Mallepally, Hyderabad-01.
**......Plaintiffs**

**AND**

1. **The Tahsildhar [MRO]**
Asifnagar Mandal, Hyderabad.
**2. All others Concerned**

**.......Defendants**

This is to bring to your notice that the above-named Plaintiffs have filed SUIT FOR DECLARATION TO DECLARE THE PLAINTIFFS AS THE LEGAL HEIRS OF THE DECEASED SMT. LATE. VANITA SINGH, vide O.S. No. 2945 of 2026, on the file of The IX Junior Civil Judge, City Civil Courts At: Hyderabad, and the matter is posted on 26-10-2026 at 10:30 AM. It is hereby informed those having any claims/ objection, may bring them before the court on above mentioned date failing which the matter will be heard exparte.

**(By the order of this Honorable court)**


**Sd/-**
**THOMAS LLOYD**
**GAURAV KWATRA**
**SHAIK ATHAR PARVEZ**
**T. SESHAGIRI**
**Advocates**
**# 5-9-314/1, First Floor, St. Joseph Cathedral, Gunfoundry, Hyderabad-1,©9849179263**
**Email: lloyd159@rediffmail.com**



"బొగ్గు కొరత ఎక్కడా లేదు. మేము రైలు, రోడ్డ మార్గాల ద్వారా సరఫరా చేస్తున్నాం. వర్షాభావం వల్ల జల విద్యుదుత్పత్తి తగ్గడంతో థర్మల్ విద్యుత్‌కు డిమాండ్ 12 15 శాతం పెరిగింది. అదే సమయంలో వర్షాకాలం బొగ్గు తవ్వకాలను ప్రభావితం చేసింది. ఈ తాత్కాలిక అంతరాయాలను బొగ్గు కొరతగా భావించొద్దు. మొత్తం మీద పరిస్థితి సాధారణంగానే ఉంది. బెంగాల్ లో బొగ్గు రంగం ఎన్నో ఏళ్ల నుంచి అక్రమ మైనింగ్ నిర్వాహకులు, మాఫియాల గుప్పిట్లో చిక్కుకుంది. ఈ రంగంలో పారదర్శకతకు తీసుకు రావడానికి అక్రమ మైనింగ్ కార్యకలాపాలను అరికట్టడానికి, మైనింగ్ ఆదాయాలు రాష్ట్ర ఖజానాకు చేరేలా కేంద్రం సంస్కరణలు చేపడుతున్నది."

- జి. కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

## వే'మన' పద్యం



ముచ్చుగుడికిబోయి ముడివిప్పనేగాని
పొసగస్వామిజూచి మ్రొక్కడతడు
కుక్క యిల్లుసొచ్చి కుండలు వెదుకదా
విశ్వదాభిరామ వినురవేమ

## సంపాదకీయం

# యుపిఐ చార్జీలు ఎవరి కోసం?

యు.పి.ఐ వంటి యాప్ ఒక్క భారత దేశంలోనే వుందని కూడా ప్రభుత్వం చెబుతున్నది. అందువల్ల బ్యాంకు ఖర్చుల కింద, సర్వర్లు ఉద్యోగుల ఖర్చుల కింద చాలా పెద్ద మొత్తం భరించవలసి వస్తుందని అంటున్నది. దాన్ని తట్టుకోవడం కోసం మాత్రమే ఈ కొద్దిపాటి ఫీజు వసూలు చేస్తున్నట్టు చెబుతున్నది. అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారం చూస్తేనే గత ఏడాది బ్యాంకుల సవికృత లాభం రూ.నాలుగు లక్షల కోట్లు. ఆఖరుకు యు.పి.ఐ ని నిర్వహించే ఎన్.సి.పి.ఐ అనే ప్రభుత్వ రంగ సంస్థకు కూడా 19 వేల కోట్ల లాభం, 7 వేల కోట్ల నిల్వ వచ్చింది. ఈ మిగులు నుంచి రిజర్వు బ్యాంకు కేంద్ర ప్రభుత్వానికి రూ.2.87 లక్షల కోట్ల చెల్లింపు చేసింది. పైగా యు.పి.ఐ తోపాటు డిజిటల్ లావాదేవీలకు ఉపయోగిస్తున్న మరో రెండు యాప్‌లు అమెజాన్, గూగుల్ అనే రెండు బడా బహుళజాతి కంపెనీలకు చెందినవి. ఈ వినియోగదారుల కు సంబంధించిన వాణిజ్య వివరాల డేటాను అమ్మడం ద్వారా వాటికి భారీ ప్రయోజనం సమకూరుతుంది. కనుక యుపిఐ లావాదేవీల వి ద చార్జీలు విధించడం ఎందుకంటే అమెజాన్, గూగుల్ లకు పోటీ లేకుండా చేయడం కోసమే. కానీ నష్టపోయేదెవరంటే చిన్న వ్యాపారులు, భారతదేశంలో సాధారణ వినియోగదారులు మాత్రమే. కనుక ప్రభుత్వం ఎవరిని మ ర్ఖులను చేయాలనుకుంటున్నది? ఉన్న చారిత్రిక సందర్భం నుంచి ఈ మొత్తం వివాదాన్ని విడదీసి చర్చించడం సాధ్యం కాని పని. 2016 నవంబరు 8న దురదృష్టకరమైన సాయంత్రం మోడీ ఒక్క చావుదెబ్బతో రూ.500, రూ.1000 పెద్ద నోట్లు రద్దు చేస్తున్నట్టు ప్రసంగంలో ప్రకటించారు. నల్లడబ్బు ఎలా చలామణి అవుతుందో ఏమాత్రం తెలియని వారు మాత్రమే, హిందీ సినిమాలలో వలె దిండు కవర్లలో, మట్టి కుండలలో, అలాగే పరుపుల కింద దాన్ని దాచిపెడతారని అనుకుంటారు. బహుశా మోడీ, ఆయన సలహాదారులు అలాగే భావించి వుంటారు. 2017`18 ఆర్‌బిఐ నివేదిక ప్రకారం చూస్తే నోట్ల రద్దుతో రూ.15.41 లక్షల కోట్ల డబ్బు రద్దయిపోయింది. అయితే అందులో 99.30 శాతం అంటే రూ.15.30 లక్షల కోట్లు మళ్లీ బ్యాంకింగు వ్యవస్థలోకి ప్రవేశించింది. అంటే మొదట చెప్పిన అంచనా ఎంత మ ర్ఖమైందో తేలిపోయింది. సామాన్య ప్రజల విపరీత కడగండ్లు, వాటి పర్యవసానంగా పెల్లుబికిన ప్రజాగ్రహం ఫలితంగా ప్రభుత్వం యు.పి.ఐ యాప్‌ను ప్రారంభించక తప్పని పరిస్థితి ఏర్పడింది. నిజానికి ప్రధానమంత్రి స్వయంగా ప్రైవేట్ వాలెట్లను ప్రోత్సహిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇలా చేయక తప్పలేదు. రోజువారీ చిన్న చిన్న లావాదేవీలను డిజిటలైజ్ చేయడంలో యుపిఐ చేసిన దోహదం చాలా వుంది. ఇప్పుడు ఈ చార్జీల విధింపుతో డిజిటల్ వ్యాపార వాతావరణం విచ్ఛిన్నమయ్యే ముప్పు ఆవరించినట్టే. భారత ఆర్థిక వ్యవస్థ పతన దిశలో దిగజారడానికి నోట్ల రద్దు మొదటి వాక్యమైంది. నగదు లావాదేవీలతో యథాలాపంగా సాగే చిన్న వ్యాపార ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. సూక్ష్మ, చిన్న సంస్థల రంగం కకావికలు చేయబడింది. ప్రత్యేకించి చిన్న వ్యాపార రంగంలో అది భారీగా ఉద్యోగావకాశాలు బలితీసుకుంది. వాగాడంబరపు ప్రధాన మంత్రి, ఆయన వంధిమాగధ బృందాలు ఈ మరణాంతక స్వయంకృతాపరాధానికిగాను క్షమాపణ చెప్పాలని ఏ సమయంలోనూ అనుకోకపోవడం వేరే విషయం.? అలాంటి బుద్ధిహీనమైన విధానకర్తలే 7.8 శాతం జిడిపి పెరుగుదల గురించి గొప్పలు పోగలరు. కానీ వాస్తవం చాలా కఠోరంగా వుంది. 2026 ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం భారతదేశం అంతర్జాతీయంగా అసమానతలు అత్యంత ఎక్కువగా వున్న దేశాలలో ఒకటిగా వుంది. బాగా పైనున్న అధికాదాయపరులే మొత్తం ఆదాయంలో 58 శాతం సంపాదిస్తున్నారు. కాగా ఆదాయపరంగా జనాభాలో దిగువనున్న 58 శాతం మంది కేవలం 15 శాతం మాత్రమే పొందగలుగుతున్నారు. అంతర్జాతీయ ఆర్థిక పంపిణీలో అత్యధిక భారతీయులు కిందనున్న యాభై శాతంలోనే వుంటున్నారు. అదే విధంగా కేంద్రీకరణలో కూడా పైనున్న ఒకే ఒక్క శాతం మంది జాతీయ సంపదలో సుమారు 40 శాతం పొందుతున్నారు. పైనున్న పది శాతం జాతీయ సంపదలో 65 శాతం తీసేసుకుంటున్నారు. మిగిలిన తొంభై శాతం మంది కేవలం 6.4 శాతంతో సరిపెట్టుకుంటున్నారు. ఇంకా స్త్రీల పట్ల వివక్ష, శ్రామికుల అసమానతలు కూడా కలిపి చూస్తే ఈ అసమానతల చిత్రం ఇంకా పెద్దగా వుంటుంది. మహిళా శ్రామికుల భాగస్వామ్యం 15.7 శాతం దగ్గర స్తంభించిపోయింది. ఈ జెండర్ వ్యత్యాసం గ్ఛాంతి గొల్పేదిగా వుంది. వేతన శ్రమ చేసేవారిలో పురుషులతో పోలిస్తే స్త్రీలు 61 శాతం మాత్రమే పొందగలుగుతున్నారు.?

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# గృహిణి ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత ఆశయ సాధనలు, పిల్లల పెంపకం, కెరీర్ బాధ్యతలతో సతమతం అవుతున్న మహిళలకు తమ వ్యక్తిగత ఆరోగ్యం, ఫిట్‌నెస్, శ్రేయస్సు పట్ల ఆలోచించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. మహిళల ఆరోగ్యం, శ్రేయస్సుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట సెప్టెంబర్ చివరి బుధవారం రోజున, అనగా 30 సెప్టెంబర్ 2026 రోజున "జాతీయ మహిళా ఆరోగ్యం ఫిట్‌నెస్ దినోత్సవం (నేషనల్ వూమెన్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. మహిళా ఆరోగ్యం చాలా సంక్లిష్టతతో కూడి పలు సవాళ్ల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మహిళలకు కౌమార దశ నుంచి వృద్ధాప్యం వరకు మెనోపాజ్, గర్భం దాల్చడం, పిల్లల్ని కనడం, రుతు స్రావ సమస్యలు, పిఓసిఎస్ సమస్యలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. దీనికి తోడుగా ప్రతి చిన్న సమస్యను బూతద్దంలో చూస్తూ అనవసర ఆందోళన, నిరాశ, ఒత్తిడులు, పని ఆధార ఒత్తిడులు, సామాజిక కట్టుబాట్లకు లోనవుతూనే ఉంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మహిళలకు అనారోగ్యం, శారీరక సమస్యలు, మానసిక ఉద్రేకాలు, భావోద్వేగ సమస్యలను అదుపులో ఉంచుకోవడానికి తగు సమాధానాలను ప్రచారం చేయడం నిరంతరం కొనసాగించాలి.

మహిళా ఆరోగ్యం ఫిట్‌నెస్ ప్రయోజనాలు:

కుటుంబ బాధ్యతలు, పని ప్రదేశ్ ఒత్తిడులు, పిల్లల పెంపకం బాధ్యతలు, వ్యక్తిగత సమస్యల పట్ల సమతుల్యత సాధించడానికి తమ ఆరోగ్యాలను సహితం పణంగా పెట్టడం జరుగుతోంది. మహిళల ఆరోగ్యం ఫిట్‌నెస్ సాధించుట వల్ల జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండడం, మానసిక శ్రేయస్సు పెరగడం, శారీరక శక్తి జనసం, సరైన సమయంలో నిద్ర పోవడం, ఏకాగ్రత పెరగడం, దీర్ఘ కాలిక ఆరోగ్య ప్రయోజనాలు కలగడం, శారీరక వ్యాయామాలకు సమయం కేటాయించడం లాంటి ఉపయోగాలు కలుగుతాయి. మహిళలకు అందుబాటులో ఉన్న సమయాన్ని తగు రీతిలో ప్రాధాన్యతాక్రమంలో గడపడం, దిన చర్యలో శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వడం, టెక్నాలజీ వాడుతూ తేలికగా పని చేయడం, సుసాధ్యం అయ్యే లక్ష్యాలను నిర్ణయించుకోవడం, అవసరం అయినపుడు పనిని ఇతరులకు కేటాయించడం, విశ్రాంతికి తగు సమయం కేటాయించడం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వడం లాంటివి విధిగా జరగాలి.

> ఆరోగ్యం ఫిట్‌నెస్ ప్రయోజనాలు: కుటుంబ బాధ్యతలు, పని ప్రదేశ్ ఒత్తిడులు, పిల్లల పెంపకం బాధ్యతలు, వ్యక్తిగత సమస్యల పట్ల సమతుల్యత సాధించడానికి తమ ఆరోగ్యాలను సహితం పణంగా పెట్టడం జరుగుతోంది. మహిళల ఆరోగ్యం ఫిట్‌నెస్ సాధించుట వల్ల జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండడం, మానసిక శ్రేయస్సు పెరగడం, శారీరక శక్తి జననం, సరైన సమయంలో నిద్ర పోవడం, ఏకాగ్రత పెరగడం, దీర్ఘ కాలిక ఆరోగ్య ప్రయోజనాలు కలగడం, శారీరక వ్యాయామాలకు సమయం కేటాయించడం లాంటి ఉపయోగాలు కలుగుతాయి. మహిళలకు అందుబాటులో ఉన్న సమయాన్ని తగు రీతిలో ప్రాధాన్యతాక్రమంలో గడపడం, దిన చర్యలో శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వడం, టెక్నాలజీ వాడుతూ తేలికగా పని చేయడం, సుసాధ్యం అయ్యే లక్ష్యాలను నిర్ణయించుకోవడం, అవసరం అయినపుడు పనిని ఇతరులకు కేటాయించడం, విశ్రాంతికి తగు సమయం కేటాయించడం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వడం లాంటివి విధిగా జరగాలి.

మహిళా ఆరోగ్య పరిరక్షణ మార్గాలు:

మహిళలు తమ పని ఒత్తిడిలో తగు పోషకాహారాన్ని తీసుకోవడంలో విఫలం అవుతూ ఉంటారు. అందరూ తిన్న తర్వాత మింగిన దానిని తిని తమ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటారు. సమతుల పోషకాహారం తీసుకోవడం, పోషకాహారలోపాలను గమనించి ఆహార అలవాట్లు మార్చుకోవడం, ప్రతి రోజు తగు నీటిని తాగడం, బరువును అదుపులో ఉంచుకోవడం, పోషకాహారాన్ని మాత్రమే తయారు చేయడం, ప్రాసెస్డ్ ఫుడ్ వాడకాన్ని తగ్గించడం, శరీర స్వభావాన్ని బట్టి ఆహారం ఎంపిక చేసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ మహిళలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలి. మానసిక వికాసానికి అవసరమైన వ్యాయామాలు, ఒత్తిడి నియంత్రణ, మానసిక స్పష్టత, నిద్రలేమా సమస్యను దూరం చేయడం, ఆశావహ సామాజిక సంబంధాలను నెలకొల్పడం, నిలకడను పెంచుకోవడం, వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం, ఆత్మ గౌరవాన్ని కాపాడుతుంటే ముందుకు సాగడం లాంటివి కొనసాగించాలి.

మహిళలు తమ జీవనశైలిని తగు రీతిలో మార్చుకుంటూ, పోషకాహారం తీసుకుంటూ, కుటుంబ శ్రేయస్సుతో పాటు తమ ఆరోగ్యం పరిరక్షించుతుంటూ, ఇతరులకు మార్గదర్శకులుగా నిలుస్తూ, ఆదర్శ మహిళగా దూసుకుపోతూ, సామాజిక చైతన్యాన్ని కలుగజేస్తూ, వృత్తిలో పాణిస్తూ ముందుకు సాగడానికి ప్రతినబూనాలి.



మధుసూదన్ రెడ్డి
9949700 037

# జల సంక్షోభానికి ముందే మేల్కొందాం

నీరు ఉన్నప్పుడు దాని విలువ తెలియదు. కొరత మొదలైన తర్వాతే జల భద్రత ఎంత కీలకమో గుర్తుకొస్తుంది. ప్రస్తుతం దేశంలోని ప్రధాన జలాశయాల పరిస్థితి అదే హెచ్చరికను వినిపిస్తోంది. కేంద్ర జల సంఘం తాజా గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా పర్యవేక్షిస్తున్న 178 ప్రధాన జలాశయాల్లో నిల్వలు మొత్తం సామర్థ్యంలో సుమారు 70 శాతానికి పరిమితమయ్యాయి. ఇదే సమయంలో గత పదేళ్ల సగటు నిల్వ 76.62 శాతం కాగా, గత ఏడాది 79 శాతం ఉంది. రుతుపవనాలు ముగింపు దశకు చేరుతున్న వేళ సాధారణం కంటే తక్కువ నీటి నిల్వలతో దేశం ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరం.ఇది కేవలం ఆనకట్టల్లో నీరు తగ్గిందనే గణాంకం కాదు. రాబోయే నెలల్లో తాగునీరు, రబీ సాగు, జలవిద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ ఉపాధి, పశు సంవర్ధక రంగం, ఆహార ధరలు అన్నింటిపైనా దీని ప్రభావం పడే అవకాశం ఉంది. వర్షపాతం లోటు మాత్రమే కాదు, వర్షాల అసమాన పంపిణీ మరింత పెద్ద సమస్యగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో కొద్ది గంటల్లోనే భారీ వర్షాలు కురుస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వారాల తరబడి వర్షం కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది.

వర్షం ఎంత కురిసిందనే దానికంటే ఎప్పుడు, ఎక్కడ, ఎంత సమానంగా కురిసిందన్నదే ఇప్పుడు కీలకం. భారీ వర్షం కురిసినా నిల్వ చేసుకునే వ్యవస్థలు లేకపోతే ఆ నీరు సముద్రంలో కలిసిపోతుంది. మరోవైపు భూగర్భజలాలపై ఆధారపడటం పెరుగుతోంది. బోర్లను మరింత లోతుగా తవ్వడం తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం కాదు. భూగర్భజలాల అధిక వినియోగం కొనసాగితే గ్రామీణ ప్రాంతాల్లో సాగు, పట్టణాల్లో తాగునీటి సరఫరా రెండూ ఒత్తిడికి గురవుతాయి.ఇలాంటి పరిస్థితుల్లో నీటి నిర్వహణను అత్యవసర పాలనా అంశంగా చూడాలి. వర్షపు నీటి సంరక్షణను భవన అనుమతులకు పరిమితం చేయకుండా కచ్చితంగా అమలు చేయాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించి భూగర్భజలాల పునర్భరణను పెంచాలి. వరి, చెరకు వంటి అధిక నీరు అవసరమైన పంటలు వేసే ప్రాంతాల్లో స్థానిక జల లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించాలి. వ్యవసాయంలో బిందు, తుంపర సేద్యాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. పట్టణాల్లో పైపుల లీకేజీల వల్ల వృథా అవుతున్న నీటిని అరికట్టాలి. శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమలు, ఉద్యానవనాలు, నిర్మాణ అవసరాలకు తిరిగి వినియోగించడం తప్పనిసరి చేయాలి.

ప్రతి గ్రామం, పట్టణానికి స్థానిక జల బడ్జెట్ రూపొందించి అందుబాటులో ఉన్న నీరు, వినియోగం, భూగర్భజల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలి.నీటిని ఉచితంగా లభించే అపరిమిత వనరుగా చూసే మనస్తత్వం ఇక మారాల్సిందే. నదులు నిండినప్పుడు నిర్లక్ష్యం చేసి, ఎండాకాలంలో ట్యాంకర్ల కోసం పరుగులు పెట్టడం జల నిర్వహణ కాదు. ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేయడం, ప్రతి చెరువును కాపాడడం, ప్రతి లీటరు నీటిని బాధ్యతగా వినియోగించడం ఇప్పుడు ఎంపిక కాదు——అనివార్యత.నీటి సంక్షోభం తలుపు తట్టిన తర్వాత చర్యలు ప్రారంభించడం ఆలస్యం. తలుపు తట్టకముందే జల భద్రతకు గట్టి పునాదులు వేయాలి. వర్షాన్ని మనం ఆదేశించలేం; కానీ పడిన నీటిని వృథా కాకుండా కాపాడగలం. ఇప్పటికైనా మేల్కొనకపోతే రేపటి భారతదేశంలో అత్యంత విలువైన సంపద బంగారం కాదు——ఒక గ్లాసు స్వచ్ఛమైన నీరే అవుతుంది.



సి. హెచ్.ప్రతాప్
77938 00743

# భాషలను సజీవంగా ఉంచేది అనువాదం

అనువాదం అంటే సంస్కృత భాషలో పునఃకథనం అని అర్థం. ఒకరు చెప్పిన దానిని మరొకరు చెప్పడం అన్నమాట. ఆధునిక యుగంలో ఒక భాషలో చెప్పిన విషయాన్ని మరొక భాషలో చెప్పడం అనే ప్రక్రియకు "అనువాదం" అనే పేరు స్థిరపడి పోయింది.

ప్రపంచ దేశాలలోని ఒకరికొకరు అర్థం చేసుకునేందుకు సహకరించే ముఖ్యమైన అనువాద క్రియకు సంవత్సరంలో ఒక రోజు కేటా యించాలని అంతర్జాతీయ అనువాదకుల సమాఖ్య నిర్ణయించింది.

అంతర్జాతీయ అనువాద దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 30న నిర్వహించ బడుతుంది. లాటిన్ మరియు హిబ్రూ నుండి గ్రీకు భాషలోకి బైబిల్ ను అనువదించిన సెయింట్ జెరోమ్ గుర్తుగా ఈ దినోత్సవం జరుపుకుంటారు. జెరోమ్ సెప్టెంబర్ 30, 420న మరణించాడు. అనువాద క్రియ ఎంతటి ముఖ్యమైనదో 1953లోనే ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్‌లేటర్స్ గుర్తించారు. అంతర్జాలం ప్రపంచాన్ని ఓ కుగ్రామంలో మార్చి వేసిన ఈ తరుణంలో ఒకరి భాష ఒకరు అర్థం చేసుకోవాల్సిన, మాట్లాడు కోవాల్సిన ఆవశ్యకత పెరిగింది. ఈ క్రమంలోనే మే 24, 2017న యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 30న అంతర్జా తీయ అనువాద దినోత్సవం జరుపు కోవాలని నిర్ణయిస్తూ దీనికి ఆమోదాన్ని తెలిపింది. అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని మొట్టమొదట 1991 లో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డెస్ ట్రాడక్టియర్స్ (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్లేటర్స్) స్థాపించారు. ఎఫ్ ఐ టి అనేది ప్రపంచ వ్యాప్తంగా అనువాదకులు, వ్యాఖ్యాతలు మరియు పరిభాషకులను సూచించే అసోసియేషన్ల అంతర్జాతీయ సమ్మేళనం. అనువాదం అనేది అతి ముఖ్యమైనది. ప్రపంచంలోని దేశాలన్నీ ఒకరికొకరు అర్థం చేసుకు నేందుకు సహకరించేది అనువాదమే. ఎందుకంటే ప్రపంచంలోని ఒక్కో దేశంలో ఒక్కో భాష చెలామణిలో వుంటుంది. ఆయా భాషలను తమ సొంత భాషలోకి అనువదించి నపుడే వారికి విషయం అర్థం అవుతుంది. అలా అర్థం చేసుకున్నప్పుడే వివిధ దేశాల నాగరికతలు మనకు తేట తెల్ల మవుతాయి. అందుకే అనువాదం అనేది ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించు కున్నది. దేశాలను ఏకతాటిపైకి తీసుకు రావడంలో, అభివృద్ధికి దోహదం చేయడంలో మరియు ప్రపంచ శాంతి భద్రతలను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ అనువాద దినోత్సవం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భాషా సేవా పరిశ్రమలో అనువాదకులు, వ్యాఖ్యాతలు మరియు ఇతరుల ముఖ్యమైన పనిని గుర్తించడానికి ఈ రోజు గొప్ప అవకాశాన్ని అందిస్తుంది. మారుతున్న కాలాలలో సాంస్కృతిక వార సత్వాన్ని ప్రోత్సహించడం". భాషల మధ్య సహకారాన్ని సులభతరం చేయడం, అభివృద్ధికి తోడ్పడటం మరియు ప్రపంచ శాంతి భద్రతలను బలోపేతం చేయడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత మరియు భవిష్యత్ మాట్లాడేవారికి భాషలను సజీవంగా ఉంచడానికి దేశీయ భాషలను పరిరక్షించడానికి, అట్టడుగు సంస్కృతులను రక్షించడానికి ఆధునిక కాలపు సాంకేతిక పురోగతిని ఉపయో గించు కోవచ్చు. ప్రపంచంలో 6,500 కు




పైగా మాట్లాడే భాషలు ఉన్నాయి. భాషా అడ్డంకులను అధిగ మించడం సవాలుగా ఉంది. అనువాదకులు మరియు వ్యాఖ్యాతలు దీన్ని సులభతరం చేస్తారు. అనువాదం మరియు వ్యాఖ్యానం రెండు వేర్వేరు విషయాలు. అనువాదంలో వ్రాత పూర్వక పదం ఉంటుంది. వ్యాఖ్యానంలో మాట్లాడే పదం ఉంటుంది. ఒక పుస్తకం లేదా నివేదికను వేరే భాషకు మార్చాల్సిన అవసరం ఉంటే, అనువాదకుడు అవసరం. వ్యాఖ్యాతలు మాట్లాడే సమాచారాన్ని తీసుకొని మరొక భాషలో అర్థమయ్యేలా చేస్తారు. వ్యాఖ్యానం కేవలం మరొక భాషను తెలుసు కోవడం కాదు. వ్యాఖ్యాతలు సంస్కృతిని కూడా అర్థం చేసుకోవాలి. మానవ చరిత్రను పరిరక్షించడంలో అనువాదకులు కీలక ఏజెంట్లు. భారత్, పాకిస్తాన్ విభజన నేపథ్యంలో రూపుదిద్దుకొని సంచలనాత్మకంగా నిలిచిన హిందీ రచయిత భీష్మ సహనీ నవల "తమస్".ఇదే నవలను శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలుగులోకి అనువదించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మక్సిమ్ గోర్కి కలం నుండి జాలువారిన అత్యద్భుతమైన రచన "మదర్". అమ్మ పలుమార్లు తెలుగులోకి అనువాద మయింది. సోవియట్ ల్యాండు నెహ్రూ అవార్డు గ్రహీత మరియు స్వాతంత్ర్య సమర యోధులు క్రొవ్విడి లింగరాజు ఈ నవలను తెలుగులోకి అనువదించిన తీరు అమోఘం

అనువాదకుడు మరియు వ్యాఖ్యాత అనేది ప్రజల మధ్య సంభాషణను సులభతరం చేసే ఒక లక్ష్యానికి అంకితమైన రెండు వృత్తులు. వ్యక్తులు ఒకరినొకరు బాగా అర్థం చేసు కోవడానికి సహాయ పడేటప్పుడు అనువాదకులు మరియు వ్యాఖ్యాతలు ఇద్దరూ అవసరం. ఒక విదేశీ దేశంలో కొత్త వ్యాపారాన్ని ప్రారంభించే టప్పుడు వారు వైవిధ్యం చూపుతారు. వారు ఆసుపత్రుల లోని రోగులకు, పాఠశాలల్లోని విద్యార్థులకు మరియు దేశ, విదేశాలలో పనిచేసే మీడియా ప్రతినిధులకు, కూడా సహాయం చేస్తారు.

ఇప్పుడు ప్రపంచంలోని ఎన్నో భాషలకు చెందిన సాహిత్యం, ఇంకా ఆయా దేశాలు అనుసరించే చట్టాలు... తదితర విషయాలన్నీ కేవలం అనువాదం పైనే ఆధారపడి వున్నాయి. అవసరం ఉన్నందున, అనువాదకులు మరియు వ్యాఖ్యాతలకు అధిక డిమాండ్ ఉంది. యునైటెడ్ స్టేట్స్లో, అనువాదకుడు మరియు వ్యాఖ్యాత ఉద్యోగాలు 2024 నాటికి 29% పెరుగుతాయని భావిస్తున్నారు. అత్యధిక డిమాండ్ ఉన్న భాషలలో స్పానిష్, రష్యన్, ఫ్రెంచ్ మరియు జర్మన్ ఉన్నాయి.

అరబిక్, చైనీస్, జపనీస్, హిందీ మరియు కొరియన్ భాషలలో క్రమంగా పెరుగుతున్న ఇతర భాషలు. ఇక అనువాదం ప్రక్రియను చూస్తే ఇదివరకు సంస్కృతం, ఆంగ్లం నుంచి మన తెలుగు భాష లోకి ఎన్నో నవలలు, గ్రంథాలు అనువదించ బడ్డాయి. అంతర్జా తీయంగా ప్రఖ్యాతి గాంచిన నవలలతో పాటు, పలు భారతీయ భాషల్లో కూడా జనరంజకంగా పేరొందిన ఎన్నో నవలలను తెలుగు రచయితలు మన భాషలోకి అనువదించారు.

శరత్ చంద్ర ఛటర్జీ కలం నుండి జాలువారిన బెంగాలీ నవల "దేవదాసు"ని తెలుగులోకి అనువదించిన చక్రపాణి, తన రచనాశైలి ద్వారా అందులోని పాత్రలను అచ్చమైన తెలుగు సంప్రదాయానికి తగ్గట్టుగా మలిచి, శరత్‌బాబు తెలుగువాడే అన్న భావనను పాఠకులకు కలిగించడం విశేషం. అందుకే దేవదాసు నవలకు తెలుగులో కూడా బ్రహ్మరథం పట్టారు. భారత్, పాకిస్తాన్ విభజన నేపథ్యంలో రూపుదిద్దుకొని సంచలనాత్మకంగా నిలిచిన హిందీ రచయిత భీష్మ సహనీ నవల "తమస్".ఇదే నవలను శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలుగులోకి అనువదించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మక్సిమ్ గోర్కి కలం నుండి జాలువారిన అత్యద్భుత మైన రచన "మదర్". అమ్మ పలుమార్లు తెలుగులోకి అనువాద మయింది. సోవియట్ ల్యాండు నెహ్రూ అవార్డు గ్రహీత మరియు స్వాతంత్ర్య సమర యోధులు క్రొవ్విడి లింగరాజు ఈ నవలను తెలుగులోకి అనువదించిన తీరు అమోఘం. క్రైస్తవ సాహిత్యంలో మానవత్వానికి, మనిషి మనుగడకు ఒక అర్థాన్నిచ్చిన కథ బెన్‌హర్. జనరల్ లూ వాలస్ కలం నుండి జాలువారిన ఇదే నవలను మాడభూషి కృష్ణప్రసాద్ తెలుగు లోకి అనువదించారు. టాల్‌స్టాయ్ కలం నుండి జాలువారి, ప్రపంచ సాహిత్య చరిత్రలోనే మైలురాయిగా నిలిచిన నవల "ఆన్నా కరేనీనా". ఇదే నవలను శ్రీ తాపీ ధర్మారావు గారు తెలుగులోకి అనువదించడం విశేషం. తెలుగు భాషలోకి అనువాదం అయినట్లుగా, తెలుగు నుండి ఇతర భాషల లోని అనువదింప బడిన రచనలు తక్కువ అనే చెప్పాలి. అను వాదాలను మూలరచనను యథాతథంగా తెలుగులోనికి తర్జుమా చేయడం ఒక పద్ధతి కాగా ఆ మూల రచన సారం చెడకుండా స్వేచ్ఛానుసరణ చేయడం ఇంకొక పద్ధతి. ఆంగ్ల మాధ్యమ చదువులో, తెలుగు రాష్ట్రాలలో స్వభాష నిర్లక్ష్యానికి గురవుతున్న వేళ... తెలుగు భాషలో మరిన్ని అనువాద రచనలు రావాలని, ఇతర రాష్ట్రాల, దేశాల సాహిత్యం తెలుగు పాఠకులకు, ప్రజానీకానికి అందాలని ఆశిద్దాం.

> అనువాద క్రియ ఎంతటి ముఖ్యమైనదో 1953లోనే ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్‌లేటర్స్ గుర్తించారు. అంతర్జాలం ప్రపంచాన్ని ఓ కుగ్రామంలో మార్చి వేసిన ఈ తరుణంలో ఒకరి భాష ఒకరు అర్థం చేసుకోవాల్సిన, మాట్లాడు కోవాల్సిన ఆవశ్యకత పెరిగింది. ఈ క్రమంలోనే మే 24, 2017న యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 30న అంతర్జా తీయ అనువాద దినోత్సవం జరుపు కోవాలని నిర్ణయిస్తూ దీనికి ఆమోదాన్ని తెలిపింది. అంతర్జా తీయ అనువాద దినోత్సవాన్ని మొట్టమొదట 1991 లో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డెస్ ట్రాడక్టియర్స్ (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్లేటర్స్) స్థాపించారు. ఎఫ్ ఐ టి అనేది ప్రపంచ వ్యాప్తంగా అనువాదకులు, వ్యాఖ్యాతలు మరియు పరిభాషకులను సూచించే అసోసియేషన్ల అంతర్జాతీయ సమ్మేళనం. అనువాదం అనేది అతి ముఖ్యమైనది. ప్రపంచంలోని దేశాలన్నీ ఒకరికొకరు అర్థం చేసుకు నేందుకు సహకరించేది అనువాదమే. ఎందుకంటే ప్రపంచంలోని ఒక్కో దేశంలో ఒక్కో భాష చెలామణిలో వుంటుంది. ఆయా భాషలను తమ సొంత భాషలోకి అనువదించి నపుడే వారికి విషయం అర్థం అవుతుంది. అలా అర్థం చేసుకున్నప్పుడే వివిధ దేశాల నాగరికతలు మనకు తేట తెల్ల మవుతాయి. అందుకే అనువాదం అనేది ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించు కున్నది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# జాతీయం-అంతర్జాతీయం



## ఎన్ఎస్ఎ కొట్టివేత.. యూపీకి జరిమానా

**న్యూఢిల్లీ :**

2024 సంభాల్ హింసాకాండ కేసు నిందితుడిపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద విధించిన నిర్బంధాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. నిర్బంధ అధికారాన్ని 'చట్టవిరుద్ధంగా వినియోగించారు' అని పేర్కొంటూ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి రూ.10 లక్షల జరిమానా విధించింది. 2025 అక్టోబర్‌లో సంభాల్ జిల్లా మెజిస్ట్రేట్ ఇచ్చిన నిర్బంధపు ఆదేశాలను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం పక్కన పెట్టింది. "నిర్బంధపు అధికారాన్ని చట్టవిరుద్ధంగా వినియోగించారు. నిర్బంధాన్ని విధించిన అధికారులు తగిన అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. 2025 అక్టోబర్




13న జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వు రద్దు చేయబడింది. రాష్ట్రంపై రూ.10 లక్షల జరిమానా విధించాం" అని తీర్పులోని కీలక భాగాన్ని వెల్లడిస్తూ ధర్మాసనం పేర్కొంది. 2024 నవంబర్ 24న కోర్టు ఉత్తర్వుల మేరకు సంభాల్‌లోని షాహి జామా మసీదు సర్వే చేపడుతుండగా చెలరేగిన హింసాకాండలో నలుగురు వ్యక్తులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి యుపి పోలీసులు ముల్లా అఫ్రోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనపై ఎన్ఎస్ఎ చట్టాన్ని ప్రయోగించడాన్ని సవాలు చేస్తూ అఫ్రోజ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. తన కక్షిదారుడిని 2025 జనవరి 17న చేశారని అఫ్రోజ్ తరపు న్యాయవాది దివ్యేష్ ప్రతాప్ సింగ్ తెలిపారు. అఫ్రోజ్‌పై పోలీసులు నమోదు చేసిన కేసు పూర్తిగా, కస్టడీలో ఉన్నప్పుడు ఆయన చేసినట్లుగా చెబుతున్న అంగీకార వాంగ్మూలం, ఆయన సూచన మేరకు 32బోర్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారన్న అంశంపైనే ఆధారపడి ఉందని ఆయన వాదించారు. అఫ్రోజ్ హత్య చేశారన్న వ్యక్తికి అయిన గాయాలు అతని నుండి స్వాధీనం చేసుకున్న 32బోర్ పిస్టల్‌వి కాదని, 315బోర్ ఆయుధానివని తెలిపారు.అఫ్రోజ్ కస్టడీలో ఉండగా, సంభాల్ జిల్లా మేజిస్ట్రేట్ 1980, జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3(2)ను ప్రయోగించి, అక్టోబర్ 13, 2025న ఆయనను నిర్బంధంలో ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఆయన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సమర్పించిన విజ్ఞప్తులను కూడా తిరస్కరణకు గురయ్యాయి. తిరస్కరించబడ్డాయి.ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం 2025, నవంబర్ 8న ఈ నిర్బంధ ఉత్తర్వును ధృవీకరిస్తూ, అఫ్రోజ్ 2026, అక్టోబర్ 12 నిర్బంధంలోనే ఉండాలని ఆదేశించింది. తన నిర్బంధాన్ని సవాలు చేస్తూ అఫ్రోజ్ అలహాబాద్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. 2026, జూన్ 8న ఈ అభ్యర్థనను హైకోర్టు కొట్టివేసింది. దీంతో అఫ్రోజ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## ఎన్నికలకు ముందే ఇరాన్ పై దాడులు

- **ఇరాన్‌పై యుద్ధంలో విజయం సాధిస్తాం**
- **ట్రంప్ బెదిరింపులు**
- **దేనికైనా సిద్ధమేనన్న ఇరాన్**

**వాషింగ్టన్ :**

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా అత్యంత త్వరలోనే విజయం సాధిస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత పాట పాడారు. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందుగానే ఇరాన్‌పై తాజా దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఫ్యాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధానికి స్వస్తి పలికితే అంతర్జాతీయంగా చమురు ధరలు బాగా తగ్గుతాయని వ్యాఖ్యానిం చారు. ఇరాన్‌కు అణ్వాయుధం దక్కకుండా చూడాలని ఆయన నొక్కి చెప్పారు. 'త్వరలో ఈ యుద్ధంలో అమెరికా గెలవబోతోందని, అందులో విజయం సాధించగానే యుద్ధానికి ముందు స్థాయికి చమురు ధరలు తగ్గిపోతాయి." అని ట్రంప్ చెప్పారు.

**యుద్ధానికి సిద్ధంగానే ఉన్నాం : ఇరాన్**

ఇదిలావుండగా, ఈ వారాంతంలో అమెరికా, ఇరాన్‌ల మధ్య ప్రతిష్టంభన మరింత ముదిరింది. అంతర్గతంగా దౌత్య ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ ఇరు పక్షాలు మాటల యుద్ధాన్ని కొనసాగించాయి. కీలకమైన హర్మూజ్‌ను తిరిగి తెరిచే ఉద్దేశ్యమే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది, దౌత్యానికి మార్గాలు తెరిచే వున్నా,

**తాము యుద్ధ పునరుద్ధరణకు కూడా పూర్తి స్థాయిలో సిద్ధపడే వున్నామని ఇరాన్ తేల్చి చెబుతోంది.**

ఈ మేరకు సుప్రీం నేత ముజ్తబా ఖమేనీ, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి



స్పష్టం చేశారు. అదే దౌత్యానికి కూడా తాము సిద్ధమేనని, ఏది ఎంచుకోవాలన్నది అమెరికానే చూసుకోవాలని అన్నారు. కాగా అమెరికా జలాంతర్గత డ్రోన్‌ను తాము స్వాధీనం చేసుకున్నామన్న ఇరాన్ వార్తలను అమెరికా కొట్టివేసింది. మరోవైపు ఈయుద్ధంలో తమదే విజయమని ఇరాన్ చెబుతోంది.

**ఇరాన్ సీనియర్ జనరల్ ఒకరు మాట్లాడుతూ,**

తమపై అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలు, ఒత్తిళ్లను సడలించేదాక హర్మూజ్ మూతబడే వుంటుందని స్పష్టం చేశారు. కాగా అమెరికాతో చర్చలు ప్రారంభించేందుకు వీలుగా ఇరాన్ తన అణు కార్యక్రమంపై రాయితీలు ఇవ్వాలని మధ్యవర్తులు కోరుతున్నారంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. అయితే ఇరాన్ పక్షం ఇందుకు ససేమిరా అంటోంది. అమెరికా ఒత్తిళ్ళను తాము దీటుగా ఎదుర్కొనగలమని స్పష్టం చేస్తోంది.

**సముద్ర మార్గాన్ని తెరవడానికి సిద్ధమే!**

"ఈ ఘర్షణలను ఆపేందుకు వీలుగా సముద్ర మార్గాన్ని తిరిగి తెరవడానికి ఇరాన్ సిద్ధంగా ఉంది. అయితే చట్టవిరుద్ధంగా స్తంభించజేసిన మా డబ్బులు, మా ఆస్తులను విడుదల చేయాలని మేము కోరుకుంటున్నాం. మేము మా చమురును అమ్ముకోగలగాలని ఆశిస్తున్నాం. ఇప్పుడు మేము దౌత్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాం. మేము శాంతి కోసం లభించే ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు" అని అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు.

## బహిరంగ ప్రదేశాల్లో భద్రత.. ప్రభుత్వ విధి



**ఢిల్లీ:**

బహిరంగ ప్రదేశాలు సురక్షితంగా ఉండేలా చూడటం ప్రభుత్వ ప్రాథమిక విధి అని సుప్రీంకోర్టు పేర్కొంది. దీపాలు లేకపోవడం, నిఘా కొరవడటం, ఇతరత్రా పరిపాలనపరమైన లోటుపాట్ల వల్ల రోడ్లు, బస్సులు, మెట్రో స్టేషన్లు, సబ్‌వేలు, ఫుట్ బ్రిడ్జిలు, పార్కులు వంటివి 'అధిక ముప్పు ఉండే ప్రాంతాలు'గా మారడాన్ని అనుమతించలేమంది. నేరాల్ని నివారించేలా, సున్నితమైనవారిని కాపాడేలా పక్కాగా స్పందన, బాధ్యత, జవాబుదారీతనం ఉండాలని తేల్చి చెప్పింది. ఢిల్లీలో వరస ఘటనలు చూస్తే చట్టాన్ని అమలుచేసే సంస్థల వైఫల్యం కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. దక్షిణ ఢిల్లీలోని ఆస్థా కుంజ్ పార్కులో

**17 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన,**

ఇదే నగరంలోని స్వరూప్ నగర్‌లో టీనేజీ బాలికపై అత్యాచారానికి పాల్పడి హతమార్చిన ఉదంతం, స్లీపర్ బస్సులో మైనర్ బాలికపై అత్యాచారం వంటివాటిని సుమోటో విచారణకు స్వీకరించిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం సోమవారం పలు సూచనలు, వ్యాఖ్యలు చేసింది.

**"2012 నాటి నిర్భయ కేసుతో బాధాకరమైన పోలిక తీస కుండా ఉండలేకపోతున్నాం.**


ఆ కేసు నుంచి ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రజాభద్రతకు హామీ ఉన్నప్పటికీ, గౌరవంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించినప్పటికీ.. లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయి"

**అని ఆవేదన వ్యక్తంచేసింది. "..** ముఖ్యంగా పిల్లలు, మహిళలు ఎదుర్కొంటున్న ముప్పుపై దృష్టి సారించాలి. దీనిపై స్థాయీ నివేదిక సమర్పించండి. సమస్యాత్మక ప్రాంతాలపై సర్వేకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించాలని ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం. ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానాలు, పోక్సో న్యాయస్థానాల పనితీరుపై నాలుగు వారాల్లోగా ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రార్ మాకు నివేదిక సమర్పించాలి.

**112, 181 వంటి హెల్ప్‌లైన్ల పనితీరునూ తెలపాలి" అని ధర్మాసనం ఆదేశించింది.**

"లైంగిక నేరాల వార్తల విషయంలో రాజ్యాంగపరంగా, నైతిక ధర్మానుసారం బాధ్యతాయుతంగా ఉండాల్సిన విహిత కర్తవ్యాన్ని మీడియా మరిచిపోకూడదు. బాధితుల, మైనర్ పిల్లల వివరాలు నేరుగా గానీ, పరోక్షంగా గానీ బయటపెట్టేలా ఏమాత్రం వ్యవహరించకూడదు. దీనిపై నిషేధం ఉంది. మీడియా సంస్థలు, పాత్రికేయులు బాధ్యతాయుతంగా, సహానుభూతితో, సంయమనంతో వ్యవహరించాలి. లేకపోతే బాధితులకు, వారి కుటుంబాలకు మరోసారి వేదన కలిగించినట్లు అవుతుంది" అని ధర్మాసనం తెలిపింది.

## అమెరికా క్లబ్‌లో కాల్పులు



- **ముగ్గురు మృతి, నలుగురికి గాయాలు**

**వాషింగ్టన్ :**

అమెరికాలో కాల్పుల ఘటనలు ఆగడం లేదు. తాజాగా మిచిగాన్ రాష్ట్రంలోని డెట్రాయిట్‌లో ఒక క్లబ్‌లో కాల్పుల ఘటన సంభవించి ముగ్గురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం నివాసాల మధ్యలో ఉండే క్లబ్‌లో ఈ కాల్పుల ఘటన జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే ఈ సంఘటన జరిగిన మూడు నిమిషాల వ్యవధిలోనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ట్రాయిట్ పోలీస్ చీఫ్ టాడ్ బెట్టిసన్ విలేకరులకు తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారని, వీరిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని చెప్పారు. అదే విధంగా ఈ ఘటనలో బాధితులందరూ 20 నుంచి 30 ఏళ్ల వయస్సుల మధ్య ఉన్నవారని చెప్పారు. కాగా, ఆదివారం దీని కంటే ముందు జార్జియాలోని మేకాన్‌లో ఒక పార్కులో జరిగిన కాల్పుల ఘటనలో 12 మంది గాయపడ్డారు. పుట్టిన రోజు వేడుకల్లో ఒక్కసారిగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## భారత్‌కు అమెరికా సుంకాల మినహాయింపు

**వాషింగ్టన్ :**

భారత్ సహా 20 దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న కొన్ని ప్రత్యేకమైన మెడిసిన్స్‌పై విలువ ఆధారిత సుంకాలను అమెరికా మినహాయించింది. భారత్ సహా 20 దేశాల నుంచి అమెరికాకు దిగుమతయ్యే అర్హత కలిగిన కొన్ని పేటెంట్ మెడిసెన్స్, వాటికి సంబంధించిన ముడి పదార్థాలపై విధించనున్న సుంకాల నుంచి మినహాయింపు లభించనుందని సోమవారం తెలిపింది. అయితే ఈ మినహాయింపు అన్ని మెడిసిన్స్‌కు వర్తించదు. నిర్దిష్ట పేటెంట్ మెడిసెన్స్, వాటి సంబంధిత పదార్థాలపై ఇతర దేశాలకు 100 శాతం సుంకాన్ని విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 29 నుంచి ఈ 100 శాతం సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో అమెరికా వాణిజ్య శాఖ సంబంధిత నోటీసును 'ఫెడరల్ రిజిస్టర్'లో ప్రచురించింది. దేశీయ మెడిసిన్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో భాగంగా పేటెంట్ మెడిసెన్స్, బయోలాజిక్స్, వాటికి సంబంధించిన ముడి పదార్థాల దిగుమతులపై సుంకాలు విధించేందుకు అధ్యక్షుడు ట్రంప్ ఏప్రిల్ 2న ప్రకటన జారీ చేశారు. అయితే అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మెడిసెన్స్,



వంధ్యత్వ చికిత్సలకు సంబంధించిన ఉత్పత్తులు, సెల్ థెరపీలు, జన్యు చికిత్సలు, యాంటీబాడీడ్రగ్ కాంజుగేట్లు (ఏడీసీలు), జంతు మెడిసెన్స్‌కు సున్నా శాతం సుంకం విధించనున్నారు.భారత్‌తోపాటు అర్జెంటీనా, బంగ్లాదేశ్, కంబోడియా, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, యూరోపియన్ యూనియన్, గ్వాటెమాలా, ఇండోనేషియా, జపాన్, జోర్డాన్, మలేషియా, ఉత్తర మాసిడోనియా, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్, లీచెన్‌స్టెయిన్, తైవాన్, థాయ్‌లాండ్, బ్రిటన్, వియత్నాంలకు చెందిన అర్హత గల ఉత్పత్తులకు ఈ మినహాయింపు వర్తిస్తుంది. అమెరికాతో ప్రస్తుత లేదా రాబోయే వాణిజ్య, భద్రతా ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాలు ఉన్నందున ఈ దేశాల నుంచి వచ్చే అర్హత కలిగిన ఉత్పత్తులపై సున్నా శాతం సుంకం విధించవచ్చని నోటీసులో పేర్కొన్నారు.వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 కింద మెడిసెన్స్, వాటికి సంబంధించిన పదార్థాల దిగుమతులను నియంత్రించేందుకు ట్రంప్ ఏప్రిల్‌లో జారీ చేసిన ప్రకటనలో భాగంగానే ఈ చర్యలు చేపట్టారు. అనుబంధంలో పేర్కొన్న కొన్ని కంపెనీలకు 100 శాతం సుంకం జులై 31 నుంచే అమల్లోకి రాగా, ఇతర కంపెనీలకు సెప్టెంబర్ 29 నుంచి వర్తించనుంది. జెనరిక్ మెడిసెన్స్, వాటికి సంబంధించిన ముడి పదార్థాలు ఈ సెక్షన్ 232 మెడిసెన్స్ సుంకాల పరిధిలోకి రావు. పేటెంట్ లేని జంతు ఆరోగ్య ఉత్పత్తులను కూడా జెనరిక్ మెడిసెన్స్ ఉత్పత్తుల నిర్వచనంలో చేర్చేలా వాణిజ్య శాఖ తాజా నోటీసులో మార్పులు చేసింది.

## సెర్బియా అధ్యక్షుడి రాజీనామా

- **అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థుల పోరు**
- **ప్రజాగ్రహంతో పదవి నుండి తప్పుకున్న అలెగ్జాండర్ వుసిచ్**

**బెల్‌గ్రేడ్ :**

సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిచ్ తన పదవికి రాజీనామా చేశారు. వచ్చే నెల 25న జరగనున్న పార్లమెంటరీ ఎన్నికలలో పోటీ చేసి ప్రధాని పదవిని చేపట్టేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజ్యాంగం ప్రకారం ఓ వ్యక్తి దేశాధ్యక్ష పదవికి మూడోసారి పోటీ చేసేందుకు అవకాశం లేదు. ఉచిచ్ రాజీనామా నేపథ్యంలో పార్లమెంట్ స్పీకర్ అనా బర్నా బిజ్‌కు తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. విద్యార్థుల ఆగ్రహం..దేశంలో విద్యార్థుల నేతృత్వంలో ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా సుమారు రెండు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. అవినీతి సామ్రాట్ వుసిచ్ రాజీనామా చేయాల్సిందేనని విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. 2024 నవంబర్ 1వ తేదీన ఉత్తర సెర్బియా




లోని నోవీ సాద్‌లో రైల్వే స్టేషన్ పైకప్పు కూలి 16 మంది మృతి చెందడంతో ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఈ ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ యూనివర్సిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. న్యాయం కోసం, అవినీతికి వ్యతిరేకంగా వారు చేపట్టిన ఆందోళన క్రమేపీ బలమైన ఉద్యమంగా రూపుదిద్దుకుంది. 14 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న వుసిచ్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఉద్యమకారులు ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. వీరి ఉద్యమానికి ప్రజల నుండి కూడా మద్దతు రావడంతో ఎట్టకేలకు వుసిచ్ రాజీనామా చేశారు. అయితే, ప్రజా వ్యతిరేకతను పట్టించుకోకుండా ఎన్నికల బరిలో దిగుతానని ఆయన ప్రకటించారు. వుసిచ్ సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. ప్రజల్లో తనపై తీవ్ర అసంతృప్తి నెలకొని ఉన్నప్పటికీ ఆయన నేతృత్వంలోని పార్టీ అధికారంలో కొనసాగేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తోంది. రాజీనామా పత్రంపై సంతకం చేయడానికి ముందు అధ్యక్షభవనం వెలుపల తన మద్దతుదారులను ఉద్దేశించి వుసిచ్ ప్రసంగిస్తూ 'ఈ రాత్రి నాకు ఎంతో ప్రత్యేకం. ఈ అందమైన భవనంలో ఇదే నాకు చివరి రాత్రి. అయితే నేను భవిష్యత్తును చూస్తున్నాను. కొత్త విజయాలు మన కోసం ఎదురు చూస్తున్నాయి' అని చెప్పుకొచ్చారు.

## ఢిల్లీలో సీపీఐ(ఎం) నేతల అరెస్ట్

**న్యూఢిల్లీ :**

శాంతియుత ప్రదర్శన చేపడుతున్న సిపిఐ(ఎం) నేతలపై పోలీసులసు దురుసుగా ప్రవర్తించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ను తొలగించాలంటూ మంగళవారం స్థానిక ఎన్నికల కార్యాలయం వైపు శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపడుతున్న సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, ఆర్. అరుణ్ కుమార్, సీనియర్ నేతలు బృందా కరత్, సుభాషిణి అలీ, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, రాజ్యసభ ఎంపీ వి. శివదాసన్‌లపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడంతో పాటు వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక బస్సులో వారిని తరలించారు. బస్సులో సైతం నేతలు నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ను నిలిపివేయాలని, అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారందరికీ తిరిగి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## రష్యా సైన్యంలో అమెరికా మాజీ సైనికులు?

**రష్యా**

నాలుగేళ్లకుపైగా రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది ఇటీవల కాలంలో ఇరుదేశాలు భీకర దాడులు చేసుకుంటున్నాయి. స్వదేశీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రజలను యుద్ధంలో పోరాడేందుకు రష్యా ఎప్పటినుంచో నియమించుకుంటోంది. ఈ నేపథ్యంలో మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. వారిలో అమెరికన్లు కూడా ఉన్నారని.. సామాజిక మాధ్యమాల వేదికగా వారికి రష్యా ఎరవేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది.

**26,000 డాలర్ల వరకు చెల్లిస్తామన్న హామీతో..**

కనీసం 18 మంది అమెరికా జాతీయులను దళాల్లోకి తీసుకుందని తెలిపింది. వారిలో కొందరు మాజీ సైనికులు కూడా ఉన్నారని పేర్కొంది.యుద్ధ రంగంలో తమ వైపు పోరాడేందుకు వచ్చే అమెరికన్లకు 26వేల డాలర్ల సైనింగ్ బోనస్ (ఏకమొత్తంలో చెల్లించే ఆర్థిక ప్రోత్సాహకం), నెలవారీగా 2,000 డాలర్ల జీతం ఇస్తామని రష్యా ) తరఫున కొందరు ఏజెంట్లు ఎరవేస్తున్నారు. టిక్‌టాక్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో



ప్రచారం చేస్తూ.. పేదలు, అమెరికా వ్యతిరేక భావజాలం ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. అలా నియమితులైన వారిని యుద్ధం రంగంలో ముందువరుసలో నిలబెడుతున్నారని.. దాంతో పలువురు రష్యా సైన్యంలో చేరిన కొంతకాలానికే ప్రాణాలు కోల్పోయారని ఉక్రెయిన్ నిఘా వర్గాలు వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది.జెలెన్‌స్కీపై

**దక్షిణ కొరియా ఆగ్రహంరష్యాకు మరో 10,000 మంది ఉత్తర కొరియా సైనికులు:**

జెలెన్‌స్కీఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరఫున ఉత్తరకొరియా సైనికులు పోరాడుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వేలల్లో ఉత్తరకొరియా దేశీయులను రష్యాకు పంపినట్లు తాజాగా మరో 10వేల మంది సైనికులను పంపేందుకు కిమ్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. గతంలో కూడా జెలెన్‌స్కీ ఈ తరహా ప్రకటనలు చేశారు.

**50,000 మంది వరకు ఉత్తర కొరియా సైనికులను రష్యాకు పంపే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.**

ఇదిలా ఉంటే.. రష్యా దళాల తరఫున పోరాడుతున్న 135 దేశాలకు చెందిన 29వేల మందిని గుర్తించామని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. వాస్తవ లెక్కలు ఇంతకంటే ఎక్కువే ఉంటాయని చెప్తున్నారు.

## ఎఫ్‌బిఐ మోస్ట్ వాంటెడ్‌లో గోల్డీ

**వాషింగ్టన్ :**

- **ఎఫ్‌బిఐ మోస్ట్ వాంటెడ్ జాబితాలో గోల్డీ బ్రార్**
- **రూ.8.3 కోట్ల భారీ నజరానా ప్రకటన**
- **లారెన్స్ బిష్ణోయ్ నేర ముఠాతో సంబంధాలు**

గ్యాంగ్‌స్టర్ సతీందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్‌ను అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) తన పది మంది మోస్ట్ వాంటెడ్ పరారీలో ఉన్నవారి జాబితాలో చేర్చింది. ఆయన ఆచూకీ, అరెస్టుకు దారితీసే సమాచారం అందించిన వారికి 10 లక్షల అమెరికన్ డాలర్ల (సుమారు రూ.8.3 కోట్లు) రివార్డు ప్రకటించింది. ఈ మేరకు ఎఫ్‌బిఐ సోమవారం వెల్లడించింది. దక్షిణ కాలిఫోర్నియాతోపాటు అమెరికా, కెనడా ప్రాంతాల్లో పలు హింసాత్మక నేరాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లారెన్స్ బిష్ణోయ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్రూప్‌తో సతీందర్‌జీత్ సింగ్‌కు సంబంధాలు ఉన్నాయని ఎఫ్‌బిఐ పేర్కొంది. రాజకీయ, మతపరమైన ప్రముఖుల హత్యలు, కాల్పులు, హత్యలు, కిడ్నాప్‌లు, బలవంతపు



వసూళ్లు, దాడులు, మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణా వంటి నేరాల్లో ఆయన ప్రమేయం ఉన్నట్లు ఆరోపించింది.

**సింగ్ వద్ద ఆయుధాలు ఉండే అవకాశం ఉందని,**

ఆయన ప్రమాదకర వ్యక్తి కావడం తోపాటు తప్పించుకునే అవకాశం కూడా ఉందని ఎఫ్‌బిఐ హెచ్చరించింది.

**ఉత్తర అమెరికాలో బిష్ణోయ్ సంస్థకు సింగ్ నాయకత్వం వహిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు ఆరోపించారు.**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆ సంస్థ సభ్యులు, అనుచరులను సమన్వయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. సింగ్‌పై రాకెటీర్ ఇన్‌ఫ్లూయెన్స్‌డ్ అండ్ కరప్ట్ ఆర్గనైజేషన్స్ (ఆర్ఐసిఒ) కుట్ర, బెదిరింపుల ద్వారా వాణిజ్యాన్ని అడ్డుకునేందుకు కుట్ర, ఆ ప్రయత్నానికి పాల్పడటం, నియంత్రిత మాదక పదార్థాలను పంపిణీ చేయడం, పంపిణీ ఉద్దేశంతో వాటిని కలిగి ఉండేందుకు కుట్ర వంటి అభియోగాలు నమోదయ్యాయి.

ఈ కేసులో కాలిఫోర్నియాలోని సెంట్రల్ డిస్ట్రిక్ట్ యుఎస్ డిస్ట్రిక్ట్


**కోర్టు జూలై 1న ఆయనపై ఫెడరల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.**

భారత్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ వ్యవస్థీకృత నేర ముఠాలపై అమెరికా అధికారులు నిర్వహించిన 'ఆపరేషన్ హార్డ్‌బాల్' దర్యాప్తులో సింగ్ పేరు వెలుగులోకి వచ్చింది.

జూలైలో ఇలాంటి మూడు నేర సంస్థలతో సంబంధం ఉన్న 37 మంది నిందితులపై అమెరికా అధికారులు అభియోగాలు నమోదు చేశారు.

వాటిలో ఒక అభియోగపత్రం బిష్ణోయ్ సంస్థకు సంబంధించినదని, అందులో సింగ్‌ను ఆ సంస్థ నాయకుల్లో ఒకరిగా పేర్కొన్నట్లు ఎఫ్‌బిఐ తెలిపింది.

## ప్రజాస్వామ్య పునాదులపై దాడి: ఖర్గే



ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అవకతవకలకు ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర వ్యవస్థలను ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (CWC) సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల జాబితాల్లో మార్పులకు సంబంధించిన సమాచారం మొత్తం బహిర్గతం చేయాలి. రాజకీయ పార్టీలకు ఓటర్ల ఇద్దరు కమిషనర్లు.. సీఈసీ చర్యలు ఏకపక్షంగా ఉన్నాయని పేర్కొన్నారని ఖర్గే వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ భాజపా చేతిలో కీలుబొమ్మలా మారారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగేందుకు.. ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకు పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అవసరమైతే వాటిని సాధించేందుకు కాంగ్రెస్ (Congress) పార్టీ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ(Rahul Gandhi)కి అండగా నిలిచిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం**

**హనుమకొండ, సెప్టెంబర్ 29 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు, నిర్దేశిత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం లష్కర్ బజారులోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల వంటగది, నిత్యావసర సరుకులు, కూరగాయలు మరియు రోజువారీ మెనూ చార్ట్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం 5, 6వ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. రోజువారీ అల్పాహారం, స్నాక్స్, గుడ్లు సరఫరా మరియు ఉపాధ్యాయుల బోధన తీరుపై ఆరా తీస్తూ, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ పాటించకపోవడం, తరగతి గదిలో ఫ్యాన్ మరమ్మతు చేయించకపోవడంపై హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ దీపపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం డార్మిటరీ, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... "విద్యార్థులకు సమయానుకూలంగా, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలి. విద్యార్థి దశ ఎంతో కీలకమైంది, కాబట్టి విద్యార్థులందరూ అన్ని సబ్జెక్టులపై దృష్టి సారించి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి" అని సూచించారు.

## ఖరీఫ్ సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా, ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలి




**యాదాద్రి భువనగిరి జిల్లా.. సెప్టెంబర్29(వుదయం):**

ఖరీఫ్ సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా, ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో 20262027, ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ కోసం రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, సివిల్ సప్లై అధికారులు, వ్యవసాయ, సంబంధిత అధికారులతో వరి కొనుగోలు సన్నాహక శిక్షణ తరగతుల సమావేశంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు దాదాపు 3,00,000 మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్లో ముందస్తు ప్రణాళిక ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. PCSAP app నందు 16 ప్రశ్నలకి సమాధానంలు ఇచ్చిన తర్వాత మాత్రమే OPMS tab లకు permission ఇవ్వబడుతుంది. 15/10/2026 లోపు పూర్తి చేయగలరు. రైతులందరూ టార్పాలిన్ కవర్లు ఎక్కువగా ఉంచుకోవాలన్నారు. మహిళా సంఘాల ద్వారా కొనుగోలు సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .ఐకెపి, సమ భావన సంఘాల సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, తదితర సంస్థల ద్వారా సుమారు ( 325) కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, మరియు 7 రకాల సన్న ధాన్యం కొనుగోలు చేయాలని, సన్న వడ్ల కు క్వింటాకు 500/బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అందుకోసం జిల్లా స్థాయి దాన్యం కొనుగోళ్ల కేంద్రాల కమిటీ ద్వారా ప్రభుత్వం సూచించిన ప్రకారం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు, ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వార స్వీకరించి కేంద్రాలకు వచ్చే దాన్యం పూర్తి వివరాలు డాటా ఎంట్రీలో పొందుపరచాలన్నారు. కొనుగోలు రవాణా, డ్రై మిషన్,ప్యాడి క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, మ్యాచ్చర్స్, ఆటోమేటిక్ జాలి మిషన్లు, ముందస్తుగా సిద్ధంగాఉంచుకోవాలన్నారు. కేంద్రాలలో గన్ని సంచులు, అవసరానికి అనుగుణంగా ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సెంటర్లో కనీస వసతులైన మంచినీరు, అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ప్యాడి సెంటర్లను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ ప్రతిరోజు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు పంపే విధంగా ప్రణాళిక ప్రకారం లారీలను, హమాలీలను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లకు సంబంధించి దాన్యం డబ్బుల ను రైతుల ఖాతాలలో వెంటనే జమ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని,

కేంద్రాలలో నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించడం కోసం ఆన్ని శాఖల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆయన ఆదేశించారు.వరి ధాన్యం క్వింటాలకి ఏ గ్రేడ్ కు రూ.2461/, సాధారణ రకం క్వింటాలకి 2441/ చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ హరికృష్ణ, డిఏఓ రమణ రెడ్డి, సివిల్ సప్లై రోజారాణి, Dco మురళి, లీగల్ మెట్రోలాజి అడిషనల్ Drda తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**ప్రతీ ఒక్క ఉద్యోగి ఆన్లైన్లో ముఖ చిత్రం హాజరులో నమోదు చెయ్యాలి**

**- కలెక్టర్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్ జిల్లా మేజర్ న్యూస్ సూర్య ఆగస్టు 29 సెప్టెంబర్ 29:**



జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (225) అర్జీలు, ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రతీ ఒక్కరూ ఆన్లైన్ ముఖ చిత్రం హాజరులో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో, మహబూబాబాద్ ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు.

జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ రెవిన్యూ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల (ఇంచార్జ్) పురుషోత్తం లతో కలిసి,వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారం పై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. గురుకుల హాస్టల్స్, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కావలసిన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల స్పెషల్ అధికారులు సత్వరమే అందజేయాలన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు కోసం పట్టభద్రులైన ఓటర్లు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ( 93 ) అర్జీలను ప్రజలు అందజేయగా మహబూబాబాద్ , ఆర్డీవో కార్యాలయాల్లో ( 03 ), ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలు (123) వచ్చాయి. ఈ ప్రజావాణిలో కార్యక్రమంలో డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డివిఎచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్, సిపిఓ శ్రీనివాసరావు, డిహెచ్ఎస్ఓ జీ. మరియన్న, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 111 మంది లబ్ధిదారులకు రూ.61 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మాజీ మంత్రి కొండ సురేఖ

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 29**

వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండా సురేఖ పాల్గొని 111 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.61 లక్షల విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను నిలిపివేసిందని ఆరోపించారు. త్వరలోనే కల్యాణలక్ష్మి చెక్కులను కూడా లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. కొంతమంది నాయకులు ఎంజీఎం సందర్శనకు వెళ్లి అక్కడ జరిగిన ఘటనల నేపథ్యంలో ఆసుపత్రిలో చేరారని వ్యాఖ్యానించారు. త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎనిమిది అంతస్తులను ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. గుత్తేదారుల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో నూతన కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించలేకపోతున్నామని చెప్పారు. కిలా వరంగల్‌లో పురాతన దేవాలయాలు వెలుగులోకి వచ్చాయని, వాటిని అభివృద్ధి చేయాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతులు అవసరమవుతున్నాయని తెలిపారు. మంత్రి బాధ్యతల కారణంగా తూర్పు నియోజకవర్గానికి తగినంత సమయం కేటాయించలేకపోయానని, ఇకపై వారానికి ఒక రోజు ఒక్కో డివిజన్‌లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. తూర్పు నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు ఇప్పటికే నిధులు కేటాయించామని, డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. త్వరలోనే జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందిస్తామని పేర్కొన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీలోని వర్గ విభేదాలను పక్కనపెట్టి పార్టీ కోసం సమష్టిగా పనిచేయాలని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరించాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్ష పార్టీల నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారని విమర్శించిన కొండా సురేఖ, కొంతమంది నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 24 స్థానాలకు 24 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**– జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి) :**



వరంగల్‌ఖమ్మంనల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు సూచించారు. మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 01 నవంబర్ 2023 కంటే ముందు డిగ్రీ లేదా తత్సమాన విద్యను పూర్తి చేసి, ఈ నియోజకవర్గ పరిధిలో స్థానికులై ఉన్నవారు ఓటరు నమోదుకు అర్హులు. దరఖాస్తు విధానం ఫారం18 పూర్తి చేసి, అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి లేదా డిసిగ్నేటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి సంబంధిత తహసీల్దార్లు/AEROలకు సమర్పించాలి.ఆన్‌లైన్ నమోదు: అర్హులు తెలంగాణ సీఈఓ అధికారిక వెబ్‌సైట్ (ceotelangana.nic.in) ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా గతంలో పేర్లు ఉన్నవారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి. పాత నమోదు చెల్లదు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా పూర్తయ్యేలా రాజకీయ పార్టీలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వి. రవి కుమార్, ఎలక్షన్ సెల్ డిటిలు నితీష్, గణపతి, సతీష్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి అదనపు కలెక్టర్ శ్రీజ



**పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్‌స్‌ను పూర్తి చేయాలి**

**ఆసుపత్రుల్లో పార్కింగ్, ఇతర ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి**

**లోపాలున్న దయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు**

**ఖమ్మం వుదయం బ్యూరో సెప్టెంబర్-29 :**

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం-2010ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వైద్య సేవలందించే సంస్థలు నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్-2010 క్రింద జిల్లా స్థాయి అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలు, రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, తనిఖీలు, ఆసుపత్రులు, క్లినిక్స్, దయాగ్నస్టిక్ కేంద్రాల స్థితిగతులపై కమిటీ సమీక్షించింది.

పెండింగ్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ పూర్తి చేయాలి :

జిల్లాలో పర్మినెంట్ రిజిస్ట్రేషన్, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వచ్చే నెలలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పార్కింగ్ విషయంలో ఆసుపత్రుల వర్గీకరణ :

ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చే సమయంలో పార్కింగ్ సౌకర్యాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో పార్కింగ్ సదుపాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అదే సమయంలో 10 పడకల లోపు ఉన్న నర్సింగ్ హోమ్‌ల విషయంలో పార్కింగ్ అంశాన్ని అనవసరంగా ప్రతిబంధకంగా మార్చకుండా, నిబంధనలకు అనుగుణంగా వాటిని వర్గీకరించి, అర్హత ఉన్న సంస్థలకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.

లోపాలున్న దయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు :

జిల్లాలో ఇప్పటికే 16 దయాగ్నస్టిక్ కేంద్రాలను తనిఖీ చేయగా, పలు లోపాలు గుర్తించినట్లు అధికారులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసి, గుర్తించిన లోపాలను నిర్దేశిత గడువులోగా సరిదిద్దుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమీక్ష :

2026 జులై 27 నుంచి ఇప్పటి వరకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 29 దరఖాస్తులు అందగా, 20 ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు, 9 దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నట్లు సమావేశంలో తెలిపారు.

నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు :

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం వైద్య సంస్థలు రిజిస్ట్రేషన్, మౌలిక సదుపాయాలు, సిబ్బంది, పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర కనీస ప్రమాణాలను పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలును మరింత పటిష్టం చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. నరేందర్, కమిటీ సభ్యులు, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు నైపుణ్యం, బ్రాండింగ్, మార్కెటింగ్‌లో ప్రోత్సాహం.

**పప్పు మిల్లు ఆధునీకరణ, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుపై సమీక్ష.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 29**




వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధితో పాటు మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను మరింత పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో వీ హబ్ సంస్థ డైరెక్టర్ ఊహ, ఆమె బృందం, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు వారు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన బ్రాండింగ్, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంపై సమావేశంలో చర్చించారు. మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్న జీవనోపాధి, ఉత్పత్తుల తయారీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం, ఆధునిక నైపుణ్య శిక్షణ, ఉత్పత్తుల నాణ్యత పెంపు, బ్రాండింగ్, మార్కెటింగ్‌కు అవసరమైన సదుపాయాల కల్పనపై సమీక్షించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు స్థానిక వనరుల ఆధారంగా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు వీ హబ్ ద్వారా అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సూచించారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేలా చర్యలు చేపట్టాలని, మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడేలా నైపుణ్య శిక్షణతో పాటు బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అనంతరం పర్వతగిరి మండలంలోని పప్పు మిల్లు ఆధునీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఏర్పాటు చేయనున్న ట్రైనింగ్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో నాగ పద్మజ, వరంగల్ ఆర్డీవో సుమ, వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, వీ హబ్ డైరెక్టర్ ఊహ, ఆమె బృంద సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే పొదెం వీరయ్య: పరిమి శ్రీనివాసరావు

**భద్రాచలం,సెప్టెంబర్29 (వుదయం ప్రతినిధి):**



భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీని వీడి మరో పార్టీలో చేరుతున్నారంటూ ఇటీవల సామాజిక మాధ్యమాలు, వివిధ వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని భద్రాచలం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. పొదెం వీరయ్య పార్టీ మారుతున్నారంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతో పొదెం వీరయ్యకు ఎంతోకాలంగా విడదీయరాని అనుబంధం ఉందని, పార్టీ కోసం ఆయన అనేక సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్నారని పరిమి శ్రీనివాసరావు తెలిపారు. కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, తన చివరి శ్వాస వరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని చెప్పే నిబద్ధత కలిగిన నాయకుడు పొదెం వీరయ్య అని పేర్కొన్నారు. అంతేకాకుండా తన అంతిమయాత్ర సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ కండువాతోనే సాగాలని కోరుకునేంతగా ఆయనకు కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం, అభిమానం, అనుబంధం ఉన్నాయని పరిమి శ్రీనివాసరావు అన్నారు. రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు, ప్రలోభాలు ఎదురైనా తాను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీని వీడకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన నాయకుడిగా పొదెం వీరయ్యకు కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కొంతమంది కావాలనే పొదెం వీరయ్య పార్టీ మారుతున్నారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు నమ్మవద్దని పరిమి శ్రీనివాసరావు కోరారు. నిరాధారమైన వార్తలకు, ఊహాగానాలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. పొదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీకి దూరమవుతున్నారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ఆయన కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారని తెలిపారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, కార్యకర్తలతో ఆయనకు ఉన్న అనుబంధం, కాంగ్రెస్ సిద్ధాంతాలపై ఆయనకు ఉన్న విశ్వాసం అందరికీ తెలిసిందేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనూ పార్టీ కోసం పనిచేసిన నాయకుల్లో పొదెం వీరయ్య ఒకరని, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పరిమి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

భద్రాచలం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## భూ రీ సర్వే ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం




**భూపాలపల్లి, సెప్టెంబర్ 29 (వుదయం విలేకరి):**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న భూ రీసర్వే ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.మంగళవారం రేగొండ మండలం లింగాల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రీసర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న అదనపు కలెక్టర్ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. భూ సరిహద్దుల నిర్ధారణలో రైతుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామంలో సర్వే సరిహద్దుల నిర్ణయంపై రైతులతో నేరుగా మాట్లాడిన ఆయన, వారి సందేహాలను తెలుసుకుని నివృత్తి చేశారు. రీసర్వే ద్వారా తమ భూముల సరిహద్దులు, వివరాల నమోదును రైతులు పరిశీలించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా రీసర్వే ప్రక్రియను సమగ్రంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.రైతులందరూ రీసర్వే సిబ్బందికి సహకరించి, తమ భూములకు సంబంధించిన సరిహద్దులు, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని స్పష్టం చేశారు. ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, తహసీల్దార్ శ్వేత, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి: సెప్టెంబర్ 29(వుదయం జిల్లా ప్రతినిధి):**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియం, ఆడిటోరియం పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం క పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణాలను నాణ్యతా ప్రమాణలతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.మినీ స్టేడియంలోని ఇండోర్ సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ రెండు బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు టేబుల్ టెన్నిస్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడలకు అవసరమైన సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమైన డ్రెస్సింగ్ రూమ్‌లు, స్టోర్ రూమ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.ఆడిటోరియం పనులను పరిశీలించిన కలెక్టర్ స్టేజి, లైటింగ్, వాల్ ప్యానెలింగ్, ఫ్యాన్లు, సౌండ్ సిస్టమ్‌కు సంబంధించిన వైరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తాత్కాలిక సౌండ్ సిస్టమ్‌కు బదులుగా నాణ్యమైన శాశ్వత సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. దీపావళి నాటికి మినీ స్టేడియం, ఆడిటోరియంను అన్ని హంగులతో సిద్ధం చేసి అప్పగించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం స్థానిక భూ సమస్యలపై వచ్చిన వినతులను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ఆర్టీసీ విలీనానికి ముహూర్తం ఫిక్స్ - అక్టోబర్ 9న బాణం, నక్షత్రానికి ఓటేయండి: కాంగ్రెస్



**సూర్యాపేట సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి) :**

పదేళ్ల తర్వాత జరుగుతున్న ఆర్టీసీ ఎన్నికలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయని, ఈ ఎన్నికలతో ఆర్టీసీ విలీనం ముడిపడి ఉందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ ఎన్నికల ఇంచార్జి బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టి డబ్ల్యూ యు రాష్ట్ర అధ్యక్షులు మొగిళ్ల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీ ఎన్నికల్లో టీఎంయూ బలపరిచిన ఎస్ డబ్ల్యూ ఎఫ్ , టీ డబ్ల్యూ యు ఐక్య కూటమికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించిన సందర్భంగా ఈ సమావేశం నిర్వహించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్వరలోనే విలీన తేదీని ప్రకటిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో విలీనం సందర్భంగా వచ్చిన సమస్యలు తెలంగాణలో రాకుండా ఉండేందుకు సీఎం ఒక కమిటీ వేశారని, ఎన్నికల్లో గెలిచే నూతన కార్యవర్గంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అక్టోబర్ 9న జరిగే ఎన్నికల్లో బాణం, నక్షత్రం గుర్తులకు ఓటు వేసి ఎస్ డబ్ల్యూ ఎఫ్ , టి డబ్ల్యూ యు ఐక్య కూటమిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఆర్టీసీ లాభాల బాట పట్టిందని, కార్మికుల సమస్యల పరిష్కారం కాంగ్రెస్ తోనే సాధ్యమని అన్నారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు ఆర్టీసీపై నిరంకుశ పాలన చేసిందని, కనీసం సమ్మె చేసుకునే హక్కు కూడా లేకుండా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. సూర్యాపేట ఆర్టీసీకి గౌరవాధ్యక్షుడిగా ఉన్న తాను 320 ఓట్లలో 270 ఓట్లు టీఎంయూ కూటమికి వేయిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు బాస్కర్, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, చివ్వెంల మండలపార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, నాయకులు పాండు నాయక్, నాగు నాయక్, తొడుసు లింగయ్య, టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## టీఆర్ నగర్ లో ఓర్సు దినోత్సవం...

**ముస్లిం మైనార్టీల ఆధ్యాత్మిక కార్యక్రమం...**

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**




**జగిత్యాల సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓర్సు దినోత్సవం కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నిర్వాహకులు ముస్లిం మైనార్టీ సోదరులకు ఓర్సు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో ఐకమత్యంతో పండుగలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. టీఆర్ నగరాల్లో నిరుపేదలకు జీవో 59 కింద 116 మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. దాదాపు 200 మందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు చేయటం జరిగిందన్నారు. టీఆర్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వం అన్నారు. నిరంతరం పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి అభివృద్ధి కి కృషి చేస్తానన్నారు శాంతి సౌభ్రాతృత్వం పరస్పర గౌరవంతో జగిత్యాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ కౌన్సిలర్ లు చాంద్ పాషా లావణ్య రాజేందర్ పద్మ రాజేందర్ స్వప్న గిరిధర్ పవిత్ర మహేష్ మమత రామకృష్ణ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జెల్ల రవీందర్ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సద్దాం హుస్సేన్ కోటగిరి మోహన్ మెన్నెనీ ప్రవీణ్ రావు ముస్లిం మైనార్టీ నాయకులు మత పెద్దలు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'మేక్ ఇన్ ఇండియా' కాదు.. 'ఫేక్ ఇన్ ఇండియా'గా మారింది: ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**పెద్దపల్లి, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి)**



రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (RFCL) నిర్వహణ, కార్యకలాపాలపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ రైతులకు కీలకమైన ఎరువుల ఉత్పత్తి సంస్థను సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. "మేక్ ఇన్ ఇండియా కాదు.. ఫేక్ ఇన్ ఇండియా" అంటూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఎంపీ వంశీకృష్ణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతూ, బీఎస్ఎన్ఎల్, ఇస్రో, డీఆర్డీఓతో పాటు తన నియోజకవర్గంలోని ఆర్ఎఫ్సీఎల్ కూడా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ లోపాలకు గురవుతోందని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎఫ్సీఎల్ సంక్షోభంలో ఉన్న సమయంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.10,000 కోట్ల రుణభారం మాఫీ కి చర్యలు తీసుకున్నారని ఎంపీ గుర్తుచేశారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, కాకా వెంకటస్వామి, డాక్టర్ వివేక్ వెంకటస్వామి వంటి నాయకుల కృషితో రామగుండంలో ఎరువుల ఉత్పత్తి పునరుద్ధరణకు బాటలు పడ్డాయని తెలిపారు.తెలంగాణలోనే యూరియా ఉత్పత్తి జరిగి, రాష్ట్ర రైతులకు అవసరమైన ఎరువులను దేశీయంగా అందించాలనే ఆత్మనిర్భర్ భావనకు ఆర్ఎఫ్సీఎల్ ఒక ఉదాహరణగా ఉండాల్సిన సంస్థ అని ఎంపీ వంశీకృష్ణ అన్నారు. అయితే ప్రస్తుతం ప్లాంట్ కార్యకలాపాల్లో తరచూ అంతరాయాలు ఏర్పడటం రైతులకు ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.రామగుండంలో ఉన్న పరిశ్రమ నిర్వహణకు సంబంధించిన కీలక నిర్ణయాలు స్థానిక పరిస్థితులను అర్థం చేసుకోకుండా దూర ప్రాంతాల నుంచి తీసుకోవడం వల్ల నిర్వహణలో సమన్వయ లోపాలు, నిర్ణయాల్లో జాప్యం, ఉత్పత్తిపై ప్రభావం ఏర్పడుతున్నాయని ఎంపీ విమర్శించారు."తెలంగాణలో ఉన్న ఫ్యాక్టరీని తెలంగాణ అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా నడపాలి. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ రైతుల ప్రయోజనాలు, రామగుండం ప్రాంత పారిశ్రామిక అభివృద్ధి,ఆర్ఎఫ్సీఎల్ భవిష్యత్తు కోసం తాను నిరంతరం గళం విప్పుతానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టంచేశారు. "తెలంగాణ రైతుల కోసం.. తెలంగాణ భవిష్యత్తు కోసం మా పోరాటం కొనసాగుతుంది" అని ఎంపీ పేర్కొన్నారు.

## ధర్మపురిలో మండల ధూప దీపనైవేద్యం సంఘం అర్చకుల

**నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం**

**అధ్యక్షుడుగా బూస.ప్రవీణ్ కుమార్**



**ధర్మపురి, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి మండలంలోని శ్రీ అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో తెలంగాణ ధూప దీప నైవేద్యం సంఘం ధర్మపురి మండల అర్చకుల నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏటూరి ఆంజనేయ చారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు.గౌరవ అధ్యక్షులు పెంట గంగారం,మండల అధ్యక్షులు బూస ప్రవీణ్ కుమార్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పురాణపు సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి పాంచాల లక్ష్మీకాంత చారి, ఉపాధ్యక్షులు శ్రీ పెరంబ దూరి శ్రీధరాచార్య, కోశాధికారి శ్రీ పెరంబదూరి శ్రీనయన్ అర్చకు ల సంక్షేమం కోసం, ధూప దీప నైవేద్య పథకం అమలులో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు అర్చకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో వివాదాలకు సత్వర పరిష్కారం — డీఎల్ఎస్ఏ కార్యదర్శి యశ్వంత్ సింగ్

**కరీంనగర్ సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):**



వివాదాలను సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు వెళ్లకుండా పరస్పర అంగీకారంతో, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం సమర్థవంతమైన మార్గమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీ యశ్వంత్ సింగ్ గారు తెలిపారు. ఈ రోజు జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవనంలో పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఆధ్వర్యంలోని తెలంగాణ మధ్యవర్తిత్వం మరియు ఆర్బిట్రేషన్ కేంద్రం నిర్వహిస్తున్న "దేశానికి మధ్యవర్తిత్వం 3.0 – మీడియేషన్ ఫర్ ది నేషన్ 3.0" కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో మధ్యవర్తిత్వంపై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలకు సత్వర పరిష్కారం, ఖర్చు తగ్గింపు, సంబంధాల పరిరక్షణ, న్యాయపరమైన వివాదాల తగ్గింపు వంటి ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకుని అంగీకారంతో పరిష్కారాన్ని పొందే అవకాశం ఉండటం మధ్యవర్తిత్వం ప్రత్యేకత అన్నారు. కుటుంబ, ఆస్తి, వాణిజ్య తదితర వివాదాల్లో చట్టపరమైన పరిధిలో మధ్యవర్తిత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవచ్చని తెలిపారు. కరీంనగర్ జిల్లా ప్రజలు తమ వివాదాల పరిష్కారం కోసం జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకునే విధంగా పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలని యశ్వంత్ సింగ్ సూచించారు. సమావేశానంతరం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## పెంచికలపేట్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి**



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల పేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలో గ్రంథాలయ సౌకర్యం లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్యతరగతి విద్యార్థులకు స్థానికంగా గ్రంథాలయం ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని తెలిపారు.మండల కేంద్రంలో అన్ని హంగులతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు దినపత్రికలు, ఇతర విద్యా సామగ్రిని అందుబాటులో ఉంచాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ సానుకూలంగా స్పందించారు. పెంచికలపేట్ మండలంలో గ్రంథాలయం ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే గ్రంథాలయం మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సముద్రాల రాజన్న, సర్పంచ్ లు షేక్ ఉస్మాన్, చౌదరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, సుధాకర్, డీసీసీ జిల్లా డైరెక్టర్ శంకర్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, మండల నాయకులు రాచకొండ కృష్ణ, సంతోష్, మల్లేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు- కలెక్టర్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):**



జిల్లాలో పత్తి కొనుగోళ్లను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. అక్టోబర్ రెండో వారంలో సీసీఐ,ప్రైవేట్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, తూకం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, మాయిశ్చర్ మీటర్ల వినియోగంపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. తేమ శాతం కొలతల్లో పారదర్శకత కోసం రైతులు, వీఓలు, గ్రేడర్లతో స్థానిక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతి కేంద్రంలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.పత్తి రవాణాకు ఇబ్బందులు లేకుండా రహదారుల పరిస్థితిని సమీక్షించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, మార్కెట్ యార్డుల్లో తూకం, షెడ్లు, నీరు తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమెరాలు 100 శాతం పనిచేసేలా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా రైతుల నుంచే పత్తి కొనుగోలు జరిగేలా చూడాలని, గతేడాది కంప్యూటర్ ఎంట్రీల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష పలు సూచనలు చేశారు. మార్కెట్‌కు వచ్చే రహదారుల మరమ్మతులు, సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీసు పెట్రోలింగ్, ఫైర్ సేఫ్టీ తనిఖీలు, మహిళా రైతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వర్షాలకు పత్తి తడిసి రైతులు నష్టపోకుండా సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. అనంతరం గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించినందుకు రైతు సంఘాల నాయకులు కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లను శాలువాలతో సత్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ కొయ్యాడ ప్రణయ్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించాలి

**నిర్వహణ, పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 29 సెప్టెంబర్ 2026**

ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఓపీ, ఐపీ, రోగుల నమోదు, సాధారణ వైద్య సేవలు, ప్రసూతి విభాగం, రక్త పరీక్షల విభాగం, మందుల గదిని పరిశీలించారు. ఆయా విభాగాల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లో ప్రతిరోజూ అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరై రోగులకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగితో మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన వైద్యం, మందులు అందించాలని తెలిపారు. అవసరమైన వారికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, చికిత్సకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ, పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన సమస్యలు, అదనపు అవసరాలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోయబ్ హుస్సేన్, వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్



**మంచిర్యాల /సెప్టెంబర్ 28 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సుందిళ్ల రాజయ్య తనకు చెందిన పట్టా భూమి నిషేధిత జాబితాలో ఉందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కవ్వాల్ ఫిషర్మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తమ సంఘంలో అనర్హులను తొలగించి అర్హత కలిగిన వారికి సభ్యత్వం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం కోమటిచేను గ్రామానికి చెందిన జాడి అనసూర్య తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కొరకు దరఖాస్తు చేసుకున్నానని, కాగా తన దరఖాస్తు కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లిందని, మంచిర్యాల జిల్లాకు మార్పు చేసి పథకం ప్రయోజనం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన ఆలేటి భాగ్యలక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాజీపేట మండలం సోమగూడెం ట్యాంక్ బస్తీకి చెందిన భుఖ్య జ్యోతి కాజీపేట ఓపెన్ కాస్ట్ లో తన భూమి కోల్పోయానని, ఎంజాయ్మెంట్ సర్వేలో తన పేరు వచ్చినప్పటికీ కొందరు వ్యక్తులు తన పేరును తొలగించారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన తౌట సువర్ణ తనకు గ్రామ శివారులో భూమి ఉందని, రిజిస్టర్డ్ కొనుగోలు దస్తావేజు ద్వారా నేను కొనుగోలు చేసిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: కలెక్టర్

**పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్ల వద్ద ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలి**

**సుల్తానాబాద్–కాట్నపల్లి నిరుకుళ్ల వద్ద యూ టర్న్ ఏర్పాటు చేయాలి**

**ప్రతి పాఠశాల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలి**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత ప్రమాణాల అమలు, తీసుకోవాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్ల వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సుల్తానాబాద్–కాట్నపల్లి నిరుకుళ్ల వద్ద గ్రామ సభ తీర్మానం మేరకు అవసరమైన చోట యూ టర్న్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.రోడ్డుపై పశువులను వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం రూ.10 వేల జరిమానా విధించి, పశువులను గోశాలలకు తరలించాలని ఆదేశించారు. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, హెచ్‌కేఆర్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన మేర రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణ సజావుగా జరిగేలా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని సంబంధిత వీధి వ్యాపారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు.పట్టణంలోని డివైడర్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టౌన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన యూ టర్న్‌లను సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రామగుండం నగరంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు స్ట్రిప్స్, రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక ట్రాఫిక్ ఉండే జంక్షన్ల వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ప్రతి పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని,హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు నష్టపరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరగా పంపాలని పోలీస్ అధికారులకు సూచించారు.జిల్లాలోని రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లారీలు, ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు, కార్ల ముందు, వెనుక భాగాల్లో తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.హెల్మెట్ ధరించకపోవడం, ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించక పోవడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటి వాటి వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇవి చట్టవిరుద్ధమైన చర్యలని ప్రజలకు తెలియజేస్తూ రోడ్డు భద్రత నిబంధనలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోరోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, రోడ్డు భద్రత ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి పొలాల్లో తెగుళ్లు....

**రైతులకు అధికారుల సూచనలు**



**ధర్మపురి, సెప్టెంబరు 29 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి మండలంలోని రాజారాం, జైన గ్రామాల్లో వరి పంటలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జగిత్యాల కోఆర్డినేటర్ డా.ఐ.తిరుపతి, మండల వ్యవసాయ అధికారి రాజకుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశలో ఉందని, పంటలో కాండం తొలిచే పురుగు, బ్యాక్టీరియా ఎండాకు తెగులు, ఆకు ముడత,అగ్గితెగులు లక్షణాల ను గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు క్షేత్ర స్థాయిలో పురుగు లు, తెగుళ్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కాండం తొలిచే పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా టెట్రా నిలిప్రోల్ 0.5 మి.లీ. లేదా ఐసోసైక్లో సెరం 0.6 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గితెగులు నివారణకు ట్రై సైక్లజోల్ 120 గ్రా ఎకరా లేదా ట్రైసైక్లజోల్, మాంకోజెబ్ 500 గ్రా ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు అగ్రిమైసిన్ 80 గ్రా ఎకరా లేదా పోషమైసిన్ 40–60 గ్రా ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. పురుగులు,తెగుళ్ల ఉధృతి ఉన్న పొలాల్లో యూరియా వినియో గాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు సొల్ల భీమయ్య, సాగర్ రావు,రైతులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## పేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పి నల్లపు లింగయ్య

**నారాయణపేట సెప్టెంబర్ 29(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మంగళ వారం సందర్శించి, పోలీస్ స్టేషన్ పనితీరు, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వ హణ, సిబ్బంది విధులు తదితర అంశాలను సమ గ్రంగా పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లోని రికా ర్డులు, క్రైమ్ వివరాలు, పెండింగ్ కేసులు, కేసుల దర్యాప్తు పురోగతి,సి సి టి ఎన్ ఎస్ లో కేసుల నమో దు, బీట్ వ్యవస్థ, ఫిర్యాదు ల స్వీకరణ, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా డీఎస్పీ పరిశీలించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో నాణ్యతా ప్రమాణా లు పాటిస్తూ, శాస్త్రీయ ఆధారాలను సేకరించి ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను ప్రా ధాన్యత క్రమంలో సమీక్షిస్తూ త్వరితగ తిన పరిష్కరించాలని, కోర్టు కేసుల్లో సమన్వయంతో పనిచేసి నిందితులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదా రులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం పెరిగే విధంగా బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సీసీ కెమెరాల పనితీరు, ఆయుధాలు, ప్రభుత్వ ఆస్తుల భద్రత, రికార్డుల నిర్వ హణ తదితర అంశాలను పరిశీలించా రు. సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, సమ యపాలన, అప్రమత్తత పాటించాలని సూచించారు.

ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు బీట్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించా లని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను తెలు సుకుని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

సైబర్ నేరాలు,ఎన్ డి పి ఎస్ నేరాలపై ప్రజలకు విస్తృత వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ చెప్పవద్దని ప్రజ లకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించా రు.ప్రజలతో సత్సంబంధాలు కొనసాగి స్తూ, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమర్థవంతమైన పోలీస్ సేవలు అం దించాలని డీఎస్పీ అధికారులకు, సి బ్బందికి సూచించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నారాయ ణపేట పోలీస్ స్టేషన్‌కు మంచి పేరు తీసుకురా వాలని తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్సై గాయత్రి, పోలీసు సిబంది తది తరులు పాల్గొన్నారు.

## తడి పొడి చెత్త బుట్టలతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్



**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 29**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నేడు సర్పంచ్ వెంకటేష్ ముద్రాజ్ ఆధ్వర్యంలో తడి చెత్త పొడి చెత్త బుట్టలతో పాటు ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబ సభ్యులు మన గ్రామం మన ఇల్లు తో సమానం మన వీధులు మన ఇంటి ముందు ఉన్న వాకిలితో సమానం మనం ప్రతిరోజు మన ఇంటిని మన వాకిలిని ఎంత పరిశుభ్రం గా ఉంచు కుంటామో అదేవిధంగా మన గ్రామం లోని వీధులన్నీ శుభ్రంగా ఉండాలంటే మనం తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మన ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు సహకరిస్తూ గ్రామ పారిశుద్ధ్యంలో మన గ్రామాన్ని ముందు ఉంచాలని గ్రామ ప్రజలను కోరడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపస ర్పంచి ఈసు గారి మల్లేష్. పంచాయతీ సెక్రెటరీ రమాదేవి. యాదగిరి. వార్డు సభ్యులు ముయ్యడి ముత్యాలు. పెద్ద గౌని శ్రీనివాస్. కొవ్వూరి యాదగిరి. రెడ్డిపల్లి స్వరూప. ఈసారపు రాజుగౌడ్. దొడ్లే అశోక్. గొట్టుముక్కల వెంకటేష్. బాసంపల్లి నర్సింలు. కమ్మరి చారి. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీవీఆర్ఐటీలో జాతీయ స్థాయి సర్వేయింగ్ పోటీలు



**హత్నూర వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 29 :**

బీవీఆర్ఐటీలో విష్ణు జాతీయ స్థాయి సర్వేయింగ్ పోటీ-2026 మంగళవా రం ప్రారంభమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 27 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 56 విద్యార్థి బృందాలు పాల్గొన్నాయి. సర్వేయింగ్, ఫీల్డ్ మెజర్‌మెంట్స్, ఆధునిక పద్ధతుల్లో విద్యార్థుల ప్రాక్టికల్ నైపుణ్యాలను పరీక్షించారు. సర్వేయింగ్‌లో ఖచ్చితత్వం, బాధ్యత కీలకమని నిపుణులు సూచించారు. ఎన్‌హెచ్ఏఐ లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను వివరించారు. విజేతలకు రూ.లక్ష ప్రైజ్‌మనీ, ప్రశంసాపత్రాలు అందజేశారు.

## ఊర్కొండ పేట జడ్పిహెచ్ఎస్ విద్యార్థి జిల్లా స్థాయి SGFవాలీబాల్ ఎంపిక

**ఊర్కొండ న్యూస్ 29 వుదయం ప్రతినిధి**



నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఉరుకొండ పేట జెడ్ పి హెచ్ స్కూల్లో పదోవ తరగతి చదువుతున్న విద్యార్థి ఎండీ సద్దాం SGFఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపిక. జడ్పీహెచ్ఎస్ పిటి జగన్ తెలిపారు. జడ్.పి.హెచ్. ఎస్ స్కూల్ హెచ్ఎం ఎండి రహీం ఉపాధ్యాయులు అభినందించారు. కష్టపడి ప్రాక్టీస్ చేసి ఇంకా రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని తెలిపారు

## పీఎం శ్రీ నిధులను సద్వినియోగం చేయాలి

**నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 29 (వుదయం బ్యూరో):**




వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ అభివృద్ధికి పీఎం శ్రీ నిధులను సద్వి నియోగం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నవోదయ విద్యా లయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, సౌకర్యాలు, పీఎం శ్రీ నిధుల వినియోగంపై ప్రిన్సిపల్ పూర్ణిమను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించేలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని, నిధులను పారదర్శకంగా వినియోగించాలని ఆదేశించారు.విద్యార్థుల్లో సంగీతంపై ఆసక్తి పెంచేందుకు మ్యూజిక్ టీచర్ నియామకం పూర్తయిందా అని ఆరా తీశారు. జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రదేశాలను విద్యార్థులు సందర్శించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. విద్యార్థులకు డిజిటల్ నైపుణ్యాల కోసం 20 కంప్యూటర్లు మంజూరు చేశారు. 11, 12వ తరగతి విద్యార్థులకు ఐఐటీ ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేక బోధన చేపట్టాలని, పరీక్షల ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. 6, 9, 11వ తరగతుల ఖాళీ సీట్ల భర్తీకి 30వ తేదీ వరకు ఉన్న గడువులోగా విస్తృత అవగాహన కల్పించాలన్నారు.సమావేశంలో డీఈవో రమేష్ కుమార్, ప్రిన్సిపల్ పూర్ణిమ, ఉపాధ్యాయుడు బాలాజీ నాయక్, డీఈ శిరీష్, డాక్టర్ సృజన, పేరెంట్స్ కమిటీ సభ్యులు రవికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేవుళ్లకే ప్రాంతీయ రంగుల రేవంత్‌పై భగ్గుమన్న భక్తులు!

- **రాముడు, శివుడిని విడగొడతారా? రేవంత్‌రెడ్డిపై మండిపడ్డ బీజేపీ**
- **హిందూ సమాజాన్ని చీల్చే కుట్రలు సాగనివ్వం: కమలదళం హెచ్చరిక**
- **గద్వాలలో నిప్పులు చెరిగిన బీజేవైఎం... సీఎం దిష్టిబొమ్మ దగ్ధం**

**గద్వాల సెప్టెంబర్ 29 (వుదయం బ్యూరో)**



కేవలం ఓటు బ్యాంకు కుట్రల కోసం యుగాలుగా కొలిచే దేవుళ్లను వీధిలోకి లాగుతారా? దేవుళ్ల మధ్య ప్రాంతీయ విద్వేషాల మంటలు రాజేస్తారా?" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ నాయకులు అత్యంత ఘాటుగా విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డి నోటి నుంచి వచ్చిన వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల గుండెల్లో గునపాలు దించినట్లయ్యాయని తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపుతో గద్వాల గాంధీ చౌక్ రణరంగంగా మారింది. బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను తగలబెట్టి, ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్కోటే తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు... "శ్రీరాముడు ఉత్తరాదికే పరిమితమని, శివుడు దక్షిణాదివాడని మాట్లాడటం రేవంత్‌రెడ్డి అహంకారానికి, సంకుచిత బుద్ధికి అద్దం పడుతోంది. వేల ఏళ్ల సనాతన సంస్కృతిని, హిందువుల ఐక్యతను దెబ్బతీయడానికి ప్రాంతీయ కార్డ్ ఉపయోగిస్తారా? ముఖ్యమంత్రి పదవిలో ఉన్నాననే కనీస జ్ఞానం లేకుండా హిందూ విశ్వాసాలపై దాడి చేస్తే ఊరుకునేది లేదు" అని నిప్పులు చెరిగారు. రేవంత్ తక్షణమే భక్తులకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రాన్ని ఆందోళనలతో స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుసేన్

**వనపర్తి సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి)**



దేశంలో ఎక్కడ గిరిజనులకు సమస్య ఎదురైనా వారికి న్యాయం జరిగేలా చూడటానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ముందుంటుంది : జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుసేన్మంగళవారం వనపర్తి జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుసేన్‌కు ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం ఎనికితాండా వద్ద గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి మార్గం చూపిస్తాఎనికితాండా వద్ద గిరిజనులతో సమావేశమైన జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుసేన్ మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయడం కోసమే సీలింగ్ చట్టం ఉందని తెలిపారు. మండలంలోని 27 తండాల పరిధిలో ఉన్న 460 ఎకరాల రాజా గారి భూములకు సంబంధించిన సమస్యను గిరిజనులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఏళ్ల తరబడి పొజిషన్లో ఉండి అర్హులైన పేదలకు భూములపై హక్కులు కల్పించి ఉంటే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉండేదని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ గిరిజనులకు సమస్య ఎదురైనా వారికి న్యాయం జరిగేలా చూడటానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ముందుంటుందని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతుల సమస్యలను పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.బంజారా భాషకు దేశవ్యాప్తంగా ఆదరణ ఉందని పేర్కొన్న ఆయన, ప్రజలకు మేలు చేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు సమయం కేటాయించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

**కర్నె తండాలో తుల్జా భవాని ఆలయ సందర్శన**

అనంతరం కర్నె తండాలోని తుల్జా భవాని ఆలయాన్ని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుసేన్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు వైద్య సేవలు అందించకపోవడంపై అసహనంకర్నె తండా వద్ద నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి ఇంకా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రాలేదని స్థానికులు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఫిర్యాదు మేరకు జాటోత్ హుసేన్ ఆస్పత్రిని సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయి, ప్రారంభంఅయినప్పటికీ వైద్య సేవలు ఎందుకు కాలేదనే విషయంపై వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు.

**సవాయి గూడెం తండా రహదారి సమస్యపై ఆరా**

అనంతరం వనపర్తి మండలంలోని సవాయి గూడెం తండాను సందర్శించిన జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు, తండాకు రహదారి సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రహదారి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తండావాసులతో చర్చించారు. ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించే అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

**కిష్టగిరి తండాలో భూముల క్షేత్రస్థాయి పరిశీలన**

ఆ తర్వాత వనపర్తి మండలం కిష్టగిరి తండా వద్ద గిరిజన రైతులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు సాగు చేసుకుంటున్న భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోడు భూములకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు తెలిపారు.గిరిజనుల భూ హక్కులు, వైద్య సేవలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుసేన్ పేర్కొన్నారు.ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు షెడ్యూల్డ్ తెగల నాయకులు తదితరులు కమిషన్ సభ్యులు వెంట ఉన్నారు.

## అధికారుల వేధింపులపై బీజేపీ నేతల ఫిర్యాదు

- **రంగంలోకి కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కోహెడ, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):**



బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధికారుల ఒత్తిళ్లు, రాజకీయ పరిణామాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు.కరీంనగర్‌లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం, బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మ్యాకాల రజినీకాంత్ రెడ్డి, తీగలకుంటపల్లి సర్పంచ్ మ్యాకాల స్వర్ణలత సురేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రాగుల మహేష్ యాదవ్ తదితరులు బండి సంజయ్‌ను కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ప్రజలచే ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారుల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు, రాజకీయ కక్షసాధింపు పరిస్థితులు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కేంద్రమంత్రికి వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా పనిచేసేలా ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం అందించాలని కోరారు.వారి విజ్ఞప్తిపై స్పందించిన బండి సంజయ్ కుమార్ సంబంధిత జిల్లాస్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులను పార్టీ భేదాలు లేకుండా ప్రజాసేవకులుగా గుర్తించి, వారి పరిధిలోని సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు.అలాగే అధికారులు రాజకీయ కక్షసాధింపు ధోరణులకు తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని బండి సంజయ్ సూచించినట్లు నాయకులు వెల్లడించారు.

## ఎస్సీ, ఎస్టీల హక్కుల సంరక్షణకు కమిషన్ విశేష కృషి

- **సిద్దిపేట ఐడిఓసిలో రివ్యూ సమావేశం నిర్వహించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**సిద్దిపేట, సెప్టెంబర్ 29 (వుదయం బ్యూరో)**



సిద్దిపేట, సెప్టెంబర్ 29: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల హక్కుల సంరక్షణకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్టానికి లోబడి విశేష కృషి చేసిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. మంగళవారం సిద్దిపేట ఐడిఓసి సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్‌లతో కలిసి ల్యాండ్ అట్రాసిటీస్, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, అక్టోబర్ 4వ తేదీతో తమ పదవీకాలం పూర్తవుతుందని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సహకారంతో దళితులు, గిరిజనుల హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేశామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ అవమానాలను భరించరని, సమస్యలపై అధికారుల వద్దకు వచ్చే దళితులు, గిరిజనుల పట్ల స్నేహభావంతో వ్యవహరించాలని ఉద్యోగులకు సూచించారు. ప్రతి నెల చివరి వారంలో మండల తహసీల్దార్, స్థానిక ఎస్సై, DVMC సభ్యులు, అధికారులతో కలిసి 'సివిల్ రైట్స్ డే' నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకొకసారి డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని, ఉద్యోగ నియామకాలలో రోస్టర్ విధానం ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌కు సంబంధించిన ₹102 కోట్ల బకాయిలను అక్టోబర్ నెలలో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాల పరిష్కారానికి సీఎంగారు అనుకూలంగా స్పందించారని తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, బడ్జెట్ రాగానే అట్రాసిటీ బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్నామని తెలిపారు. సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను తీవ్రంగా పరిగణించి 60 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేస్తున్నామని, ప్రతి నెల డివిజన్ల వారీగా రివ్యూ నిర్వహిస్తున్నామని వివరించారు.

అక్టోబర్ 4న కమిషన్ పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు కమిషన్ చైర్మన్, సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజా గంగారాం, ఎస్సీ కార్పొరేషన్ విజయ్ భార్గవ్, ఆర్డీవోలు, ఏసీపీలు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థుల విద్యాభివృద్ధికి అఖిల్ రాజ్ ఫౌండేషన్ చేయూత

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 29, వుదయం :**

విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తూ అఖిల్ రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ స్థాపకుడు తౌడ సత్యనారాయణ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యాభ్యాసంలో ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించడంతో పాటు, వారి చదువుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్యార్థుల భవిష్యత్తే సమాజ భవిష్యత్తు అనే లక్ష్యంతో ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భవాని, అధ్యాపకులు, ఫౌండేషన్ సభ్యులు కీసరి స్వామి, ఇనుప రవి, సునీల్ కుమార్, వెంకటేష్, చంద్రం, కిషన్, నరేష్, రాజు, నరసింహులు, ఆసుక రాజు, నవీన్, రాకేష్ పాల్గొన్నారు.


## నిదజం కోసం జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 29:వుదయం**

20వ జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్ (నిదజం ) కోసం సంగారెడ్డి జిల్లా జట్టు ఎంపిక పోటీలు మంగళ వారం డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన TGIIC చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు.జిల్లా నలుమూలల నుంచి సుమారు 600 మంది బాలురు, బాలికలు (అండర్ 14, అండర్16) ఉత్సాహంగా పాల్గొన్నారు. 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, ట్రయథ్లాన్, పెంటాథ్లాన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డి. సోహైల్ అలీ, కార్యదర్శి ఎం.డి. జావీద్ అలీ ఆధ్వర్యంలో పోటీలు విజయవంతంగా నిర్వహించారు.టీజీజేఏసీ చైర్మన్ ఎం.డి.జావీద్ అలీ, TNGOs కార్యదర్శి వి. రవి, అసోసియేట్ అధ్యక్షుడు కాసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, ట్రెజరర్ జి. శ్రీనివాస్, ప్రమోద్ కుమార్, స్టేట్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కర్, క్లాస్4 అధ్యక్షుడు షరీఫ్, మల్లికార్జున్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల అనంతరం జాతీయస్థాయి నిదజాం పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

## 5 నుండి 17 సంవత్సరల వయస్సు పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్‌లు ఉచితం




**మహబూబ్ నగర్, 29సెప్టెంబర్ (వుదయం బ్యూరో)**

UIDAIలో కొత్త ఆధార్ సేవా కేంద్రాలను ప్రారంభం. మహబూబ్‌నగర్‌లో ఆధార్ సేవా కేంద్రాలు కొత్త నమోదు, పేరు/చిరునామా సవరణ, మొబైల్ నంబర్ అప్‌డేట్, ఫోటో/బయోమెట్రిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్‌డేట్ వంటి సేవలను అందిస్తున్నాయి. ప్రధాన కేంద్రం UIDAI - ఆధార్ సేవా కేంద్రం RR టవర్, హబీబ్ నగర్ ఓల్డ్ ఆర్.టి.ఓ ఆఫీసు ఉదయం 9:30 నుండి సాయంత్రం 5:30 వరకు పనిచేస్తుంది. ఆధార్ నంబర్ ఉన్నవారు 5 మరియు 15 సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు, తమ ఆధార్‌ను బయోమెట్రిక్ సమాచారంతో అప్‌డేట్ చేసుకోవాలి. తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌లు (MBUలు) అని పిలువబడే ఇటువంటి బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, 57 సంవత్సరాల మరియు 1517 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచితంగా అందించబడుతుంది. ప్రభుత్వ మీసేవా/ఆధార్ నమోదు & సవరణ కేంద్రం రాజేంద్ర నగర్, పోస్ట్ ఆఫీసు కూడా ఉంది, ఇది సోమవారం నుండి శనివారం వరకు పనిచేస్తుంది. ఈ సేవల్లో కొత్త నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్‌డేట్, ఆధార్ ప్రింట్ ఉన్నాయి. ముఖ్యంగా, 5-17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్‌ను UIDAI సెప్టెంబర్ 30, 2026 వరకు ఉచితంగా అందిస్తోంది. అపాయింట్‌మెంట్ తీసుకునే ముందు, UIDAI వారి సమీప ఆధార్ కేంద్రాన్ని కనుగొనండి టూల్ ద్వారా దానిని నిర్ధారించుకోండి. 1947 హెల్ప్‌లైన్ నంబర్ కూడా అందుబాటులో ఉంది.

## శ్రీజకు వైద్య విద్యలో అరుదైన అవకాశం

- **నీట్‌లో ప్రతిభతో ఎంబీబీఎస్ సీటు.. ఘనంగా సన్మానించిన*గ్రామస్థులు**

కోహీర్, సెప్టెంబరు 29 (వుదయం ప్రతినిధి): కోహీర్ మండలం గుర్జివాడ గ్రామానికి చెందిన శ్రీజ ఎంబీబీఎస్ సీటు సాధించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకున్న శ్రీజ పట్టుదలతో కృషి చేసి నీట్‌లో ప్రతిభ కనబరిచింది. దీంతో ఆమెకు ఎంబీబీఎస్ సీటు లభించింది.శ్రీజ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు, కుటుంబ సభ్యులను,శ్రీజా ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. శ్రీజ విజయం గ్రామంలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.వైద్య విద్యలో శ్రీజకు లభించిన అవకాశం గుర్జివాడ గ్రామానికి గర్వకారణమని అన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం కష్టపడాలని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతం నుంచి నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. శ్రీజను ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని ఇతర విద్యార్థులు కూడా ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని సూచించారు. ఆమె విజయానికి సహకరించిన కుటుంబ సభ్యులను కూడా గ్రామస్థులు అభినందించారు.

కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొని శ్రీజను అభినందించారు. ఈ కార్యక్రమంలో బన్నీ, శివరెడ్డిపల్లి, సునీల్, మోమిన్‌పేట్, కర్ణే మహేందర్, జంగంగారి సతీష్‌కుమార్, పి. ప్రవీణ్ తదితరులు పాల్గొని శ్రీజను అభినందించారు.



# మునుగోడు గల్లీల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి 'మార్నింగ్ వాక్'

- అధికారులకు డ్రైనేజీ క్లియరెన్స్, మాస్టర్ ప్లాన్ ఆదేశాలు
- జోగుగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన జీపీ భవనం ప్రారంభం





**మునుగోడు/చండూరు, సెప్టెంబరు 29( వుదయం):**

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటి తక్షణ పరిష్కారమే లక్ష్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. మునుగోడు పట్టణంలో ఉదయాన్నే 'మార్నింగ్ వాక్' చేస్తూ గల్లీ గల్లీ తిరిగిన ఆయన, అనంతరం చండూరు మండలం జోగుగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**బుల్లెట్‌పై పర్యటన.. సమస్యలపై ఆరా**

మునుగోడు పట్టణంలోని 1, 2, 3 వార్డుల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఉదయాన్నే కాలినడకన పర్యటించారు. గల్లీల్లో తిరుగుతూ తాగునీటి సరఫరా, డ్రైనేజీ నిర్వహణపై స్థానికులను ఆరా తీశారు. ఎమ్మెల్యే స్వయంగా తమ వద్దకు రావడంతో పలువురు మహిళలు వీధి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్వయంగా బుల్లెట్ వాహనాన్ని నడుపుకుంటూ పట్టణమంతా పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైతే వెంటనే ట్రెంచ్‌లు తవ్వి తక్షణ కార్యాచరణ ప్రారంభించాలని సర్పంచ్, అధికారులను ఆదేశించారు. భౌగోళిక స్థాయిలను అంచనా వేసి మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ కోసం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్, చిట్యాల రోడ్డులోని మహాప్రస్థానంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**రూ.20 లక్షలతో కొత్త జీపీ భవనం ప్రారంభం**

అనంతరం చండూరు మండలం జోగుగూడెంలో రూ.20 లక్షల వెచ్చించి నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో కోటి, పంచాయతీ కార్యదర్శి రాజు తో పాటు చండూరు మున్సిపల్ చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, స్థానిక సర్పంచ్ ఆలేటి యాదయ్య, ఉపసర్పంచ్ పెండెం ఉపేందర్, వార్డు మెంబర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి ,పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్ ,గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రాహుల్ కాదు.. ఆయన జేజమ్మ దిగొచ్చినా మోదీని ఢీకొట్టలేరు: ఈటల రాజేందర్



**రాజ్యాంగ వ్యవస్థలను కించపరిస్తే సహించేది లేదని కమలం నేతల హెచ్చరిక**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి):**

కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీ విపరీత చేష్టలను చూసి దేశ ప్రజలు 'తూ' అని అసహ్యించుకుంటున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ కాదు కదా.. ఆయన జేజమ్మ దిగివచ్చినా ప్రధాని నరేంద్ర మోదీని రాజకీయంగా ఢీకొట్టే సత్తా ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, రితేశ్ రాథోడ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడాల్సిన విపక్ష పాత్రను విస్మరించి, కాంగ్రెస్ అర్థరహిత ఆరోపణలతో కాలం వెళ్లదీస్తోందని ఈటల దుయ్యబట్టారు. రాహుల్ విదేశాలకు వెళ్లి భారత ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేలా, ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ ప్రక్రియను రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. "రెండేళ్ల క్రితం ఓటర్ల జాబితాను సరిచేయాలని డిమాండ్ చేసిందే రాహుల్. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా పదిసార్లు ఈ రివ్యూ జరిగింది. చనిపోయిన వారి పేర్లు తొలగించడం, డూప్లికేట్ ఓట్లను ఏరివేయడం నేరమా?" అని నిలదీశారు.

**ఎన్నికల సంఘాన్ని భ్రష్టుపట్టించిందే హస్తం పార్టీ**

ఈవీఎంలపై కాంగ్రెస్ వైఖరి దొంగే దొంగ అన్నట్లుందని ఈటల ధ్వజమెత్తారు. "ఈవీఎంలు తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ అని డబ్బా కొట్టుకుంటారు.. తీరా ఓడిపోతే ఈవీఎంల ట్యాంపరింగ్ అంటూ గగ్గోలు పెడతారు. వీవీప్యాట్లను తీసుకొచ్చింది మోదీ ప్రభుత్వం. నిజంగానే ట్యాంపరింగ్ చేసే అవకాశముంటే 2024 ఎన్నికల్లో మేం 400 సీట్లు ఎందుకు దాటలేకపోయాం?" అని ప్రశ్నించారు. తమిళనాడులో విజయ్ గెలిచినా, కేరళలో కాంగ్రెస్ గెలిచినా ఈవీఎంలు సక్రమమేనా అని నిలదీశారు. ఎన్నికల సంఘాన్ని చరిత్రలో అత్యంత దుర్వినియోగం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆయన ధ్వజమెత్తారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య గొంతు నొక్కిన చరిత్ర ఆ పార్టీదని, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీని రక్షించినందుకు ఎం.ఎస్. గిల్‌కు కేంద్ర మంత్రి పదవి కట్టబెట్టి వ్యవస్థలనే అపహాస్యం చేశారని దుయ్యబట్టారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా మోదీ సర్కార్ ముందడుగు వేస్తుంటే, అక్కసుతో బురదజల్లుతున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్ తీరు మారకపోతే ప్రజలే కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. బీహార్‌లో ఓటు చోరీ నినాదంతో వెళ్లి ఎలా తుడిచిపెట్టుకుపోయారో, దేశవ్యాప్తంగా కూడా కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని తేల్చిచెప్పారు.

**రాహుల్‌కు జరిగింది ఓటు చోరీ కాదు.. 'అఖల్ చోరీ': ఎంపీ ధర్మపురి అర్వింద్**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వైఖరిపై తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేశంలో ఎక్కడా ఓటు చోరీ జరగలేదని, వాస్తవానికి రాహుల్ గాంధీకే 'అఖల్ చోరీ' (మెదడు చోరీ) అయిందని విమర్శించారు. ప్రపంచ దేశాల్లో తిరుగుతూ భారతదేశ పరువును, భారత ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడటం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. గతంలో ఎన్నికల కమిషనర్లను కాంగ్రెస్ పార్టీ ఎలా దుర్వినియోగం చేసిందో, పదవీ విరమణ అనంతరం వారికి రాజ్యసభ సీట్లు, కేంద్ర మంత్రి పదవులు, గవర్నర్ పదవులు ఎలా కట్టబెట్టిందో చరిత్ర ఆధారాలతో సహా నిరూపిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశించిన 'కాంగ్రెస్ ముక్త భారత్' కలను రాహుల్ గాంధీ తన అపరిపక్వ నిర్ణయాలు, స్వయంకృత విపరీత చేష్టలతో స్వయంగా నెరవేరుస్తున్నారని అర్వింద్ ఎద్దేవా చేశారు.

**రాజ్యాంగ వ్యవస్థలను దిగజార్చడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు: ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా ఖండించారు. భారత ఎన్నికల సంఘం వంటి అత్యున్నత, రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ఎలాంటి ఆధారాలు లేకుండా బాధ్యతారాహిత్యంగా ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపనమ్మకాన్ని కలిగించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని, ఇందుకోసం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం స్పష్టమైన నిబంధనలకు లోబడి పనిచేస్తుంటే, కేవలం సంకుచిత రాజకీయ లబ్ధి కోసమే రాజ్యాంగ సంస్థల ప్రతిష్టను దిగజార్చడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా చౌకబారు ఆరోపణలు మానుకొని బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు.

## 'ఎన్‌ఎమ్ఎమ్ఎస్' మెటీరియల్ పంపిణీ



**చండూరు, సెప్టెంబరు 29( వుదయం):**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలనే లక్ష్యంతో పల్రెడ్డి (పల్ టెక్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని చండూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు 'ఎన్ఎమ్ఎమ్ఎస్' (NMMS) పోటీ పరీక్షల ఉచిత స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఫౌండేషన్ చైర్మన్ పల్రెడ్డి రామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులు సులభమైన రీతిలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మండల విద్యాధికారి (ఎంఈవో) వి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఫౌండేషన్ అందజేసిన పుస్తకాలను సద్వినియోగం చేసుకొని, ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.కోటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు బావండ్ల వీరేశం, మద్దోజు సుధీర్ బాబు, గంగిరెడ్డి కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యే 'మట్టా'

- పనిచేయని అధికారులకు స్వీట్ వార్నింగ్!
- రెవెన్యూ, విద్యా, వైద్య రంగాలపై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రత్యేక దృష్టి
- రెండోసారి ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు తప్పవు: ఎమ్మెల్యే తీవ్ర హెచ్చరిక
- ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై త్వరలో సమగ్ర సమీక్ష

**కల్లూరు, సెప్టెంబర్ 29(వుదయం ప్రతినిధి )**



సత్తుపల్లి నియోజకవర్గంలో పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఒకవైపు పార్టీ కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తూనే, మరోవైపు ప్రభుత్వ అధికారుల పనితీరుపై కఠిన వైఖరి అవలంబిస్తున్నారు.

కార్యకర్తలకు పెద్దపీట,క్షణాల్లో సమస్యల పరిష్కారం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే ప్రతి కార్యకర్తకు ఎమ్మెల్యే కుటుంబం అత్యున్నత గౌరవాన్నిస్తూ పెద్దపీట వేస్తోంది. ప్రజలు, కార్యకర్తలు తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, క్షణాల్లో పరిష్కరించేలా వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. ప్రజా పాలనలో అధికారుల జవాబుదారీతనం పెంపొందించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులకు పరోక్షంగా "స్వీట్ వార్నింగ్" ఇచ్చారు. ప్రజా సమస్యలపై ఒక్కసారి సూచనలు చేస్తామని, "ఒకే అంశంపై రెండోసారి ఫిర్యాదు వస్తే మాత్రం అత్యంత కఠినమైన చర్యలు ఉంటాయి" అని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజా సంక్షేమంలో కీలకమైన రెవెన్యూ, విద్యా, వైద్య శాఖలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మూడింటికి సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాన్య నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై త్వరలోనే సమగ్ర సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇప్పటికే అధికారుల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నామని, ప్రజా వైద్యంతో చెలగాటమాడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముందుకు సాగుతుండటంతో నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## షేక్ మొహమ్మద్‌పై దాడి చర్యలు తీసుకోవాలి

**జిల్లా ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఫిర్యాదు**

**నల్లగొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబరు 29**



నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని మర్రూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు షేక్ మొహమ్మద్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. మర్రూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సామాజిక మాధ్యమాల్లో బీఆర్ఎస్ పార్టీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. వాటిపై షేక్ మొహమ్మద్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం ద్వారా సందేశం పంపినట్లు చెప్పారు. అనంతరం సదరు వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే అండదండలతో షేక్ మొహమ్మద్‌పై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దాడిలో గాయపడిన షేక్ మొహమ్మద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, ఆయనపైనే కేసు నమోదు చేయడం సమంజసం కాదని అన్నారు. బాధితుడికి న్యాయం చేయాలని పోలీసు అధికారులను కలిసేందుకు వెళ్లిన తనకు కనీస మర్యాద కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. రామన్నపేట మండలంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎస్సీ యువకులపై దాడి జరిగినప్పటికీ, బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పిటిషన్ స్వీకరించడం లేదని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు పలు చోట్ల జరుగుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడులు, వేధింపులకు పాల్పడుతున్నారని లింగయ్య ఆరోపించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అడ్డుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు.

## తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబరు 29:**



తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. ఫ్రాంక్‌ఫర్ట్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా అభివృద్ధి చెందిందని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఇన్నోవేషన్, సాంకేతిక రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, ఇన్నోవేషన్ రంగాల్లో రాష్ట్రంలో ఉన్న అవకాశాలను విదేశీ పెట్టుబడిదారులు పరిశీలించాలని సూచించారు.

విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు మాతృభూమితో అనుబంధాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రవాస తెలంగాణ వాసులు పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను రాష్ట్రానికి తీసుకురావడంలో వారధిగా నిలవాలని కోరారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో తెలుగు వారు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం గర్వకారణమన్నారు. జన్మభూమి అభివృద్ధికి వారు తమవంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత కాన్సులేట్ ప్రతినిధులు గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌లను శాలువాలతో సత్కరించి స్వాగతించారు. కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రటరీ డా. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ ఆర్.తిరుపతి, లేజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషకాహార మాసోత్సవాలు



**కల్లూరు,సెప్టెంబర్ 29 (వుదయం ప్రతినిధి)**

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపాల దేవబోయినపల్లి (1, 2), వచనాయక తండా అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహార మహోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీవో నిర్మల జ్యోతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను సంపూర్ణంగా అరికట్టాలని, వీటికి వ్యతిరేకంగా చైతన్యవంతంగా ఉండాలని కోరారు. చిన్నారులను ప్రీ-స్కూల్‌కు పంపి నాణ్యమైన విద్యనందించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సెక్టార్ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న 'ఆరోగ్య లక్ష్మి' భోజనం ప్రతి పేద బిడ్డకూ అందాలన్నదే ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. పౌష్టికాహారం లబ్ధిదారులందరికీ సక్రమంగా చేరువయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రక్తహీనత నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు రాంబాబు, ఆదినారాయణ, సెక్టార్ సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్లు జ్యోతిపుష్ప, రాధ, కృష్ణవేణిలతో పాటు ఆశా కార్యకర్తలు, ఆయాలు, గ్రామ దీపికలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

**మధిర హై కేర్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ జంగా నవీన్ రెడ్డి**

**మధిర సెప్టెంబర్ 29, వుదయం,ప్రతినిధి:**



గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని మధిర హై కేర్ మల్టీ సూపర్ స్పెషాలిటీ అధినేత డాక్టర్ జంగా నవీన్ రెడ్డి అన్నారు.ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని,గుండె సంబంధిత వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు,శారీరక శ్రమ లేకపోవడం,అధిక ఒత్తిడి, పొగతాగడం, మద్యపానం వంటి కారణాలు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం చేయడంతో పాటు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు.అధిక రక్తపోటు, మధు మేహం,అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అకస్మాత్తుగా చెమటలు పట్టడం,తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుం డా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.



## మృతుడి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం

**చండూరు, సెప్టెంబర్ 29(వుదయం):**

మండల పరిధిలోని బోడంగిపర్తి (కుమ్మరిగూడెం) గ్రామానికి చెందిన ఎస్‌కే జానీ ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. అందరూ కలిసి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని సేకరించి మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ సిజావుద్దీన్, సర్పంచ్ బొమ్మల సుగుణమ్మ శంకర్, ఉపసర్పంచ్ ముత్యాలు, మాజీ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## డీఈవో బదిలీపై విద్యార్థి సంఘాల హర్షం

**సూర్యాపేట, సెప్టెంబర్ 30: వుదయం ప్రతినిధి**

సుదీర్ఘకాలంగా (ఐదేళ్లు) సూర్యాపేట జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన అశోక్ బదిలీ కావడంతో మంగళవారం పలువురు విద్యార్థి సంఘ నాయకులు స్థానిక 60 అడుగుల రోడ్డులో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదేళ్లుగా డీఈవోగా పనిచేసిన అశోక్ కుమార్ ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యవస్థను ప్రోత్సహించారని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా విద్యా రంగంలో నెలకొన్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, నిబంధనలు అతిక్రమించిన ప్రైవేట్ సంస్థలపై ఫిర్యాదులు చేసినా, సాక్ష్యాధారాలు ఉన్నా పట్టించుకోకుండా వారికే వత్తాసు పలికారని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను ఒకరోజు కూడా సందర్శించలేదని, ముడుపులకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. బదిలీ కావడం జిల్లా విద్యా రంగానికి మేలు జరిగిందని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టే డిఇఒ అయినా విధులను సక్రమంగా నిర్వర్తించి పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వావిళ్ళ రమేష్ గౌడ్, నిద్ర సంపత్ నాయుడు, ఎర్ర అఖిల్, గంగారపు శ్రీనివాస్, శివ, నరేష్, ఉపేందర్, లోకేష్, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**చండూరు, సెప్టెంబరు 29(వుదయం)**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందని తహసీల్దార్ (ఎమ్మార్వో) రమాకాంత్ శర్మ తెలిపారు. చండూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ.. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందజేసే ఉచిత రేషన్ సరుకులు సులభంగా, పారదర్శకంగా అందుతాయని పేర్కొన్నారు. అర్హత ఉండి రేషన్ కార్డులు లేని వారికి ప్రాధాన్యతా క్రమంలో కార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చౌడవరం, పల్లెవాడ గ్రామపంచాయతీలను తనిఖీ చేసిన డిఎల్పిఓ జి విజయలక్ష్మి

**సత్తుపల్లి సెప్టెంబర్ 29 ( వుదయం ప్రతినిధి)**



వేంసూర్ మండల పరిధిలోని చోడవరం పల్లెవాడ గ్రామపంచాయతీల్లో డి ఎల్ పి ఓ. జి విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా గ్రామపంచాయతీ రికార్డులను, నర్సరీ, షెడ్ మరియు క్రిమటోరియంను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని , అపరిశుభ్ర ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లాలని, ప్రధాన రహదారుల వెంబడి చెత్త వేయకుండా పర్యవేక్షించాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేసిన త్రాగునీటినే సరఫరా చేయాలని, ఫాగింగ్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు . ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి రంజిత్ కుమార్ పల్లెవాడ సర్పంచ్ శ్రీదేవి చోడవరం సర్పంచ్ నల్లి బోయిన అంజమ్మ కార్యదర్శులు రామకృష్ణమూర్తి అఖిల్ నరేష్ పాల్గొన్నారు.

## అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలను సందర్శించిన డీఏఈఎస్ఐ డీలర్లు



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 29, (వుదయం ప్రతినిధి):**

అశ్వారావుపేట లోని వ్యవసాయ కళాశాలకు సుమారు 40 మంది DAESI (Diploma in Agricultural Extension Services for Input Dealers) డీలర్లు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటల ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించి, ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం మరియు పంటల వైవిధ్యంపై అవగాహన పొందారు. కళాశాలలోని పంటలను పరిశీలించిన సందర్భంగా డా. పి. నీలిమ మరియు డా. శివ డీలర్లకు వివిధ వ్యవసాయ మరియు ఉద్యాన పంటల సాగు విధానాలు, వాటి ప్రాముఖ్యత, నీటి మరియు పోషక యాజమాన్యం, పంటల సంరక్షణ మరియు రైతులకు అందుబాటులో ఉన్న ఆదాయ అవకాశాలను వివరించారు. డీలర్లు ముఖ్యంగా కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగుపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. కొబ్బరిలో అంతర పంటలుగా కోకో, అరెకా పామ్, జాజికాయ (Nutmeg), హెలికోనియా వంటి పంటలను సాగు చేయడం ద్వారా తోటలోని భూమి, నీరు, నీడ మరియు ఇతర వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని అదనపు ఆదాయం పొందే అవకాశాలను డా. నీలిమ, డా. శివ వివరించారు. అదేవిధంగా కొబ్బరి తోటల్లో తాత్కాలికంగా సాగు చేయగల పసుపు, అల్లం, చిలగడదుంప, అరటి మరియు ఇతర దుంప పంటల గురించి కూడా డీలర్లకు వివరించారు. ప్రధాన పంటకు అనుకూలంగా అంతర పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు తోట అభివృద్ధి దశలో కూడా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. కళాశాలలో ప్రదర్శిస్తున్న వివిధ పంటల వైవిధ్యం, అంతర పంటల సాగు నమూనాలు మరియు అధిక విలువ కలిగిన ఉద్యాన పంటలపై డీలర్లు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సందర్శన ద్వారా రైతులకు మరింత శాస్త్రీయమైన, ఆచరణాత్మకమైన సలహాలు అందించేందుకు ఉపయోగకరమైన సమాచారం లభించిందని వారు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడంలో DAESI డీలర్లు ఒక ముఖ్యమైన వారధిగా పనిచేయాలని, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతుల క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని డా. పి. నీలిమ, డా. శివ సూచించారు.

## పిఆర్టియు నూతన మండల కమిటీ

**మధిర, సెప్టెంబర్,29, వుదయం, ప్రతినిధి:**



పీఆర్టీయూ మధిర మండల శాఖ సర్వసభ్య సమావేశం స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఘనంగా జరిగింది.పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు సమక్షంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జి. విజయ్ అమృత కుమార్, టీ. రత్నకుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. రాబోయే రెండు సంవత్సరాలకు మధిర మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చిలుకూరి సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోలే సుధాకర్, గౌరవాధ్యక్షులుగా కే. శాంతబాబు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.డి.జమీర్, ఎం. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లెల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తెల్లమేకల శ్రీనివాసరావు, చేడే సతీష్, మర్రి కృష్ణయ్య, డి.శ్యామలరావు, వి.వి.ఎన్. రాజు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా పి.డి.పి. జ్యోతి, మహిళా ఉపాధ్యక్షురాలిగా టీ. అనసూయ, మహిళా కార్యదర్శిగా జి. లలితకుమారి, కార్యదర్శులుగా టీ. అజయ్‌కుమార్, జి. కేశవులు, కే. నరసింహాచార్యులు,కే. కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## మధిరలో విద్యార్థులకు డిక్షనరీలు, పెన్నుల పంపిణీ



**మధిర, సెప్టెంబర్,29, వుదయం, ప్రతినిధి:**

భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులతో వనమా ట్రస్టు ఆధ్వర్యంలో, దాతల సహకారంతో మధిర పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, టీవీఎం హైస్కూల్, సీపీఎస్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సుమారు వంద మంది విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలు, హిందీ-తెలుగు డిక్షనరీలు, పెన్నులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు, ఎర్రుపాలెం మండల మాజీ అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు,వేములపల్లి ప్రసాద్, జల్ల రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యాభ్యాసంలో ఉపయోగపడే పుస్తకాలు, సామగ్రిని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. డిక్షనరీలు, పెన్నుల పంపిణీతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి వనమా ట్రస్టుకు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

## శరీరంలో దీర్ఘకాలికంగా వాపులు ఉంటే.. గుండెపై ప్రభావం..

శరీరంలో దీర్ఘకాలంగా కొనసాగే స్వల్పస్థాయి వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్ గుండెపై నిశ్శబ్దంగా ప్రభావం చూపుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. దాదాపు 4.8



లక్షల మంది బ్రిటన్ వాసుల ఆరోగ్య సమాచారాన్ని పరిశీలించిన పరిశోధకులు, శరీరంలో వాపు స్థాయిలు ఎక్కువగా ఉన్నవారిలో గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన హృదయ సంబంధ సమస్యల ముప్పు తక్కువ స్థాయి వాపు ఉన్నవారితో పోలిస్తే 43 శాతం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా ఈ మార్పులు బయటకు ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే సంవత్సరాల పాటు కొనసాగుతాయని పరిశోధకులు తెలిపారు.రక్తంలో గ్లైకోప్రొటీన్ ఎసిటైల్స్ (గ్లైక్‌ఏ) అనే సూచికను పరిశీలించడంతోపాటు గుండె చిత్రాలు, జన్యుపరమైన సమాచారాన్ని విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చారు. శరీరంలో వాపు స్థాయిలు పెరిగిన కొద్దీ గుండె నిర్మాణంలో కొన్ని మార్పులు కనిపించినట్లు అధ్యయనం తెలిపింది. గుండె గోడలు మందంగా మారడం, గుండె గదుల పరిమాణం తగ్గడం, గుండె సక్రమంగా రక్తాన్ని నింపుకోలేకపోవడం వంటి మార్పులు ఇందులో ఉన్నాయి. ఇవి మొదట్లో ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా కొనసాగినా, కాలక్రమంలో గుండె వైఫల్యానికి దారితీసే అవకాశం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. దీర్ఘకాలిక వాపుకు జీవనశైలి మాత్రమే కాకుండా మానసిక ఒత్తిడి, ఆర్థిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు, పొగతాగడం, శరీరంలో అధిక కొవ్వు వంటి అనేక అంశాలు సంబంధం కలిగి ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన పరిస్థితులు, మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారిలో వాపు స్థాయిలు అధికంగా ఉండడంతో పాటు గుండె నిర్మాణంలో మార్పులు కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అలాగే కొంతమందిలో జన్యుపరమైన అంశాలు కూడా శరీరంలో వాపు ప్రభావాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని లేదా దానికి లోనయ్యే అవకాశాన్ని ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు. ఇంటర్‌ల్యూకిన్-1, టీఎన్ఎఫ్ కుటుంబాలకు చెందిన కొన్ని వాపు సంబంధిత ప్రోటీన్లు గుండెలో కనిపించే మార్పులకు కారణమయ్యే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు. వీటిలో కొన్ని ప్రోటీన్లను లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే మందులపై పరిశోధనలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో రక్త పరీక్షలు, జన్యుపరమైన ప్రమాద అంచనాలను కలిపి ఉపయోగించడం ద్వారా గుండె జబ్బుల ముప్పు ఉన్నవారిని ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అధ్యయనం సూచించింది. అయితే జన్యుపరమైన ప్రభావం లేదా ప్రతికూల జీవన పరిస్థితులు ఉన్నంత మాత్రాన గుండె జబ్బులు తప్పనిసరిగా వస్తాయని అర్థం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు. వాపుకు కారణమయ్యే అంశాలను నియంత్రించడం, జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవడం ద్వారా దీర్ఘకాలిక గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు.

## ఈ అలవాట్లతో.. జుట్టు ఆరోగ్యంగా..!

ఆరోగ్యంగా రోజును ప్రారంభిస్తే.. రోజంతా ఉత్సాహంగా ఉండచ్చన్న సంగతి తెలిసిందే! ఈ నియమం జుట్టు ఆరోగ్యానికీ వర్తిస్తుందంటున్నారు నిపుణులు. మనం పాటించే కొన్ని



అలవాట్లు జుట్టు ఒత్తుగా, దృఢంగా పెరిగేలా చేస్తాయంటున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి.. ఉదయాన్నే మనం తీసుకునే అల్పాహారం ఆకలి తీర్చడానికే కాదు.. జుట్టు ఒత్తుగా పెరిగేలా కూడా చేస్తుందట! అయితే ఇందుకోసం ప్రొటీన్లు అధికంగా ఉండే కోడిగుడ్లు, పెరుగు, పీనట్ బటర్, నట్స్, ప్రొటీన్ బార్స్.. వంటివి తీసుకోవాలంటున్నారు నిపుణులు.

ఒత్తిడి ఆరోగ్యాన్నే కాదు.. జుట్టు ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. దీన్నుంచి విముక్తి పొందడానికి ఉదయాన్నే చేసే వ్యాయామాలు ఎంతో కీలకమైనవి. ఇందులో భాగంగా నడక, యోగా, ధ్యానం.. వంటివి ప్రయత్నించాలి. ఇవి కుదుళ్లకు రక్తప్రసరణను మెరుగుపరిచి జుట్టు ఒత్తుగా పెరిగేలా చేస్తాయంటున్నారు నిపుణులు.

కొబ్బరి, బాదం, జొజోబా నూనెల్లో ఏదో ఒక దాన్ని కుదుళ్లకు అప్లై చేసుకుని ఐదు నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. దీనివల్ల జుట్టు కుదుళ్లకు పోషణ అందుతుంది. ఫలితంగా కేశాలు ఒత్తుగా పెరిగే అవకాశం ఉందంటున్నారు నిపుణులు.

అలాగే జుట్టు దువ్వుకోవడానికి చెక్కతో చేసిన, మందపాటి బ్రిజిల్స్ ఉన్న దువ్వెన ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల జుట్టు రాలే సమస్య తగ్గుతుందంటున్నారు.

అలాగే తలస్నానానికి గోరువెచ్చటి నీళ్లు ఉపయోగించడం, సల్ఫేట్లు లేని షాంపూలు వాడడం మంచిది. ఇక జుట్టు ఆరబెట్టుకోవడానికి బ్లో డ్రయర్స్ వాడకపోవడం.. జుట్టు కర్లీగా లేదా స్ట్రెయిట్‌గా ఉండేందుకు.. హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడేవారు తక్కువ ఉష్ణోగ్రతను సెట్ చేసుకోవడం, వీటిని వాడే ముందు హెయిర్ స్ప్రే/సీరమ్.. వంటివి ఉపయోగించడం.. ఈ చిట్కాలన్నీ జుట్టు రాలకుండా చేస్తాయంటున్నారు నిపుణులు. ఉదయాన్నే మనకు నచ్చిన పనులకు కాసేపు సమయం కేటాయిస్తే.. ఆ రోజంతా ఉల్లాసంగా గడిపేయచ్చు. అయితే ఈ అలవాటు జుట్టు ఎదుగుదలనూ ప్రేరేపిస్తుందట! అదెలాగంటే.. నచ్చిన పనులు చేయడం వల్ల ఒత్తిడి దరిచేరదు. ఇది జుట్టు ఆరోగ్యానికీ మంచిదేనట.

బిగుతుగా జడ వేసుకోవడం లేదంటే బిగుతైన రబ్బర్ బ్యాండ్ ఉపయోగించడం వల్ల జుట్టు తెగిపోయే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే సిల్క్ లేదా శాటిన్ రబ్బర్ బ్యాండ్లు వాడడం.. వదులుగా జడ వేసుకోవడం /ముడేసుకోవడం.. మంచిదంటున్నారు. ఎండ వల్ల చర్మం కందిపోకుండా సన్‌స్క్రీన్ లోషన్ ఎలాగైతే రాసుకుంటామో.. జుట్టు ఆరోగ్యం పాడవకుండా కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బయటికి వెళ్లేటప్పుడు హెయిర్ సీరమ్ రాసుకోవడం, జుట్టు పూర్తిగా కవరయ్యేలా స్కార్ఫ్ కట్టుకోవడం, టోపీ పెట్టుకోవడం.. వంటివి చేయాలి. ఈ చిట్కా కాలుష్యం బారి నుంచీ జుట్టును కాపాడుతుంది.

అయితే ఇవన్నీ ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు కాకుండా.. క్రమం తప్పకుండా పాటించినప్పుడే ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.

## యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను తగ్గించుకునేందుకు నాచురల్ టిప్స్ ఇవిగో..

యాసిడ్ రిఫ్లక్స్ సమస్య ప్రస్తుతం చాలా మందిని ఇబ్బంది పెడుతోంది. వయసుతో సంబంధం లేకుండా ఈ సమస్య అందరిలోనూ కనిపిస్తోంది. పొట్టలోని ఆమ్లం తిరిగి నోటి నుంచి జీర్ణాశయానికి ఆహారం చేరే



గొట్టమైన అన్నవాహికలోకి ప్రవహించినప్పుడు యాసిడ్ రిఫ్లక్స్ ఏర్పడుతుంది. దీనివల్ల ఛాతీలో మంట, అసౌకర్యం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య తరచూ కొనసాగితే అన్నవాహికపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున, పదేపదే వచ్చే లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఆహారపు అలవాట్లు, కొన్ని రకాల ఆహార పదార్థాలు, జీవనశైలి వంటి అంశాలు కొంత మందిలో యాసిడ్ రిఫ్లక్స్‌ను ప్రేరేపిస్తాయి.

యాసిడ్ రిఫ్లక్స్‌ను నియంత్రించుకోవడానికి భోజనం తర్వాత పుదీనా లేని చక్కెర రహిత చూయింగ్‌గమ్‌ను నమలడం ఒక మార్గంగా సూచిస్తున్నారు. చూయింగ్‌గమ్ నమలడం వల్ల తరచూ మింగడం జరుగుతుంది. దీంతో అన్నవాహికలోని ఆమ్లం త్వరగా కిందికి వెళ్లేందుకు సహాయపడుతుంది. అయితే పుదీనా కలిగిన చూయింగ్‌గమ్‌ను నివారించాలని సూచిస్తున్నారు. అలాగే భోజనం తర్వాత కనీసం 10 నిమిషాలు నడవడం, ముఖ్యంగా రాత్రి భోజనం తర్వాత నడవడం కూడా రిఫ్లక్స్ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. ఆహారంలో శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్లు, చక్కెరను తగ్గించుకోవడంపైనా దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. రాత్రివేళ యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను తగ్గించుకోవడానికి పడుకునే విధానంలో కూడా కొన్ని మార్పులు చేసుకోవాలి. మంచం తల భాగాన్ని సుమారు 6 నుంచి 8 ఇంచుల వరకు ఎత్తుగా ఉంచడం వల్ల రాత్రి సమయంలో అన్నవాహికపై ఆమ్లం ప్రభావం పడే సమయం తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అలాగే పడుకునే సమయానికి 2 నుంచి 3 గంటల ముందే భోజనం ముగించాలి. ఆలస్యంగా భోజనం చేయడం వల్ల రాత్రి సమయంలో ఆమ్లం అన్నవాహికపై ఎక్కువసేపు ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నిద్రపోయేటప్పుడు ఎడమవైపు తిరిగి పడుకోవడం కూడా యాసిడ్ రిఫ్లక్స్‌ను నియంత్రించుకోవడానికి సహాయపడే మరో మార్గంగా సూచిస్తున్నారు. వెనుకకు లేదా కుడివైపు పడుకోవడంతో పోలిస్తే ఎడమవైపు పడుకున్నప్పుడు కడుపులోని ఆమ్లం త్వరగా కిందికి వెళ్లి, అన్నవాహికపై ఆమ్లం ప్రభావం పడే సమయం తగ్గుతుందని చెబుతున్నారు. భోజనాన్ని జాగ్రత్తగా తీసుకోవడం, నిద్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను తగ్గించుకోవడానికి ప్రయత్నించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## షుగర్ లెవల్స్ తగ్గేందుకు కఠిన వ్యాయామాలు అవసరం లేదు..

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడానికి ప్రతిరోజూ కఠినమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ సమయం వ్యాయామశాలలో గడపకుండా, ఇంట్లోనే సులభంగా చేయగలిగే కొన్ని శారీరక కదలికలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు.



ముఖ్యంగా భోజనం తర్వాత కొద్దిసేపు కదలడం వల్ల కండరాలు చురుకుగా మారి, శరీరం గ్లూకోజ్‌ను శక్తిగా వినియోగించుకోవడానికి సహాయపడుతుంది. దీంతో భోజనం తర్వాత రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంతవరకు నియంత్రించుకోవచ్చు. రక్తంలో చక్కెరను నిర్వహించుకోవడానికి కాలి కండరాలకు సంబంధించిన వ్యాయామాలు, స్క్వాట్స్, నడక వంటి సులభమైన వ్యాయామాలు ఉపయోగపడతాయి. వీటిలో మొదటిది నిల్చొని లేదా కూర్చొని చేసే కాలి మడమల వ్యాయామం. ఇందులో పాదాలను నేలపై ఉంచి, మడమలను పైకి లేపి తిరిగి కిందకు దించాలి. ఈ కదలిక వల్ల కాలి వెనుక భాగంలోని సోలియస్ కండరం పనిచేస్తుంది. ఈ కండరం గ్లూకోజ్‌ను వినియోగించుకోవడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాయామం చాలా సులభంగా ఉండడంతో ఇంట్లో ఉన్నప్పుడు లేదా కూర్చున్న సమయంలో కూడా చేయవచ్చు. క్రమం తప్పకుండా కండరాలను పనిచేయించడం వల్ల భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరుగుదలను కొంతవరకు తగ్గించుకోవడానికి సహాయపడుతుంది.

రెండోది ఎయిర్ స్క్వాట్స్. వీటిని ఎలాంటి పరికరాలు లేకుండానే చేయవచ్చు. ముందుగా కాళ్లను కొద్దిగా దూరంగా ఉంచి నిలబడాలి. అనంతరం కుర్చీలో కూర్చున్నట్లుగా మోకాళ్లను వంచి శరీరాన్ని కిందకు దించి, తిరిగి పైకి రావాలి. ఈ కదలికలో ముఖ్యంగా తొడలు, కాళ్ల కండరాలు పనిచేస్తాయి. కండరాల కదలిక పెరగడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను వినియోగించుకోవడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా స్క్వాట్స్ దిగువ శరీర కండరాలను బలోపేతం చేయడంలో కూడా ఉపయోగపడతాయి. అందువల్ల వీటిని రోజువారీ వ్యాయామంలో సులభంగా చేర్చుకోవచ్చు. మూడోది భోజనం తర్వాత నడక. ఇందుకోసం ఎక్కువసేపు లేదా వేగంగా నడవాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత కొద్దిసేపు తేలికగా నడిచినా కండరాలు చురుకుగా మారి, శరీరం గ్లూకోజ్‌ను శక్తిగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా భోజనం తర్వాత నడక రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో ఉపయోగపడే జీవనశైలి చర్యల్లో ఒకటిగా ఉంది. కాలి మడమల వ్యాయామం, ఎయిర్ స్క్వాట్స్, భోజనం తర్వాత నడక వంటి సులభమైన కదలికలను రోజువారీ అలవాట్లలో భాగం చేసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిల నిర్వహణకు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

## డెంగ్యూ లక్షణాలుంటేనే చికిత్స

డెంగ్యూ జ్వర బాధితులు పెరుగుతున్నారు. వీళ్లలో పిల్లలే అధికంగా ఉన్నారు. ఇది దోమకాటు వల్ల వచ్చే వైరల్ ఇన్‌ఫెక్షన్. డెంగ్యూ కలిగించే వైరస్‌ని వ్యాప్తి చేసే దోమలు రాత్రి కన్నా పగటి వేళల్లో ఎక్కువగా కుడతాయి. డెంగ్యూ వైరస్ సోకితే మూడు నుంచి అయిదు రోజులు జ్వరం ఉంటుంది. కానీ, డెంగ్యూ లక్షణాలు వెంటనే బయట పడవు. జ్వరం తగ్గిన తర్వాత ఇబ్బందులుంటాయి. పొట్టనొప్పి, వాంతులు, ప్లేట్‌లెట్స్ తగ్గడం, తెల్ల రక్తకణాల తగ్గుదల, నీరసం, బీపీ తగ్గుదల, ముక్కు కారడం వంటి సమస్యలుంటాయి.



డెంగ్యూ నిర్ధారణ కాగానే పేరెంట్స్ భయపడతారు. పిల్లల్ని హాస్పిటల్‌లో చేర్చాలా? అని అడుగుతారు. డెంగ్యూ సోకిన వాళ్లలో తీవ్రత మూడు రకాలుగా ఉంటుంది. వైరస్ వల్ల డెంగ్యూ జ్వరం మాత్రమే ఉంటుంది. కొందరిలో జ్వరం తోపాటు డెంగ్యూ లక్షణాలు బయటపడతాయి. కొద్దిమందిలో డెంగ్యూ లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. డెంగ్యూ లక్షణాలు బయట పడితేనే హాస్పిటల్‌లో చేర్చాలి. తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు, నీరసం, తక్కువగా తినడం, మూత్రం సరిగా పోకపోవడం, ఎక్కువ సమయం నిద్ర పోవడం, చేతులు చల్లబడటం వంటి సమస్య లు ఉంటే హాస్పి టల్‌లో చికిత్స చేయించాలి. డెంగ్యూ తీవ్రంగా ఉంటే ఐసీయూలో చికిత్స అవసరం ఉంటుంది. ఏడాదిలోపు పిల్లల్లో డెంగ్యూ లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. వాళ్లకు డెంగ్యూ సోకిందని తెలియగానే హాస్పిటల్‌లో చేర్పించాలి. యాంటీ బయాటిక్స్‌తో డెంగ్యూని తగ్గించలేము. సెకండరీ ఇన్‌ఫెక్షన్లు ఉంటే యాంటీ బయాటిక్స్ ఇస్తారు. లక్షణాలను బట్టిమందులు, ఫ్లూయిడ్స్ఇస్తారు. డెంగ్యూ వచ్చిన వాళ్లందరికీ ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సిన అవసరం లేదు. ప్లేట్‌లెట్స్‌ని మందులతో పెంచలేము. ప్లేట్స్‌లెట్స్ ఎక్కించాల్సిన అవసరం ఉన్న స్థితిని వైద్యులే నిర్ణయించి చికిత్స చేస్తారు. డెంగ్యూ ఇంట్లో ఇకరికి వస్తే వారి నుంచి మరొకరికి వస్తుందనుకుంటారు.

## థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు మఖానాను తీసుకోవచ్చా..

థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటారు. ముఖ్యంగా హైపోథైరాయిడిజం ఉన్నవారిలో జీవక్రియ మందగించడం, బరువు పెరగడం, అలసట వంటి సమస్యలు కనిపిస్తాయి. మరోవైపు హైపర్‌థైరాయిడిజంలో జీవక్రియ వేగంగా పనిచేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యకరమైన చిరుతిండిగా మఖానాను తీసుకోవచ్చా అనే సందేహం చాలామందికి ఉంటుంది. మఖానాను ఫాక్స్ నట్స్ లేదా లోటస్ సీడ్స్ అని కూడా పిలుస్తారు. సరిగ్గా తయారు చేసి, పరిమితంగా తీసుకుంటే థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఇది మంచి చిరుతిండిగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.థైరాయిడ్ ఆరోగ్యంపై



ప్రభావం చూపే గోయిట్రోజెనిక్ పదార్థాలు కొన్ని ఆహారాల్లో ఉంటాయి. ఇవి శరీరంలో అయోడిన్ వినియోగాన్ని ప్రభావితం చేసి థైరాయిడ్ హార్మోన్ల తయారీపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అయితే మఖానా గోయిట్రోజెనిక్ ఆహారం కాదని ,అందువల్ల థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు మఖానాను పూర్తిగా దూరంగా పెట్టాల్సిన అవసరం లేదని వారు తెలియజేస్తున్నారు. అలాగే 30 గ్రాముల మఖానాలో 110 కేలరీల కంటే తక్కువ శక్తి లభిస్తుంది. ఇందులోని పీచు, సంక్లిష్ట కార్బొహైడ్రేట్లు ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించడంలో సహాయపడతాయి. దీంతో అనారోగ్యకరమైన చిరుతిండ్లకు దూరంగా ఉండేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. మఖానాలో మెగ్నీషియం, కాల్షియం, ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఇవి శరీరంలోని వివిధ జీవక్రియలకు, ఎముకల ఆరోగ్యానికి, మొత్తం పోషక సమతుల్యతకు ఉపయోగపడతాయి. అలాగే మఖానాలో ఉండే కొన్ని యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఇందులోని పీచు జీర్ణవ్యవస్థలోని మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు తోడ్పడుతుంది. అయితే మఖానాను థైరాయిడ్ వ్యాధికి చికిత్సగా భావించకూడదు. దీన్ని సమతుల్య ఆహారంలో ఒక భాగంగా మాత్రమే తీసుకోవాలి. మఖానాను పొడిగా వేయించి, కొద్దిగా నెయ్యి లేదా కొబ్బరి నూనె, తక్కువ మోతాదులో ఉప్పుతో తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అధిక నూనె, ఉప్పు, చక్కెరలు లేదా కృత్రిమ రుచులు కలిగిన ప్యాకేజ్డ్ మఖానాను తరచూ తీసుకోకపోవడం మంచిది. బాదం, వాల్‌నట్స్ లేదా గుమ్మడి గింజలతో కలిపి తీసుకుంటే పోషక విలువ పెరుగుతుంది.

## ఏఎంహెచ్ అంటే ఏమిటి.. సంతానం పొందేందుకు ఇది ఎంత వరకు కీలకం..?

ఏఎంహెచ్ (AMH) అంటే యాంటీ ముల్లేరియన్ హార్మోన్. మహిళల్లో అండాశయాల్లో మిగిలి ఉన్న అండాల సంఖ్యను అంచనా వేయడానికి దీనిని ఒక సూచికగా ఉపయోగిస్తారు. అయితే ఏఎంహెచ్ స్థాయి తక్కువగా ఉందని తేలినంత మాత్రాన గర్భం దాల్చలేరని అర్థం కాదు. ముఖ్యంగా నెలసరి క్రమం తప్పకుండా వస్తున్న మహిళల్లో సహజంగా గర్భం దాల్చే అవకాశం ఉంటుంది.



ఏఎంహెచ్ ప్రధానంగా అండాల సంఖ్య గురించి సమాచారం ఇస్తుంది కానీ వాటి నాణ్యతను నేరుగా తెలియజేయదు. అందుకే తక్కువ ఏఎంహెచ్ ఫలితాన్ని చూసి వెంటనే సంతానలేమి సమస్యగా భావించకూడదు. సాధారణంగా 1.0 ఎంజీ/ఎంఎల్ కంటే తక్కువ ఏఎంహెచ్ ను తక్కువ స్థాయిగా పరిగణిస్తారు. అయితే ప్రయోగశాలలను బట్టి ఈ పరిమితుల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంటుంది. అండాశయ నిల్వకు, గర్భం దాల్చే సామర్థ్యానికి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అండాశయ నిల్వ అంటే అండాశయాల్లో మిగిలి ఉన్న అండాల సంఖ్య. గర్భం దాల్చే సామర్థ్యం మాత్రం అండాల నాణ్యతతో పాటు పురుషుడి వీర్యకణాల ఆరోగ్యం, ఫాలోపియన్ ట్యూబ్‌ల పనితీరు, గర్భాశయ ఆరోగ్యం, అండోత్సర్గం, సరైన సమయంలో కలయిక వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. తక్కువ ఏఎంహెచ్ ఉన్నప్పటికీ అండోత్సర్గం సాధారణంగా జరుగుతుంటే గర్భం దాల్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా 21 నుంచి 35 రోజుల మధ్య క్రమం తప్పకుండా నెలసరి వస్తుంటే అండోత్సర్గం జరుగుతున్నట్లు సూచిస్తుంది. కాబట్టి ఏఎంహెచ్ ఒక్కటినే ఆధారంగా చేసుకుని సంతానోత్పత్తి సామర్థ్యాన్ని నిర్ణయించకూడదు. సంతానోత్పత్తి విషయంలో వయస్సు కూడా చాలా ముఖ్యమైన అంశం. వయసు పెరిగే కొద్దీ అండాల నాణ్యతలో మార్పులు రావడంతో పాటు జన్యుపరమైన అసాధారణతల అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల అండాల సంఖ్య కంటే వాటి నాణ్యత కూడా గర్భధారణలో కీలక పాత్ర పోషిస్తుంది. చిన్న వయసులో ఏఎంహెచ్ తక్కువగా ఉన్న మహిళల్లో అండాల సంఖ్య తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ మిగిలి ఉన్న అండాల్లో ఆరోగ్యకరమైన అండాలు ఉండే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఎక్కువ వయసులో ఏఎంహెచ్ సాధారణంగా ఉన్నప్పటికీ అండాల నాణ్యతలో వయసు కారణంగా మార్పులు వస్తాయి. అందుకే వైద్యులు సాధారణంగా ఏఎంహెచ్ ఫలితాన్ని మహిళ వయసు, నెలసరి క్రమం, అండోత్సర్గం వంటి ఇతర అంశాలతో కలిపి పరిశీలిస్తారు. ఏఎంహెచ్ స్థాయి తక్కువగా ఉండడానికి వయసు పెరగడం, వ్యక్తుల మధ్య సహజమైన తేడాలు, గతంలో అండాశయాలకు జరిగిన శస్త్రచికిత్స, కొన్ని వైద్య చికిత్సలు, జన్యుపరమైన కారణాలు వంటి అంశాలు కారణం అవుతాయి. కొన్నిసార్లు స్పష్టమైన కారణం కూడా కనిపించదు. కాబట్టి తక్కువ ఏఎంహెచ్ ఫలితం వచ్చినప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, దానిని సంతానోత్పత్తికి సంబంధించిన మొత్తం పరిస్థితిలో ఒక భాగంగా మాత్రమే చూడాలని వైద్యులు తెలియజేస్తున్నారు. క్రమం తప్పకుండా నెలసరి వస్తూ అండోత్సర్గం జరుగుతున్న మహిళలు తక్కువ ఏఎంహెచ్ ఉన్నప్పటికీ సహజంగా గర్భం దాల్చే వీలు ఉంటుంది. కొంతమందికి ఎలాంటి వైద్య జోక్యం అవసరం లేకుండానే గర్భధారణ జరుగుతుంది, మరికొందరికి అవసరాన్ని బట్టి సంతానోత్పత్తి చికిత్సలు ఉపయోగపడతాయి.

### అమెరికాలో ఎస్సార్ గ్రూప్ రూ. 1.4 లక్షల కోట్ల పెట్టుబడులు.. ప్రకటించిన ట్రంప్

భారత్‌కు చెందిన దిగ్గజ వ్యాపార సంస్థ ఎస్సార్గ్రూప్ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెట్టనుంది. యూఎస్‌లో తన అనుబంధ సంస్థ మొసాబి మెటాలిక్స్ ద్వారా 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఈవిషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయోవా రాష్ట్రంలో ఉక్కు కార్మాగార నిర్మాణానికి ఎస్సార్గ్రూప్ ఈభారీ మొత్తాన్ని సమకూర్చనుంది. ఈ ఉక్కు కార్మాగారం అమెరికా చరిత్రలోనే అతిపెద్దదని ట్రంప్ అభివర్ణించారు. దీనిద్వారా ప్రతి ఏటా 10మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తికానుందని చెప్పారు. దీని నిర్మాణ సమయంలో 6వేల తాత్కాలిక ఉద్యోగాలు, 2000 మందికి శాశ్వత ప్రాతిపదకన మైనింగ్, తయారీ విభాగాల్లో ఉపాధి దొరకనుందని వెల్లడించారు.




# మరోసారి సిమెంట్ ధరల షాక్..



దేశంలో సిమెంట్ ధరలు పెంచేందుకు కంపెనీలు మరోసారి సన్నద్ధమవుతున్నాయి. అక్టోబర్‌లో బస్తాపై రూ.5 నుంచి రూ.20 వరకు పెరిగే అవకాశం ఉందని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక తెలిపింది. సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా బస్తాకు సగటున రూ.7 చొప్పున సిమెంట్ ధరలు పెరిగాయని, మరోసారి ధరల సవరణ చేపట్టొచ్చిన పేర్కొంది. సిమెంట్ ఉత్పత్తి, రవాణాలో చమురు ధరలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇటీవల కాలంలో చమురు ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో కంపెనీలు ధరలు పెంచే అవకాశం ఉందని నివేదిక తెలిపింది. ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో స్తబ్దుగా ఉన్న సిమెంట్ ధరలు.. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సగటున బస్తాకు రూ.7 చొప్పున పెరిగి రూ.356కి చేరినట్లు పేర్కొంది. దక్షిణాదిలో అత్యధికంగా బస్తాకు రూ.11 చొప్పున పెరగ్గా.. కొన్ని చోట్ల రూ.9, మరికొన్ని చోట్ల రూ.5 చొప్పున పెరిగినట్లు తెలిపింది. కంపెనీల బిల్లింగ్ రేట్లు పెరిగినప్పటికీ, డీలర్లు అమ్మకాల లక్ష్యాల కోసం పాత ధరలకే విక్రయించడం వల్ల వినియోగదారులపై ఆ భారం ఇంకా పూర్తిగా పడలేదని నివేదిక పేర్కొంది.

సెప్టెంబర్ నెలలో వర్షాల కారణంగా కొన్నిచోట్ల నిర్మాణాలు కాస్త నెమ్మదించగా.. మరికొన్నిచోట్ల వర్షపాతం లేని కారణంగా నిర్మాణ కార్యకలాపాలు జోరందుకున్నాయి. దీంతో సిమెంట్ డిమాండ్‌కు ఢోకా ఉండదని కంపెనీలు భావిస్తున్నాయి. అయితే, అక్టోబర్ నెలకు సంబంధించి మార్కెట్ డిమాండ్ పుంజుకోవడం, ధరల పెంపునకు డీలర్ల ఆమోదం పైనే నిర్ణయం ఆధారపడి ఉంటుందని నివేదిక తెలిపింది. ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉంటే బస్తాకు రూ.5–20 మేర పెరిగే అవకాశం ఉందని బ్రోకింగ్ సంస్థ అంచనా వేసింది.

# స్పామ్ కాల్స్‌పై టెల్కోలకు ట్రాయ్ కీలక ఆదేశాలు




వినియోగదారులను వేధించే స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు ట్రాయ్ (TRAI) కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఇకపై కస్టమర్ల ఫిర్యాదు లేకుండానే ఏఐ ఆధారిత స్పామ్ కాల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. ఈ మేరకు ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకోసం టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ నిబంధనలను నోటిఫై చేసింది.

ఇంతకుముందు 1909 లేదా యాప్ ద్వారా వినియోగదారులు ఫిర్యాదు చేస్తేనే టెలికాం కంపెనీలు చర్యలు తీసుకునేవి. ఇప్పుడు అలా కాదు. నెట్‌వర్క్‌లోని ఏఐ లేదా మెషిన్ లెర్నింగ్ సిస్టమ్‌లు ఏదైనా కాల్‌ను స్పామ్‌గా గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఏఐ గుర్తించిన స్పామ్ కాల్‌ను సంబంధిత టెల్కో.. ఆ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందో టెలికాం ఆపరేటర్‌కు 2 గంటల్లోగా సమాచారం ఇవ్వాలి. సమాచారం అందుకున్న ఆపరేటర్ ఒక పనిదినంలో ఆ నంబర్ తాలూకు కేవైసీ ఆధారాలను సేకరించి మిగతా అన్ని టెలికాం కంపెనీలతో పంచుకోవాలి. సమాచారం అందుకున్న టెల్కోలు తమ నెట్‌వర్క్‌ల ద్వారా స్పామర్ ఏదైనా అనుమానిత కాల్స్‌కు ప్రయత్నించాడా? లేదా చెక్ చేయాలి. గత 10 రోజుల్లో అదే వ్యక్తి/సంస్థ కేవైసీకి అనుసంధానం అయిన 5 లేదా అంతకంటే ఎక్కువ నంబర్లు స్పామ్‌గా తేలితే స్పామర్‌పై టెలికాం కంపెనీలన్నీ సమష్టిగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏఐ సిస్టమ్స్ మొదటిసారి స్పామ్‌గా గుర్తిస్తే.. స్పామర్‌పై ఉన్న అన్ని సిమ్ కార్డులు, కనెక్షన్ల నుంచి అవుట్‌గోయింగ్ సేవలను 15 రోజుల పాటు అన్ని నెట్‌వర్క్‌లు నిలిపివేస్తాయి. తరచూ స్పామ్ కాల్స్ చేసినట్లు గుర్తిస్తే.. ఏడాది పాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతారు. ఏ టెల్కో కూడా కొత్త కనెక్షన్ ఇవ్వదు.

ట్రూకాలర్ లేదా ఇతర కాల్ మేనేజ్‌మెంట్ యాప్‌లు ప్రభుత్వం, బ్యాంకులు లేదా అధీకృత సేవల కోసం కేటాయించిన ప్రత్యేక నంబర్లను స్పామ్‌గా ట్యాగ్ చేయడం, బ్లాక్ చేయడంపై ట్రాయ్ నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే ఫోన్‌లో నచ్చిన నంబర్‌ను కస్టమర్లు బ్లాక్ చేసుకునే వెసులుబాటు ఉందని ట్రాయ్ స్పష్టం చేసింది. ప్రమోషనల్ కాల్స్ నంబర్లను ఆపాలనుకునే వారు.. ఇకపై 1909కు బ్లాక్ ప్రోమో అని ఎస్సెమ్మెస్ పంపాలి. దీనివల్ల అనవసర మార్కెటింగ్ కాల్స్ మాత్రమే ఆగుతాయి. బ్యాంకింగ్ సేవలు, లావాదేవీలు, ప్రభుత్వానికి సంబంధించిన సేవలకు ఎలాంటి ఆటంకం ఉండదు. ప్రస్తుతం ఉన్న యూజర్లు అందరూ 15 రోజుల్లో ఆటోమేటిక్‌గా ఈ కొత్త కేటగిరీకి బదిలీ అవుతారు.

# ఏఐ వల్ల బేసిక్ మ్యాథ్స్‌ను పిల్లలు మర్చిపోతున్నారు: ఎన్విడియా సీఈఓ



కృత్రిమ మేధ (AI)కారణంగా పిల్లలు ప్రాథమిక గణితాన్ని మర్చిపోతున్నారని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ ఆందోళన వ్యక్తం చేశారు. హోంవర్క్‌ను త్వరగా పూర్తి చేయడానికి విద్యార్థులు ఏఐపై ఎక్కువగా ఆధారపడుతున్నారని, దీనివల్ల సొంతంగా ఆలోచించే శక్తి తగ్గుతుందన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాడ్‌కాస్ట్‌లో పిల్లలపై ఏఐ ప్రభావం ఏ మేర ఉందనే ప్రశ్న ఎదురవ్వగా.. జెన్సన్ హువాంగ్ తనదైన శైలిలో స్పందించారు. 'ఏఐ వల్ల ప్రాథమిక గణితాలను పిల్లలు మర్చిపోతున్న మాట నిజమే. కానీ, భవిష్యత్తులో ఇది ఏఐ ప్రపంచానికి పెద్ద సమస్యగా మారకపోవచ్చు. యువతరం చిన్న చిన్న విషయాలను మర్చిపోయినా.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంలో, అత్యున్నతంగా ఆలోచించడంలో ముందుంటున్నారు' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ.. ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీకి నాయకత్వం వహిస్తున్న తాను కూడా ఒక సందర్భంలో తన ఇంటి చిరునామాను మర్చిపోయానని గుర్తు చేసుకున్నారు.

### రెండో రోజూ నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా క్రూడాయిల్ ధరలు గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నాయి. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఈ క్రమంలోనే సూచీలు ఆరు నెలల కనిష్ఠ స్థాయికి చేరాయి. సెన్సెక్స్ ఉదయం 72,633.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 72,771.72) నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో భారీ నష్టాల్లోకి సూచీ జారుకుంది. దాదాపు 700 పాయింట్ల నష్టంతో 72,064.00 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 242.65 పాయింట్ల నష్టంతో 72,529.07 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 64.05 పాయింట్ల నష్టంతో 22,716.20 వద్ద స్థిరపడింది.

# ఏఐ మోడళ్లు అదుపు తప్పకుండా చెక్ పెట్టే కొత్త సాఫ్ట్‌వేర్.. ఆవిష్కరించిన ఎన్విడియా




ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఏఐ మోడళ్లకు నేర్పించి.. ఇప్పుడు అవి అదుపు తప్పుతున్నాయని కృత్రిమ మేధ సంస్థల అధిపతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నియంత్రించలేని స్థాయిలో అవి ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్విడియా సంస్థ కీలక ప్రకటన చేసింది. ఆ ఏఐ ఏజెంట్లు అదుపు తప్పకుండా కట్టడి చేసే సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. దానిపేరు ఓపెన్ ఏజెంట్ సేఫ్టీ ఫ్లాట్‌ఫామ్. ఈ ఓపెన్ ఏజెంట్ సేఫ్టీ ప్లాట్‌ఫామ్ రెండు కీలక విధులు నిర్వర్తిస్తుంది. ఏఐ ఏజెంట్‌కు ఎంతవరకు అనుమతి ఉందో నిర్ధరించి.. అంతకుమించి పరిమితులు దాటకుండా చూస్తుంది. దీనిని ఓపెన్‌షెల్‌గా చెప్తున్నారు. మరొకటి సెంట్రీ. ఇది చిప్స్‌లో అంతర్గతంగా పని చేసే నిఘా వ్యవస్థ వంటిది. ఎప్పటికప్పుడు ఏఐ ఏజెంట్ల కార్యకలాపాలను పరిశీలిస్తూ ఉంటుంది. ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే.. తక్షణమే అడ్డుకుంటుంది. '' ఓపెన్‌షెల్.. ఏజెంట్ చర్యలను నియంత్రిస్తుంది. సెంట్రీ స్వతంత్రంగా వ్యవహరిస్తూ.. అనుమానాస్పద ప్రవర్తనను అరికడుతుంది'' అని ఎన్విడియా ఉన్నతాధికారి జస్టిన్ బొయిటానో వెల్లడించారు. ఈ కొత్త సాఫ్ట్‌వేర్ లాంచింగ్ సమయానికే.. మైక్రోసాఫ్ట్, పర్‌ప్లెక్సిటీ, జేపీమోర్గాన్ చేజ్ సహా 100కు పైగా సంస్థలు దీనిని వినియోగిస్తున్నాయని ఎన్విడియా తెలిపింది. సరికొత్త ఏఐ మోడల్ అస్త్ర 6.1 విడుదలను ఓపెన్ ఏఐ సంస్థ నిలిపివేసింది. అంతర్గతంగా నిర్వహించిన పరీక్షల్లో ఈ మోడల్ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది.






### 11 ఏళ్లకే మహిళా గ్రాండ్‌మాస్టర్

అత్యంత పిన్న వయసులో మహిళా గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన ప్లేయర్‌గా భారత సంతతికి చెందిన బోధన శివానందన్ రికార్డు సృష్టించింది. ఈ బ్రిటన్ అమ్మాయి 11 ఏళ్లకే డబ్ల్యూజీఎం అయింది. లండన్‌లో పాఠశాల విద్యార్థిని అయిన బోధన.. ఉజ్బెకిస్థాన్‌లో ముగిసిన చెస్ ఒలింపియాడ్‌లో ఇంగ్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించింది. 11 రౌండ్లలో 8 పాయింట్లతో టోర్నీలో ఆ దేశం తరఫున అత్యుత్తమ ప్లేయర్‌గా నిలవడమే కాదు.. డబ్ల్యూజీఎంకు అవసరమైన చివరి నార్మ్‌నూ ఆమె సాధించింది. ఈ క్రమంలో బోధన.. 12 ఏళ్లకే మహిళా గ్రాండ్‌మాస్టర్ అయి రికార్డు నెలకొల్పిన కేథరినా లాగ్నో (రష్యా)ను అధిగమించింది.

# ఆసియా క్రీడల్లో వ్యక్తిగత విభాగంలో తొలి స్వర్ణం

ఆసియా క్రీడల్లో 10వరోజు భారత్ గన్ గట్టిగా పేలింది. 2026 సీజన్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణం లోటు తీర్చి చరిత్ర సృష్టించారు షూటర్ నీరూదండా. మహిళల ట్రాప్ షూటింగ్‌లో నీరూ తొలిస్థానంలో నిలిచి.. పసిడిని చేజిక్కించుకున్నారు. ఈ విజయంతో ఆసియా క్రీడల్లో భారత్‌కు ఐదో బంగారు పతకం సొంతమైంది. ఇప్పటికే మహిళల ట్రాప్ షూటింగ్ టీమ్ ఈవెంట్‌లో నీరూ రజత పతకాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆ బృందంలో ఆమెతో పాటు ఆషిమా అహ్లావత్, మనీషా కీర్ ఉన్నారు.

ఈ ఆసియా క్రీడల్లో మహిళల క్రికెట్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో తొలి స్వర్ణాన్ని దక్కించుకోగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్, కమల్‌జీత్ జంట పసిడి సొంతం చేసుకుంది. ఇక కబడ్డీలో మహిళల, పురుషుల టీమ్‌లు పసిడి కూతపెట్టాయి. అయితే ఇవన్నీ టీమ్ ఈవెంట్స్. నీరూ స్వర్ణంతో పతకాల పట్టికలో భారత్ ఒక స్థానం ముందుకు వెళ్లింది. 5 బంగారు, 21 రజత, 21 కాంస్య పతకాలతో 11 స్థానంలో నిలిచింది. షూటింగ్ సంచలనం నీరూదండా.. హరియాణాలోని జింద్ ప్రాంతానికి చెందినవారు. ఆమె కుటుంబానిది గ్రామీణ నేపథ్యం. తన కజిన్ లక్షయ్ షెరాన్ (Lakshay Sheoran) 2018 ఆసియా గేమ్స్‌లో ట్రాప్ షూటింగ్‌లో రజత పతకం గెలిచాడు. అతడి ఆటను చిన్నతనం నుంచి చూస్తూ పెరిగారు నీరూ. ఆ ఆసక్తే ట్రాప్ షూటింగ్‌ను సీరియస్‌గా తీసుకునేలా చేసింది. లక్షయ్ సహకారం కూడా తోడైంది. అతడు ఇచ్చిన తుపాకీతో సాధన ప్రారంభించారు. అంతేగాకుండా తన కుటుంబానికి చెందిన డబుల్ బ్యారెల్ తుపాకీతో ఖాళీ టిన్ (tin cans)లకు గురిపెట్టి ప్రాక్టీస్ చేసేవారు. మెరుగైన శిక్షణ కోసం హరియాణా నుంచి మధ్యప్రదేశ్ వచ్చి షూటింగ్ అకాడమీలో చేరారు. ఆ శిక్షణే ఆమె అంతర్జాతీయ వేదికలపై మెరిసే దిశగా తీర్చిదిద్దింది.



2022లో క్రొయేషియాలో జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో అరంగేట్రం చేశారు. 2025లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో తొలి బంగారు పతకాన్ని గెల్చుకున్న ఆమె.. 2026 ఇటలీలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణాన్ని ఎగరేసుకుపోయారు. ఈ అంతర్జాతీయ టోర్నీలో ట్రాప్ షూటింగ్‌లో స్వర్ణం గెలిచిన తొలి భారతీయురాలిగా నిలిచారు. ఇప్పుడు మళ్లీ 2026 ఆసియా క్రీడల్లో వ్యక్తిగత విభాగంలో తొలి బంగారు పతకాన్ని అందించి.. చరిత్ర సృష్టించారు. ఒకవైపు ఆటలో రాణిస్తూనే దేశ సేవ చేస్తున్నారు. భారత సైన్యంలో నాయబ్ సుబేదార్ (Naib Subedar) హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో మవూలోని ఆర్మీ మార్క్‌మ్యాన్‌షిప్ యూనిట్‌లో శిక్షణ పొందుతోన్న నీరూ క్రీడా ప్రయాణంపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం




జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ మరో స్వర్ణం గెలుచుకుంది. 4x400 మీటర్ల రిలేలో మహిళల బృందం పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. కిరణ్ పహల్, పూవమ్మ మచెట్టిర, ప్రాచి, విత్య రామ్‌రాజ్‌లతో కూడిన బృందం.. 3:29.69 నిమిషాల్లో రిలే పూర్తిచేసి అగ్రస్థానంలో నిలిచింది. బహ్రెయిన్, చైనా వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ ఆసియా క్రీడల్లో ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం. మరోవైపు, 4×400 మీటర్ల రిలే ఫైనల్స్‌లో పురుషుల జట్టు కాంస్య పతకం సాధించింది. దీంతో ఇప్పటివరకు ఆసియన్ మ్స్‌లో భారత్ సాధించిన పతకాల సంఖ్య 52కి పెరిగింది. వీటిలో ఆరు స్వర్ణ పతకాలు కాగా.. 21 రజతం, 25 కాంస్య పతకాలు ఉన్నారు.

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ తన అద్భుతమైన ఫామ్ కొనసాగిస్తున్నాడు. తాజాగా పురుషుల 5,000 మీటర్ల విభాగంలో కాంస్యం సాధించాడు. ఈ క్రీడల్లో అతడికి ఇది మూడో పతకం కావడం విశేషం. అంతకుముందు 1,500 మీటర్లు, 10,000 మీటర్ల ఈవెంట్లలో రజత పతకాలు గెలుచుకున్నాడు. ఒకే ఎడిషన్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో మూడు పతకాలు గెలుచుకున్న రెండో భారత పురుష క్రీడాకారుడిగా నిలిచాడు.

## పీటీ ఉష రికార్డు బద్దలుకొట్టి..

400 మీటర్ల హర్డిల్స్.. ఈ పేరు చెప్పగానే దిగ్గజ అథ్లెట్ పీటీ ఉషనే గుర్తుకొస్తుంది. ఈ విభాగంలో ఆమె సాధించిన ఘనతలు అలాంటివి మరి. జపాన్ ఆసియా క్రీడల్లో మరోసారి ఉష పేరు వార్తల్లోకి వచ్చింది. దానికి కారణం విద్య రామ్‌రాజ్. 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం గెలిచిన విద్య.. ఉష సుదీర్ఘ కాల రికార్డును అధిగమించింది. వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన (54.75 సెకన్లు)తో ఆమె కాంస్య పతకం గెలుచుకుంది. పీటీ ఉష (55.42 సె) పేరిట నాలుగు దశాబ్దాలుగా ఉన్న జాతీయ రికార్డును విద్య బద్దలు కొట్టింది. 1984 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో ఉష ఈ రికార్డును నెలకొల్పింది. విద్యకు ఈ ఏషియాడ్‌లో ఇది రెండో పతకం. 4×400 మిక్స్‌డ్ రిలేలో రజతం గెలిచిన భారత జట్టులో విద్య సభ్యురాలు. తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన విద్యది పేద కుటుంబం. ఆమె తండ్రి ఓ ట్రక్ డ్రైవర్. విద్య తల్లి పిల్లలకు ఏదో ఒక ఆట నేర్పించాలనుకుంది. కానీ ఖర్చులు భరించే స్తోమత ఆ కుటుంబానికి లేదు. దీంతో విద్య, ఆమె కవల సోదరి నిత్యను క్రీడా ప్రాధికార సంస్థ హాస్టల్‌లో చేర్చారు. అక్కడే కోచ్ నేహాపాల్ సింగ్ ప్రోత్సాహంతో అథ్లెటిక్స్‌ను ఎంచుకుంది. మొదట్లో 100, 200 మీటర్లపై దృష్టి పెట్టింది. 2017లో 400 మీటర్ల హర్డిల్స్‌లోకి వచ్చింది. ఆమె సోదరి నిత్య కూడా స్ప్రింట్‌లో ఎదిగింది. ఆ తర్వాత పటియాలా జాతీయ శిబిరానికి ఎంపిక కావడం అక్కాచెల్లెళ్లను ఆటలో మరింత రాటుదేల్చింది. 2022 ఆసియా క్రీడల్లో 4×400 మీటర్ల రిలే




ఈవెంట్లలో రజతాలు గెలిచిన జట్లలో విద్య సభ్యురాలిగా ఉంది. 400 మీటర్ల హర్డిల్స్‌లో విద్య కాంస్యం సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడిన 4×400 మీటర్ల రిలే జట్టులోనూ విద్య కూడా ఉంది.

## గణాంకాల కోసం ఆడితే ఇంతకాలం కొనసాగలేం..: కోహ్లి

వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు గెలుపే తనకు ముఖ్యమని టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అన్నాడు. విండీస్‌తో తొలి వన్డేలో సెంచరీతో చెలరేగిన విరాట్.. ఈ ఫార్మాట్‌లో (ODI) 15 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ.. ఈ మైలు రాయి తనకు ప్రత్యేకమైనదే అయినప్పటికీ.. జట్టు విజయంతో దానిని అందుకోవడం మరింత సంతోషంగా ఉందని చెప్పాడు. ''వ్యక్తిగతంగా ఎన్ని పరుగులు చేశామనేది ముఖ్యం కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా జట్టును గెలిపించేందుకు కృషి చేయాలి. నేను ఎప్పుడూ అదే పట్టుదలతో ఆడుతా. గణాంకాల కోసం ఆడితే ఇంతకాలం కొనసాగలేం. రికార్డుల కోసం ప్రయత్నిస్తే ప్రధాన లక్ష్యాన్ని పక్కన పెట్టాల్సి వస్తుంది'' అని ఈ రికార్డుల రారాజు పేర్కొన్నాడు.




కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి బ్యాటింగ్ చేయడంపై కోహ్లీ స్పందించాడు. ''గిల్‌తో నాకు ఎప్పటి నుంచో మంచి అనుబంధం ఉంది. అతనికి ఆటపై స్పష్టమైన అవగాహన ఉంది. అందుకే బ్యాటింగ్ సమయంలో ఇద్దరం ఎక్కువగా మాట్లాడుకోం. అవసరమైనప్పుడు మాత్రమే నా అనుభవంతో సూచనలు ఇస్తా. ఒత్తిడి సమయంలో సీనియర్ ఆటగాళ్లు జట్టులో సానుకూల వాతావరణం కల్పించాలి. సీనియర్లు నవ్వుతూ, సరదాగా ఉంటే మిగతా ఆటగాళ్లలోనూ ఒత్తిడి తగ్గుతుంది.

# మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న నేచురల్ స్టార్ నాని, 'ది ప్యారడైజ్' టీం



**వుదయం సినిమా:** నేచురల్ స్టార్ నాని లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ 'ది ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద దూసుకు పోతోంది. ఈ సినిమా సక్సెస్‌ను పురస్కరించుకొని చిత్ర బృందం తాజాగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మేడారం సమ్మక్క-సారల మ్మలను దర్శించుకున్నారు.నాని, చిత్ర బృందానికి ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అమ్మవార్ల సన్నిధికి చేరుకున్న నాని వనదేవతలకు తమ బరువుకు తూగేలా నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల ఆశీస్సులు తీసుకున్నారు. పూజారులు చిత్ర బృందానికి అమ్మవారి ప్రసాదం అందజేశారు.నానిని చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వీటికి సంబంధించిన విజువల్స్, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబోలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది ప్యారడైజ్' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ అద్భుతమైన కలెక్షన్లతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

# వుదయం సినిమా
MOVIE TIME!

# తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లు అర్జున్ భార్య స్నేహా రెడ్డి



**వుదయం సినిమా:** స్నేహా రెడ్డి అంటే చాలామందికి ముందుగా గుర్తుకు వచ్చేది స్టార్ హీరో అల్లు అర్జున్ భార్యగానే. అయితే ఆమె తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వ్యాపార వేత్తగా, తల్లిగా, ఫిట్‌నెస్ ప్రియురాలిగా, డిజిటల్ పర్సనాలిటీగా స్నేహా రెడ్డి తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారు. సోషల్ మీడియాలో ఆమెకు 91 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. స్నేహారెడ్డి నిర్వహిస్తున్న పికాబూ (Picaboo) స్టూడియో ఆమె వ్యాపార ప్రయాణంలో ముఖ్యమైన భాగంగా ఉంది. మరోవైపు ఫిట్‌నెస్, ఆరోగ్యంపై కూడా ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. తరచూ తన వర్కౌట్స్, యాక్టివ్ లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. కుటుంబానికి కూడా స్నేహా రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. తన పిల్లలతో కలిసి గడిపే అందమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు.

# 'ఎమో ఎమో ఇది' టైటిల్ సాంగ్ విడుదల



**వుదయం సినిమా:** యువ కథానాయకుడు రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎమో ఎమో ఇది'. డా. శైలేష్ కొలను రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.చిత్ర ప్రకటన సమయంలో విడుదల చేసిన 'ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ #EmoEmoIdi' వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఆ వీడియోతో సినిమాలోని ఆహ్లాదకరమైన ప్రేమకథా ప్రపంచాన్ని పరిచయం చేసిన మేకర్స్.. ఇప్పుడు మరింత అందమైన అనుభూతిని పంచేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎమో ఎమో ఇది' టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు.సున్నితమైన మెలోడీ, హృదయాన్ని హత్తుకునే సాహిత్యంతో రూపొందిన ఈ పాట ఆద్యంతం ఆహ్లాదకరమైన ప్రేమానుభూతిని పంచుతుంది. రోషన్ మేకా, ప్రీతి ముఖుందన్ మధ్య కనిపించే అందమైన కెమిస్ట్రీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంచుతో కప్పబడిన పర్వతాలు, అద్భుతమైన ప్రకృతి దృశ్యాల నేపథ్యంలో తెరకెక్కించిన విజువల్స్ పాటకు డ్రీమీ రొమాంటిక్ ఫీల్‌ను అందిస్తున్నాయి.ఈ పాటకు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతంఅందించగా, కార్తీక్, రమ్యబెహరా తమ మధురమైన గాత్రాలతో ఆలపించారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. అద్భుతమైన మెలోడీ, హృదయాన్ని హత్తుకునే గానం, కనువిందు చేసే విజువల్స్ కలగలిసి 'ఎమో ఎమో ఇది' టైటిల్ సాంగ్‌ను ఈ సీజన్‌లోని సరికొత్త లవ్ ఆంథమ్ గా నిలిపాయి.

# అక్టోబర్ 15 'ది ట్రైటర్స్ తెలుగు'..

**వుదయం సినిమా:** అంతర్జాతీయంగా ఆదరణ పొందిన గ్లోబల్ ఫ్రాంచైజ్ 'ది ట్రైటర్స్'ను తెలుగులోకి తీసుకొస్తున్న ప్రైమ్ వీడియో..
హోస్ట్‌గా తొలిసారి రియాలిటీ షోలోకి హీరో తేజ సజ్జ20 మంది విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొనే ఈ హై-ఆక్టేన్ షో..
నాలుగు వారాల పాటు 10 ఎపిసోడ్స్‌గా ప్రసారంఎక్స్‌క్లూజివ్ ఒరిజినల్స్‌తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తున్న ప్రైమ్ వీడియో..



తన అన్‌స్క్రిప్టెడ్ ఒరిజినల్ 'ది ట్రైటర్స్ తెలుగు' వరల్డ్ ప్రీమియర్ తేదీని ప్రకటించింది. నమ్మకం, మైండ్ గేమ్స్, మోసం, హై-స్టేక్స్ డ్రామాతో సాగే ఈ ఆసక్తికరమైన రియాలిటీ గేమ్ షో అక్టోబర్ 15, 2026 నుంచి ప్రపంచవ్యాప్తంగా స్ట్రీమింగ్ కానుంది.SOL ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సిరీస్‌తో అవార్డు గెలుచుకున్న 'ది ట్రైటర్స్' ఫార్మాట్ తొలి సారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీలో ఇప్పటికే రెండు సీజన్లకు వచ్చిన అద్భుతమైన స్పందన తర్వాత.. ఈ ఫ్రాంచైజ్‌ను తెలుగులోకి తీసుకొస్తున్నారు. ప్రముఖ హీరో తేజ సజ్జ ఈ షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ తొలి సారి రియాలిటీ హోస్ట్‌గా పరిచయం కానున్నారు.10 ఎపిసోడ్స్‌తో రూపొందిన ఈ సిరీస్‌లో విభిన్న రంగాలకు చెందిన 20 మంది ప్రముఖులు పాల్గొంటారు. ఇక్కడ నమ్మకం ఒక క్షణంలో బలంగా మారవచ్చు.. మరుసటి క్షణంలో అదే బలహీనతగా మారవచ్చు. తేజ సజ్జ తనదైన స్పాంటేనియిటీ, ఎనర్జీతో ఈ షోకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకురానున్నారు.'ది ట్రైటర్స్ తెలుగు' నాలుగు వారాల పాటు తెలుగు భాషలో, ఇంగ్లిష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఎక్స్‌క్లూజివ్‌గా స్ట్రీమింగ్ కానుంది. ప్రతి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు (IST) కొత్త ఎపిసోడ్స్ విడుదల కానున్నాయి. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రియాలిటీ ఫార్మాట్స్‌లో 'ది ట్రైటర్స్' ఒకటి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాల్లో స్థానిక వెర్షన్స్‌తో ఈ ఫార్మాట్ గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫ్రాంచైజ్‌గా ఎదిగింది. ఇప్పుడు తెలుగు వెర్షన్‌లోకి అడుగుపెడుతున్నప్పటికీ.. గేమ్ రూల్స్ మాత్రం అదే. కానీ ఆటలో ఏం జరుగుతుందనేది మాత్రం పూర్తిగా సస్పెన్స్. దాగి ఉన్న ఐడెంటిటీస్, సీక్రెట్ అలయన్స్‌లు, వ్యూహాత్మక ఎత్తుగడలు, ఊహించని ద్రోహాలు.. కంటెస్టెంట్స్ ఒకరినొకరు ఎంత బాగా అర్థం చేసుకోగలరో పరీక్షించనున్నాయి. గేమ్‌లోని 'ఇన్నోసెంట్స్' తమ మధ్య దాగి ఉన్న 'ట్రైటర్స్' ను సమయం మించక ముందే గుర్తించాల్సి ఉంటుంది.

# 'గోల్డెన్ భాగ్యం'- ఫుల్ ఫన్ టైటిల్ గ్లింప్స్ రిలీజ్

**వుదయం సినిమా:** కామెడీ పవర్ హౌస్‌లు సత్య, యోగిబాబు కలిసి ఓ కొత్త కామెడీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబో తున్నారు. 'రంగబలి' ఫేమ్ పవన్ బాసంశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ మూవీ మేకర్స్, నయవాయు చిత్రాలు బ్యానర్లపై నాగార్జున రెడ్డి, పవన్ బాసంశెట్టి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ రెండు బ్యానర్లకు ఇదే తొలి ప్రొడక్షన్ వెంచర్. తాజాగా చిత్ర బృందం టైటిల్ రివీల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఎలా ఉండబోతుందో గ్లింప్స్ ద్వారా పరిచయం చేశారు.ఇది తెలుగు, తమిళ భాషలను కలిపి, రెండు ఇండస్ట్రీలకు చెందిన పాపులర్ యాక్టర్స్‌తో తెరకెక్కుతున్న 'తెలుమిల్' ప్రాజెక్ట్. గ్లింప్స్ ప్రారంభంలో ఓ తెలుగు వ్యక్తి, ఓ తమిళ వ్యక్తి తమకు ఇష్టమైన ఆహారాన్ని ఆస్వాదిస్తూ.. తమ వంటకాలే బెస్ట్ అంటూ గొప్పగా చెప్పుకోవడం నవ్వులు పూయిస్తుంది. తెలుగు వ్యక్తి బిర్యానీతో పాటు కూల్ డ్రింక్‌ను ఆస్వాదిస్తుండగా.. తమిళ వ్యక్తి ఇడ్లీ, సాంబార్ తింటూ కనిపిస్తాడు. వీరిద్దరి మధ్య సరదా వాదన జరుగుతుండగా.. మరో వ్యక్తి ఎంట్రీ ఇచ్చి, ఇంతకంటే పెద్ద కాంబినేషన్ ముందుందని చెప్పడంతో సీన్ మరింత ఆసక్తికరంగా మారుతుంది. ఆ తర్వాత సత్య, యోగిబాబులను స్టైలిష్‌గా పరిచయం చేశారు.



# 'కామ్రేడ్ కళ్యాణ్' రివల్యూషనరీ సాంగ్ ఎత్తర ఎత్తు



**వుదయం సినిమా:** 'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తు న్నారు.ఇ ప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి ఎత్తర ఎత్తు సాంగ్ లాంచ్ చేశారు.విజయ్ బుల్గానిన్ రివల్యూషనరీ ఫ్లేవర్ ఉన్న పాటను కంపోజ్ చేశారు. నల్గొండ గద్దర్ నర్సన్న తన ప్రత్యేకమైన వాయిస్‌తో పవర్‌ఫుల్ ఎనర్జీని అందించగా, భాస్కరభట్ల రాసిన లిరిక్స్ పాటకు రివల్యూషనరీ ఫీల్‌ను తీసుకొచ్చాయి.శ్రీ విష్ణు పవర్ ఫుల్ పర్ఫార్మెన్స్, పాటలోని బీట్, లిరిక్స్ కలిసి 'ఎత్తర ఎత్తు' ఫుల్ ఎనర్జిటిక్ స్ఫూర్తి నింపే పాటగా ఆకట్టుకుంది. ఈ సాంగ్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నటుడు నవీన్ చంద్ర

**వుదయం సినిమా:** ప్రముఖ సినీ నటుడు నవీన్ చంద్ర మంగళవారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. విఐపి విరామ సమయంలో స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు నవీన్ చంద్రకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, పట్టు వస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆలయం వెలుపల నవీన్ చంద్ర మీడియాతో మాట్లాడుతూ... "తలపెట్టిన పనులు విఘ్నాలు లేకుండా నెరవేరాలని శ్రీవారిని ప్రార్థించాను. తిరుమల నుంచే నా కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నాం. డైరెక్టర్ శ్రీకాంత్‌తో కలిసి మంత్ ఆఫ్ మధు సినిమా తరువాత మళ్లీ కాంబినేషన్‌లో చేస్తున్న ఈ రెండో చిత్రం ప్రేక్షకులకు ఒక పెద్ద సర్‌ప్రైజ్‌గా ఉండబోతోంది" అని పేర్కొన్నారు. అలాగే రాబోయే రోజుల్లో తనవి తమిళంలో మూడు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఆయనతో పాటు దర్శకుడు శ్రీకాంత్ నాగోతి, డిస్ట్రిబ్యూటర్ & నిర్మాత హరీష్ కుమార్ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.ఇదే సందర్భంగా ఇటీవల SVBC చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ వర్మను కలసి అభినందించారు. తమ కుటుంబానికి గత 15 ఏళ్లుగా శ్రీధర్ వర్మతో మంచి పరిచయం ఉందని తెలిపారు.



# "తత్వం" సాధించే విజయంతో మా కష్టాలన్నీ మరిచిపోతాం: యువ దర్శకుడు అర్జున్ కోలా

**వుదయం సినిమా:** అర్జున్ కోలా దర్శకత్వంలో దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తత్వం' త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శీమకుర్తి వంశీ కృష్ణ , శ్వేత పసుపు లేటీ ఈ చిత్రాన్ని నిర్మించారు. మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లేతో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. ఇటీవల విడుదల ఈ చిత్రం ట్రైలర్‌కు, పాటలకు అనూహ్యమైన స్పందన వచ్చింది. అక్టోబర్ 2న చిత్రం థియేటికల్ విడుదలకు సిద్ధమైంది. ఈ సంద ర్భంగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ " తత్వం సినిమాను ఎవరు మిస్ కాకండి. ఖచ్చితంగా అందరికి నచ్చుతుంది. పాషనేటెడ్ పీపుల్ అంతా లైఫ్ పెట్టి ఈసినిమా చేశారు. మీరు చూసి ఈ మంచి సినిమా గురించి నలుగురుకి చెప్పండి. అందరూ ఇలాంటి సినిమాను ఎంకరైజ్ చేసే బాధ్యత మీపై ఉంది. అందరూ ఈ సినిమాను ఎంతో ఇష్టపడి చేశారు. తప్పకుండా ఈ సినిమా మంచి మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది' అన్నారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ " ఈ సినిమా సమయంలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశాం. మేము ఫేస్ చేసిన స్ట్రగుల్స్‌కు మళ్లీ మేము వచ్చి సినిమా విడుదల చేస్తాం అని ఎవరూ అనుకోలేదు.




Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.